.... నిపుణ పేజీల్లో ....
- తెలుగులో అచ్చు వేసిన మొదటి గ్రంథం ఏది?
- తపథి సవర్ణోపాఖ్యానం అనే గ్రంథాన్ని రాసింది?
- చార్‌మినార్‌ను ఏ సంవత్సరంలో నిర్మించారు?
- హైదరాబాద్‌ను సుల్తాన్‌పూర్‌గా పిలిచిన రాజు?
- మక్కామసీదును కీర్తించిన విదేశీ యాత్రికుడు?

# నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక

- ఏఐ టూల్‌తో 18 లక్షలు కొట్టేశారు!
- రెడ్‌లైట్‌తో అంగస్తంభన సమస్యకు చెక్!
- యూజీసీలో అన్నీ అక్రమాలే: న్యాక్ చైర్మన్
- థాణేలో పావురాలకు గింజలేస్తే 500 ఫైన్
- స్టాండింగ్ కమిటీల్లో ధన్‌కర్ వ్యక్తిగత సిబ్బంది

..లోపలి పేజీల్లో

గురువారం 9.3.2023
- సంపుటి 12
- సంచిక 274
- వెల. రూ.6.50

హైదరాబాద్
పేజీలు: 12+16/12

గురువారం, సూర్యోదయం: 6-29, సూర్యాస్తమయం: 6-24. శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం శిశిర రుతువు ఫాల్గుణ మాసం కృష్ణ పక్షం తిథి: విదియ రాత్రి 8-54 వరకు. నక్షత్రం: హస్త తెల్లవారుజామున 5-57 వరకు. వర్జ్యం: పగలు 1-17 నుంచి పగలు 3-00 వరకు. రాహుకాలం: పగలు 1-55 నుంచి పగలు 3-25 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-27 నుంచి ఉదయం 11-15 వరకు. అమృతకాలం: రాత్రి 11-32 నుంచి రాత్రి 1-15 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఊహించినట్టే మరో కుట్ర. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణను 'కేసుల ముసుగు'లో దెబ్బకొట్టే ఎత్తుగడ.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం తట్టుకోలేక, 8 ఏండ్లుగా దేశానికి ఏం చేశారన్న సూటి ప్రశ్నకు జవాబు చెప్పలేక, జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రతిద్వంద్విగా మారడాన్ని సహించలేక, ప్రభుత్వాల కూల్చివేత బండారాన్ని బట్టబయలు చేయడం ఓర్చుకోలేక... భారత రాష్ట్ర సమితి నేతలపై... 'మోదీ- బీజేపీ' కక్షసాధింపు రాజకీయాలకు దిగింది.

'తెలంగాణలాగే దేశాన్ని అభివృద్ధి చేయడం కోసం జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నా' అని ప్రకటించిన కేసీఆర్‌ను నేరుగా, రాజకీయంగా ఎదుర్కోలేక, ఆయన కూతురు, తెలంగాణ ఉద్యమకారిణి, భారత జాగృతి సారథి కవితను టార్గెట్ చేసింది. విపక్ష నేతలను కట్టడి చేయడానికి, వారి కుటుంబ సభ్యులపైకి దర్యాప్తు సంస్థలను ఎగదోయడం అనే విధానాన్ని ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న బీజేపీ, ఇప్పుడు దాన్నే తెలంగాణలోనూ ప్రయోగించింది.

అక్రమాల 'దోస్తులు' అడ్డంగా దొరికినా కనీసం కేసైనా పెట్టని బీజేపీ ప్రభుత్వం, పలు కుంభకోణాల్లో నిందితులైనా తమ పార్టీలో చేరగానే కేసులను చాప కింద దాస్తున్న బీజేపీ ప్రభుత్వం, కాల్‌డేటా సాక్షిగా అక్రమాలు బయటపడ్డా, కనీసం విచారణకు రాని తనవాళ్లపై ఎలాంటి దర్యాప్తులూ జరపని బీజేపీ ప్రభుత్వం, కోట్ల రూపాయల డబ్బుతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికినా తన పార్టీ ఎమ్మెల్యేలకు చెర విడిపిస్తున్న బీజేపీ ప్రభుత్వం.. బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికి, తానే కర్త కర్మ క్రియగా సృష్టించిన సోకాల్డ్ లిక్కర్‌స్కాంను వాడుతున్నది.

ఎవరు ఎప్పుడు అరెస్టవుతారో నిన్నమొన్నటి దాకా తేదీలతో సహా చెప్పిన రాష్ట్ర బీజేపీ నేతలు, ఇప్పుడు 'కేసులు- దర్యాప్తు సంస్థలతో మాకేం సంబంధం?' అంటూ తాజాగా భుజాలు తడుముకోవడమే తెరవెనక నాటకానికి అసలు ఆధారం. 'ఇది వ్యక్తిగత వ్యవహారం. తెలంగాణకేం సంబంధం?' అని వారు చేస్తున్న వాదనే... 22 ఏండ్లుగా తెలంగాణతో మమేకమై పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను, దాని నాయకత్వాన్ని తెలంగాణ నుంచి వేరుచేసి చూపే యత్నానికి నిదర్శనం. బీఆర్ఎస్‌ను, దాని నాయకత్వాన్ని ఏదో ఒక రకంగా దెబ్బకొడితే తప్ప తెలంగాణను చేజిక్కించుకోలేమనే రాజకీయ వ్యూహంలో లిక్కర్ స్కాం కేసులు, నోటీసులు సరికొత్త అంకం.

**తెలంగాణ ఉద్యమకారిణిగా, లోక్‌సభ సభ్యురాలిగా పనిచేసి, ఎమ్మెల్సీగా ఉన్న ఒక మహిళకు మహిళా దినోత్సవం రోజు ఈడీ నోటీసులు పంపడం, హద్దులు దాటిన కక్ష సాధింపు, వేధింపు రాజకీయాలకు పరాకాష్ఠ!**



# తల వంచదు తెలంగాణ

జంగ్ సైరన్

## కుతంత్రాలకు బెదరం.. ఈడీతో బీఆర్ఎస్‌ను లొంగదీయలేరు
## 10న మహిళా బిల్లు కోసం ధర్నా... 9న ఈడీ నోటీసులా?
## 8న నోటీసులిచ్చి రేపే హాజరు కమ్మంటారా?
## చట్టాలను గౌరవిస్తా, 11న విచారణకు హాజరవుతా: కవిత
## జంతర్‌మంతర్ దీక్ష ఏర్పాట్ల కోసం ఢిల్లీకి పయనం

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కుతంత్రాలకు తెలంగాణ తలవంచదని భారత జాగృతి సారథి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. మార్చి 9న ఢిల్లీలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ తనకు నోటీసులు జారీ చేసిందని ఆమె తెలిపారు. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా దర్యాప్తు సంస్థలకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆమె ప్రకటించారు. ఈమేరకు కవిత బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ మద్యం పాలసీలో అవకతవకల కేసులో ఈనెల 9 (గురువారం రోజు)న దర్యాప్తునకు హాజరు కావాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం కవితకు నోటీసులు జారీ చేసింది. దీనిపై కవిత స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు, మహిళా సంఘాలతో కలిసి భారత జాగృతి ఈనెల 10 (శుక్రవారం రోజు)న ఢిల్లీలో ఒకరోజు నిరాహార దీక్షను తలపెట్టిందని ఆమె

› 4వ పేజీలో



## విపక్షాన్ని రూపుమాపే బిల్లు తెచ్చుకోండి

- గల్లీ గల్లీకి ఈడీ, సీబీఐ బ్రాంచ్‌లు పెట్టుకోండి
- కావాలంటే శ్మశానాల వద్ద మృతదేహాలనూ ప్రశ్నించేలా ఓ చట్టం తయారు చేసుకోండి
- ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేకే కవితకు నోటీసులు
- పిచ్చి ముదిరినట్టు వ్యవహరిస్తున్న బీజేపీ
- మోదీ సర్కార్‌పై ఆప్ ఎంపీ సంజయ్ ఫైర్ › 4

## నాణేనికి మరోవైపు



ప్రముఖ న్యాయవాది పట్టాభి రాసిన ప్రత్యేక వ్యాసం 'వేదిక'లో

## నియంతలకే దిక్కు లేదు.. మోదీ ఎంత!


- అధికార దుర్వియోగం.. గొంతునొక్కే యత్నం
- బీజేపీ తాటాకు చప్పళ్లకు మేం భయపడం
- కేసులతో సాధిస్తామనుకుంటే అత్యాశే
- దిగజారుడు రాజకీయాలకు ఇది పరాకాష్ఠ
- అదానీ అక్రమాలపై నోరెందుకు మెదపరు
- నియంతృత్వానికి ప్రజలు జవాబు చెప్తారు
- దర్యాప్తు సంస్థలతో బీఆర్ఎస్‌ను ఆపలేరు
- పిరికి బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవు
- భ్రష్టుపట్టిన దర్యాప్తు సంస్థల విశ్వసనీయత
- మోదీ సర్కారుపై తెలంగాణ మంత్రుల ఫైర్ › 4

## రేపు బీఆర్ఎస్ కీలక భేటీ

- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యులతో సమావేశం
- ఆహ్వానితులు విధిగా రావాలన్న సీఎం › 3

## 8 కోట్లతో పట్టుబడ్డ బీజేపీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్

- కర్ణాటక న్యాయవాదుల తీవ్ర ఆగ్రహం
- చట్టం అమల్లో వీఐపీ ట్రీట్‌మెంటా? › 7
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు నిరసన లేఖ
- లంచం కేసు దర్యాప్తు అధికారులను రాత్రికి రాత్రి బదిలీ చేసిన బొమ్మై సర్కార్




హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో 27మంది ఉత్తమ మహిళలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఖమ్మం భరోసా సెంటర్ కోఆర్డినేటర్ గుండా రాజకుమారిని సత్కరిస్తున్న మహిళ, శిశు సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్, మేయర్ గుండు సుధారాణి, మహిళ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హొలికేరి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు › 3

## వన్ నేషన్.. వన్ దోస్త్



- నల్లధనం మొత్తాన్ని మోదీ అదానీకే దోచిపెట్టిండు
- ప్రభుత్వాలను కూల్చుడు.. ప్రతిపక్షాలను చీల్చుడు
- ఇది కాకుండా 9 ఏండ్లలో ప్రజలకు చేసిందేమిటి?
- విభజన హామీ ఒక్కటైన కేంద్రం నెరవేర్చిందా? › 2
- మోదీ ప్రియమైన ప్రధాని కాదు.. పిరమైన ప్రధాని
- తొర్రూరు మహిళా దినోత్సవ సభలో మంత్రి కేటీఆర్
- మహిళలకు 1,550 కోట్ల రుణాల పంపిణీ ప్రారంభం

## కేసీఆర్ కానుక.. ఆరోగ్య మహిళ

- ప్రతి మంగళవారం స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు
- ఈ తరహా కార్యక్రమం ప్రపంచంలోనే తొలిసారి
- మహిళా సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ టాప్
- మావి న్యూట్రిషన్ పాలిటిక్స్: మంత్రి హరీశ్‌రావు
- మంత్రి గంగులతో కలిసి ఆరోగ్యమహిళ ప్రారంభం



*మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళ, న్యూట్రిషన్ కిట్స్, వడ్డీ లేని రుణాల కింద రూ.750 కోట్లు సీఎం కేసీఆర్ కానుకగా ఇచ్చారు. మహిళా సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలోనే టాప్‌లో నిలిపారు. మహిళలు ప్రేమగల వారు. సద్ది తిన్న రేవును తలుస్తారు. ఈ ప్రభుత్వంపై మహిళల ఆశీర్వాదం ఎప్పటికీ ఉండాలి. - హరీశ్* › 3



## ఒకే ఎంట్రెన్స్‌తో 10 సబ్జెక్టులు

- సీయూఈటీలో అవకాశం
- 12 వరకు దరఖాస్తు గడువు

**15 నుంచి ఇంటర్ పరీక్షలు**

› 5



› 5

## ఇన్‌ఫ్లూయెంజాతో ప్రమాదం లేదు

- కొత్త రూపంలో పాత వైరస్
- వ్యాధిగ్రస్తుల్లో సాధారణ లక్షణాలే..
- గాంధీ దవాఖానలో నిర్ధారణ పరీక్షలు
- అన్ని దవాఖానల్లో ప్రత్యేక వార్డులు



తొర్రూరు సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోత్ కవిత, పసునూరి దయాకర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు తదితరులు

# వన్ నేషన్.. వన్ దోస్త్

## నల్లధనమంతా అదానీకే మోదీ దోచిపెట్టిండు • చందాలు తీసుకొని రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల కొనుగోళ్లు: కేటీఆర్

- ప్రభుత్వాలను కూల్చుడు.. పార్టీలను చీల్చుడు
- తొమ్మిదేండ్లలో ప్రజలకు బీజేపీ ప్రభుత్వం చేసిందేమిటి?
- విభజన హామీ ఒక్కటైనా నెరవేర్చిందా?
- తొర్రూరు మహిళా దినోత్సవ సభలో మంత్రి కేటీఆర్
- మహిళలకు 1,550 కోట్ల రుణాల పంపిణీ ప్రారంభం
- తొర్రూరు మున్సిపాలిటీకి 25 కోట్లు మంజూరు

మహబూబాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 'వన్ నేషన్ వన్ ట్యాక్స్.. వన్ నేషన్ వన్ రేషన్' అంటూ దేశ ప్రజలకు చెప్పిన ప్రధాని మోదీ.. నేడు 'వన్ నేషన్.. వన్ దోస్త్'గా మారారని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ.. ఒకే ఒక్కడి ఆదాయాన్ని వెయ్యి రెట్లు పెంచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన ప్రియమైన ప్రధాని కాదు, పిరమైన ప్రధాని అని ఎద్దేవా చేశారు. తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రజలకు ఏమ్రాతం మేలు చేయని బీజేపీకి వచ్చే ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రూ.4 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను, రూ.2.13 కోట్లతో ఏర్పాటుచేసిన యతిరాజారావు మెమోరియల్ పిల్లల పార్క్‌ను ప్రారంభించారు. అన్నారం రోడ్డులో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, మహిళా సంఘాలకు రూ.1,550 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. '2014లో మోదీ గొప్పలు చెప్పిండు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్నడు.. నల్లధనం గుంజుకొస్తానని చెప్పిండు. నల్లధనం ఏమైందని అడిగితే తెల్లముఖం వేసుకుని తప్పించుకుని తిరుగుతుండు. జన్‌ధన్ ఖాతాలు తెరవండి.. ధనాధన్ రూ.15 లక్షలు జమ చేస్తానన్నాడు. ఒక్కరి ఖాతాలోనైనా జమ చేశారా?' అని ప్రశ్నించారు. 'మన డబ్బుల్లన్నీ ఒకే ఒక్కడి ఖాతాలోకి వెళ్లాయి. ఆయన పేరేంది?' అని సభికులను కేటీఆర్ అడగడంతో 'అదానీ.. అదానీ' అంటూ మహిళలు ముక్తకంఠంతో జవాబిచ్చారు. దోస్త్‌కు మూటలు మోసి, అందులో నుంచి పార్టీ చందాలు తీసుకుని, ఎమ్మెల్యేలను కొని, ప్రభుత్వాలను కూల్చడం, పార్టీలను చీల్చడమే మోదీ పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. విభజన చట్టం హామీ ప్రకారం కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజనవర్సిటీ, బయ్యారం ఉక్కు కర్మాగారం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు.



బుధవారం తొర్రూరులో మంత్రి కేటీఆర్ సభకు భారీగా హాజరైన మహిళలు

### ధరలపై కేంద్రం నియంత్రణ ఏదీ?

'2014లో రూ.400 ఉన్న గ్యాస్ ధర ఇప్పుడు రూ.1,200 అయ్యిందని, రూ.75 ఉన్న పెట్రోల్ ధర ఇప్పుడు రూ.110కి చేరిందని కేటీఆర్ విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన సాగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధరలు నియంత్రించలేని బీజేపీకి ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతులకు పంట పెట్టుబడి కోసం ఇప్పటివరకు రూ.65 వేల కోట్లు ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రైతుబంధు డబ్బులు వచ్చిన వాళ్లు చేతులు ఎత్తండని మంత్రి కేటీఆర్ కోరగా సభలో ఉన్న మహిళలంతా చేతులు ఎత్తడం విశేషం.

### దేశంలో ఉత్తమ మంత్రి ఎర్రబెల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంలో పల్లెలు ఇప్పుడు ఎంతో మెరుస్తున్నాయని మంత్రి కేటీఆర్ వివరించారు. దేశంలోనే ఉత్తమ పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అని కితాబిచ్చారు. కేంద్రం ప్రకటిస్తున్న అవార్డులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. కేసీఆర్ పాలనలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని వివరించారు. . ప్రజల కోసం ఆహర్నిలు కష్టపడుతున్న నాయకులను కడుపులో పెట్టుకుని కాపాడుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులు కండ్లముందు కనిపిస్తున్నాయని, కేంద్రం చేసిన అభివృద్ధి ఎక్కడ ఉన్నదో చూపించాలని సవాల్ చేశారు.

### కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్

పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్స్ పార్క్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆ జీవో కాపీని సభా ప్రాంగణంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కేటీఆర్ అందజేశారు. ప్రజలకు మంచి చేసే నాయకులను ప్రజలు కాపాడుకోవాలని కోరారు. మంత్రి దయాకర్‌రావు ప్రజల హృదయాలు గెలిచిన నాయకుడని, ఈ సారి లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సిరిసిల్లలో తనకు వచ్చే మెజార్టీ కంటే దయాకర్‌రావుకు ఎక్కువ మెజార్టీ రావాలని ఆకాంక్షించారు. తొర్రూరు మున్సిపాలిటీకి మరో రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. తొర్రూరు దవాఖానను 100 పడకలకు, పాలకుర్తిలో 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.

### మహిళల కోసం రూ.1,550 కోట్లు

రాష్ట్రంలోని మహిళల కోసం రూ.1,550 కోట్ల రుణాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ తొర్రూరులో ప్రారంభించారు. ఇందులో వడ్డీ లేని రుణాలు రూ.750 కోట్లు, అభయహస్తం సొమ్ములు రూ.595.43 కోట్లు, స్త్రీనిధి రుణాలు రూ.50.69 కోట్లు, పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.204 కోట్లు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను మంత్రి కేటీఆర్ మహిళలకు అందజేశారు. వీటితో పాటు సభా ప్రాంగణంలోనే మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలో కుట్టు మిషన్లను 1,000 మంది మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, ఆరూరి రమేశ్, ధర్మారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరులో బుధవారం అభయహస్తం చెక్కును ప్రదర్శిస్తున్న మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

### తెలంగాణలోనే వినూత్న పథకాలు

తెలంగాణలో మహిళా సంక్షేమానికి చేపడుతున్న పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవు. నాడు ఎన్టీఆర్ డ్వాక్రా గ్రూపులను పెట్టి మహిళల్లో చైతన్యం తీసుకురాగా, నేడు సీఎం కేసీఆర్ స్వయం సహాయక సంఘాలకు భారీగా నిధులు ఇస్తూ.. సమాజంలో అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. గతంలో డబ్బులు కావాలంటే భార్యలు భర్తలను బతిమిలాడుకునేవారు. ఇప్పుడు భర్తలే భార్యలను బతిమిలాడుకునే పరిస్థితులు తీసుకొచ్చారు.

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### పురిటిబిడ్డ నుంచి ఆడబిడ్డ పెండ్లి దాకా సాయం

మహిళ గర్భం దాల్చిన ఆరు నెలల నుంచి మూడు నెలల బాలింత వరకు, పురిటి బిడ్డ నుంచి ఆడబిడ్డ పెండ్లి దాకా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తూ.. ఆర్థికంగా అండగా నిలుస్తున్నది. మహిళా దినోత్సవం రోజున సీఎం కేసీఆర్ మహిళలకు వడ్డీలేని రుణాలను పాలకుర్తి నుంచే అమలు చేయడం ఇక్కడి మహిళల అదృష్టం. ఎన్టీఆర్ నాడు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే.. నేడు సీఎం కేసీఆర్ మంత్రిగా అవకాశం ఇచ్చి ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించారు.

- మంత్రి సత్యవతి రాథోడ్



ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్

### ప్రీతి కుటుంబానికి మంత్రి కేటీఆర్ భరోసా

తొర్రూరు, మార్చి 8 : సీనియర్ వేధింపులతో మనోవేదనకులోనై ఇటీవల కాకతీయ మెడికల్ కళాశాలలో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ తనువు చాలించిన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాకు చెందిన వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి కుటుంబ సభ్యులను బుధవారం తొర్రూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి కేటీఆర్ పరామర్శించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌తో కలిసి ప్రీతి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచే వరంగల్ సీపీ సీ రంగనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసు పురోగతి, దర్యాప్తు తీరును అడిగి తెలుసుకున్నారు.



హైదరాబాద్ తాజ్ కృష్ణలో జరిగిన వీహబ్ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న మాయ వివేక్, సాహిత్యరాజ్, మంగ, సురభి గుహ, సాయి మానస, అంజుమ్‌తో మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్, వీ హబ్ సీఈవో దీప్తి రావుల

# వీ హబ్‌లోనూ సింగిల్ విండో..

- త్వరలోనే మండలస్థాయి నుంచి విధానాన్ని తెస్తాం
- దేశం గర్వించే ఉత్పత్తులు రావాలి
- పిల్లల పెంపకంలో వివక్ష వద్దు
- పిల్లలకు ధైర్యం కల్పించాలి
- వీ హబ్ 5వ వార్షికోత్సవంలో ఐటీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ హబ్‌లోనూ కొత్తగా సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తామని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. మహిళా వ్యాపారవేత్తలకే కాకుండా స్వయం సహాయక సంఘాలకు మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ విధానం అందుబాటులో ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బుధవారం నిర్వహించిన 'వీ హబ్' ఐదో వార్షికోత్సవానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయాలు సాధించిన పలువురు మహిళా పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వీ హబ్ ఐదేండ్ల కాలంలో 5 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి 3,194 స్టార్టప్‌లను నెలకొల్పే దిశగా తోడ్పాటు అందించిందని చెప్పారు. తెలంగాణ నుంచి భారతదేశం గర్వించే ఉత్పత్తులను సృష్టించాలని, ప్రపంచమే గర్వపడేలా ఇక్కడి మహిళలు రాణించాలని మంత్రి ఆకాంక్షించారు. ఆడపిల్ల అంటే తొందరగా పెండ్లి చేసి పంపించి వేద్దామన్న రోజులు పోయాయని చెప్పారు. మగవాళ్లతో పోటీపడి మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు అమ్మాయిల ఇష్టానుసారాన్ని బట్టి చదివించాలని సూచించారు.

### ఎవరైనా ఇంట్లో బాస్‌కి భయపడాల్సిందే

మహిళలు అడిగిన ఒక ప్రశ్నకు కేటీఆర్ స్పందిస్తూ.. 'మేం బయటికి ఎంత నటించినా ఇంట్లో మీరే బాస్‌లు. ఎంత పెద్ద నేతైనా ఇంటికి వెళ్లాక బాస్‌కు భయపడాల్సిందే. ప్రతి రోజూ వారిని గౌరవించాలి' అని అన్నారు.

### పారిశ్రామికవేత్తలకు సత్కారం

వీ హబ్ వార్షికోత్సవం సందర్భంగా పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్న మాయా వివేక్ (ఊర్వి సొసైటీ), రుబీనా మజ్హర్ (సఫా సొసైటీ), సాహిత్య రాజ్ (స్వీటూత్ ఫౌండర్), సురభి గుహ (సోర్టిజీ ఫౌండర్), మల్లికా వల్లూరు (రేడియస్ ఎడుటెక్ ఫౌండర్), పసుల మంగ (కొయ్య బొమ్మలు)లను మంత్రి కేటీఆర్ సత్కరించారు. సాయి మానస, అంజుమ్ అనే విద్యార్థినులతో మాట్లాడిన కేటీఆర్.. వీ హబ్‌ను సంప్రదిస్తే ప్రోత్సాహం అందిస్తామని హామీఇచ్చారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన లత గార్మెంట్స్‌ను స్థాపించి రెండు వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్టు తెలుసుకున్న మంత్రి ఆమెను అభినందించారు. వేడుకల్లో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, వీ హబ్ సీఈవో దీప్తి రావుల, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

### నాకంటే ముందే నా చెల్లి యూఎస్ వెళ్లింది..

'మా తల్లిదండ్రులు మా పట్ల వివక్ష ఎప్పుడూ చూపించలేదు. నన్ను, నా చెల్లిని బాగా చదివించారు. నా కంటే ముందు నా చెల్లిని యూఎస్‌కు పంపారు. నా కూతురు 9వ తరగతి చదువుతున్నది. ఆమె ఇప్పటికే పుస్తకాలు రాసింది. మ్యూజిక్‌ని ఇష్టపడుతుంది. తను మంచి ఆర్టిస్ట్ అవుతుందని అనుకుంటున్నా.. నా కూతురు ఏం అయినా సరే! మంచి వ్యక్తిగా ఎదగాలని కోరుకుంటున్నా. కిందపడితే మేం ఉంటామనే ధైర్యాన్ని పిల్లలకు కల్పిస్తున్నాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రజారోగ్యానికి త్రిముఖ వ్యూహం

- స్వచ్ఛమైన నీరు, గాలి, పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- మిషన్ భగీరథతో ఇంటింటికీ నీళ్లు
- రైతుబంధు, రైతుబీమాతో ధీమా
- ఏనుగల్ సభలో మంత్రి కేటీఆర్
- ప్రతిమ ఫౌండేషన్ క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం ప్రారంభం
- వినోద్‌కుమార్ కుటుంబానికి మంత్రి అభినందనలు



వరంగల్ జిల్లా ఏనుగల్‌లో ప్రతిమ క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిభిరాన్ని గిరిజనులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్

వరంగల్, మార్చి 8(నమస్తే తెలంగాణ): ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు మంచి పనులు చేస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛమైన నీరు, గాలి, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నదని అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. వివిధ రంగాల్లో ప్రతిభను కనబరుస్తున్న మహిళలు, స్థానిక మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ స్వచ్ఛమైన, శుద్ధి చేసిన నదీ జలాలను సరఫరా చేస్తున్నదని తెలిపారు. ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడానికి హరితహారం కింద ఇప్పటికే దాదాపు 240 కోట్ల మొక్కలను నాటినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ మొత్తం రాష్ట్రాన్ని జలమయం చేశారని కొనియాడారు. రైతుబంధు, రైతు బీమా, కరెంటు, ధాన్యం కొనుగోళ్లు, రైతు వేదికలు ఇలా వివిధ రూపాల్లో రైతులకు భరోసా కల్పిస్తున్నదని వివరించారు. తాము పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో సొంత ఊరు ఏనుగల్‌లో ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు, డాక్టర్ హరిణి, ప్రతీక్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వారి కుటుంబసభ్యులంతా కలిసి క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వారం రోజుల నుంచి వినోద్‌కుమార్, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులందరూ ఏనుగల్‌లోనే మకాం వేసి చక్కటి ఏర్పాట్లు చేశారని కొనియాడారు. స్క్రీనింగ్ తదుపరి అవసరమైతే తమ క్యాన్సర్ దవాఖానలో ఉచితంగా వైద్యం చేయించేందుకు ఫౌండేషన్ ముందుకురావడాన్ని ప్రశంసించారు.

### చదువుతోనే ప్రగతి: వినోద్‌కుమార్

చదువుకుంటేనే వ్యక్తి ప్రగతి సాధ్యమవుతుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తన సోదరుడు శ్రీనివాసరావు, డాక్టర్ హరిణి, డాక్టర్ ప్రతీక్ ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో మహిళల క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటుచేశారని చెప్పారు. ఎంతో విలువైన పరికరాలతో మహిళలకు పరీక్షలు చేయించడమే కాకుండా ఉచితంగా వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. తమ పెద్దమ్మ, అమ్మ 20 ఏండ్ల క్రితం క్యాన్సర్‌తో చనిపోయిన నేపథ్యంలో వరంగల్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సేవాభావంతో ప్రతిమా క్యాన్సర్ దవాఖాన ఏర్పాటుచేసినట్టు వివరించారు. ఏనుగల్ యువతకు చేయూతనివ్వడానికి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు.

### ఏనుగల్లుకు కేటీఆర్ వరాలు

మంత్రి కేటీఆర్ ఏనుగల్‌కు వరాలు ప్రకటించారు. ఏనుగల్‌లో 30 పడుకల దవాఖాన, స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని, గడ్డపారతండాకు నీరందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ బీ శ్రీనివాస రావు, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీ దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు టీ నారాయణరావు, ప్రతిమ ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ బీ హరిణి, డాక్టర్ ప్రతీక్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయభాస్కర్, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీలు టీ రవీందర్‌రావు, బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, కుడా చైర్మన్ సుందర్‌రాజు, డీసీసీబీ చైర్మన్ ఎం రవీందర్‌రావు పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాలు, తండాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఆడబిడ్డలకు సర్కారు అండ

- అన్ని దశల్లో సంపూర్ణంగా సహకారం
- దేశంలో ఎక్కడా లేనన్ని పథకాలు
- మహిళా దినోత్సవంలో మంత్రి సత్యవతి రాథోడ్
- కేయూలో ఘనంగా రాష్ట్రస్థాయి వేడుకలు
- 27 మందికి పురస్కారాలు ప్రదానం



హనుమకొండలో మొక్కలు నాటి సెల్ఫీ దిగుతున్న మంత్రి సత్యవతి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోళికేరి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు

వరంగల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహిళా సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా ఉన్నదని మహిళ, శిశు సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. మహిళలకు సర్కారు అండగా ఉంటూ, అన్ని దశల్లో వారికి సంపూర్ణ సహకారం అందిస్తున్నదని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవని స్పష్టంచేశారు. ఆరోగ్య మహిళ, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, ఆరోగ్య మహిళ, కల్యాణ లక్ష్మి, ప్రత్యేక గురుకులాలు.. ఇలా అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. మహిళా సాధికారత, సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. ప్రతి మహిళ మరింత ధైర్యంగా, దృఢంగా ఉన్నప్పుడు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని తెలిపారు. మెడికో ప్రీతి ఆత్మహత్య ఘటన దురదృష్టకరమని, నిత్య జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను ఎదుర్కొంటూ ముందుకుసాగాలని సూచించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి మంత్రి సత్యవతి బుధవారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 27 మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. మహిళల భద్రత కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన చర్యలు దేశానికి తలమానికంగా నిలిచాయని అన్నారు. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనేది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని, అందుకే మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కేసీఆర్ కిట్ రాకముందు ప్రభుత్వ దవాఖానల్లో 30 శాతం కాన్పులు అయ్యేవని, ఇప్పుడు 61 శాతం జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కోసం రూ.750 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ మొత్తాన్ని మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు.

### కేయూలో 2 హాస్టళ్ల నిర్మాణానికి 20 కోట్లు

గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలను నిర్మించేందుకు రూ.20 కోట్లను మంజూరు చేస్తున్నట్టు మంత్రి సత్యవతి ప్రకటించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 27 మంది మహిళలను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ వేదికపై కాకతీయ తోరణం కలిగిన షీల్డులు, పోచంపల్లి శాలువాలతో సత్కరించారు. ప్రశంస పత్రాలతోపాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చెక్కు అందించారు. తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా వర్సిటీలోని వనితావనంలో అవార్డు గ్రహీతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, కేయూ వీసీ టీ రమేశ్, హనుమకొండ జడ్పీ చైర్మన్ ఎం సుధీర్‌బాబు, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్, కుడా చైర్మన్ సుందర్‌రాజుయాదవ్, కార్పొరేటర్ కవిత, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలికేరి, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, డీసీపీలు పుష్ప, అనూరాధ పాల్గొన్నారు.

### మహిళా ప్రజాప్రతినిధులకు సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో పలువురు మహిళా ప్రజాప్రతినిధులను, అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సత్కరించారు. రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకురాలు విమలక్కను మంత్రి శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

– హైదరాబాద్, నమస్తే తెలంగాణ



# మహిళల ఆరోగ్యానికి కేసీఆర్ రక్ష

- అందుకే ఆరోగ్య మహిళ పథకం
- రాష్ట్రంలో ప్రస్తుతం వంద కేంద్రాలు
- భవిష్యత్తులో మరో 1,200 ఏర్పాటు
- ప్రతి మంగళ వారం మహిళల కోసం
- మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ మూడు కానుకలిచ్చారు
- మావి న్యూట్రిషన్ పాలిటిక్స్.. బీజేపీవి పార్టిషన్ పాలిటిక్స్
- ఏది మంచో ఏది చెడో తేల్చుకోవాలి
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



కరీంనగర్‌లోని బుట్టిరాజారాం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ శ్వేత మహంతి. చిత్రంలో కార్పొరేషన్ల చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, బండ శ్రీనివాస్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, నగర కార్పొరేటర్లు తదితరులు

కరీంనగర్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): తల్లి బాగుంటేనే ఇల్లు బాగుంటుందని, అందుకే సీఎం కేసీఆర్ ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రవేశపెట్టారని వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టంచేశారు. బుధవారం ఆయన కరీంనగర్ బుట్టిరాజారాం కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పలువురు మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ మహిళలకు ఆరోగ్య మహిళ, న్యూట్రిషన్ కిట్స్, వడ్డీ లేని రుణాల కింద రూ.750 కోట్లు కానుకగా ఇచ్చారని తెలిపారు. ఆరోగ్య మహిళ పథకం ప్రపంచంలో మరెక్కడా లేదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వంద ప్రభుత్వ దవాఖానాల్లో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామని, భవిష్యత్తులో మరో 1,200 ప్రత్యేక దవాఖానలను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. మహిళా దవాఖానలు ప్రతి మంగళవారం కేవలం మహిళల కోసమే పనిచేస్తాయని, ఇందులో అటెండర్ నుంచి వైద్యుల వరకు అందరూ మహిళలే సేవలు అందిస్తారని వివరించారు.

### శ్రీరామనవమి తర్వాత న్యూట్రిషన్ కిట్

జననం నుంచి మరణం వరకు వర్తించే విధంగా సీఎం కేసీఆర్ అనేక వినూత్న పథకాలను ప్రారంభించారని, మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే కేసీఆర్ కిట్ పథకం సూపర్‌హిట్ అయిందని, శ్రీరామనవమి తర్వాత న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. గర్భధారణ నుంచి ప్రసవం వరకు ఈ కిట్ ద్వారా బలవర్ధకమైన ఆహారం అందించి ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా బలహీనమైన బిడ్డలు జన్మించడంతోపాటు మాతా, శిశు మరణాలు సంభవిస్తుండటంతో వాటిని నివారించేందుకు న్యూట్రిషన్ కిట్స్‌ను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇలా తాము న్యూట్రిషన్ పాలిటిక్స్ తెస్తుంటే.. బీజేపీ కులం, మతం పేరిట సమాజాన్ని విడదీస్తూ పార్టిషన్ పాలిటిక్స్ చేస్తున్నదని విమర్శించారు. ఎవరిది మంచో, ఎవరిది చెడో గ్రహించాలని కోరారు. ఈ రెండు పథకాలతోపాటు మహిళలకు 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీ లేని రుణాలు రూ.750 కోట్లు సీఎం కేసీఆర్ విడుదల చేశారని, అవి ఇప్పుడు మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. మిగతావి వచ్చే జూన్, జూలైలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. పనులు పెరిగి మహిళా కూలీలు దొరకని పరిస్థితిలో కొన్ని గ్రామాల్లో పురుషులు నాట్లు వేస్తున్నారని, రాష్ట్రంలో ఇప్పుడు భూమికి బరువయ్యేంత పంట పండుతున్నదని చెప్పారు. నీళ్లు పుల్లు, కరెంట్ పుల్లు, చేపలు పుల్లు, పంట పుల్లు, మొత్తంగా రాష్ట్రం పవర్‌పుల్లుగా మారిందని స్పష్టం చేశారు. 'మహిళలు ప్రేమగలవారు. సద్ది తిన్న రేవు తలుస్తారు. సీఎం కేసీఆర్ మహిళల కోసం అనేక పథకాలు తెచ్చి రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ ప్రభుత్వంపై మహిళల ఆశీర్వాదం ఉండాలి' అని హరీశ్‌రావు కోరారు.

### 8 రకాల పరీక్షలు ఉచితం

ఆరోగ్య మహిళ దవాఖానాల్లో క్యాన్సర్, రక్తహీనత, గర్భసంచి, అధిక బరువు, పోషకాహార లోపం వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి 8 రకాల పరీక్షలు పూర్తి ఉచితంగా నిర్వహించి, మందులు కూడా ఇస్తారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. 80% వ్యాధులకు మహిళా దవాఖానల్లోనే పరిష్కారం లభిస్తుందని, ఇక్కడ నయం కాని పక్షంలో జిల్లా కేంద్రాల్లోని ప్రధాన దవాఖానలకు రెఫర్ చేస్తారని, అక్కడ ప్రత్యేకమైన హెల్ప్‌డెస్క్‌లు, ఒక్కో విభాగానికి ఒక్కో కియో వార్డులు ఉంటాయని వివరించారు. జిల్లా దవాఖానల్లో అవసరమైన ఆపరేషన్లు చేయడంతోపాటు మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని భరోసా ఇచ్చారు.



కరీంనగర్‌లో శ్వేత మహంతికి చీర పెట్టి సత్కరిస్తున్న మంత్రులు గంగుల, హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యే రసమయి, మేయర్ సునీల్‌రావు తదితరులు

### ఆడబిడ్డల కండ్లల్లో ఆనందం చూడాలని: మంత్రి గంగుల కమలాకర్

ఆడబిడ్డల కండ్లల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ ఆరోగ్య మహిళ పథకాన్ని తెచ్చారని బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖల మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఎక్కడ స్త్రీని గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని సీఎం కేసీఆర్ నమ్ముతారని చెప్పారు. ఆడ బిడ్డలను సీఎం కేసీఆర్ సంతోష పెడుతుంటే.. ప్రధాని మోదీ మహిళలను ఏడిపిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ శ్వేతా మహంతి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, కార్పొరేషన్ల చైర్మన్లు సర్దార్ రవీందర్ సింగ్, బండ శ్రీనివాస్, మేయర్ వై సునీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఉపాధికే అప్పారెల్ పార్క్!

- మంత్రి కేటీఆర్ చొరవతో గార్మెంట్ పరిశ్రమల ఏర్పాటు
- గోకుల్‌దాస్ కంపెనీ ద్వారా ఇప్పటికే వెయ్యి మందికి పని
- శరవేగంగా టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ కంపెనీ ఏర్పాటు పనులు
- మరో రెండు వేల మందికి దొరకనున్న ఉపాధి అవకాశాలు




సిరిసిల్ల అప్పారెల్ పార్కులో ఏర్పాటు చేసిన గోకుల్‌దాస్ దుస్తుల తయారీ కంపెనీ

రాజన్న సిరిసిల్ల, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 15 వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అప్పారెల్ పార్క్ తెలంగాణకే తలమానికం కానున్నది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ప్రత్యేక చొరవతో ఇప్పటికే పలు కంపెనీలు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిరుడు లోదుస్తుల ఉత్పత్తిని ప్రారంభించిన గోకుల్‌దాస్ కంపెనీ వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తున్నది. రెండు వేల మందికి ఉపాధి కల్పించే దిశగా మరో అంతర్జాతీయ కంపెనీ టెక్స్‌పోర్టు ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు వేస్తున్నది. కాగా, మరమగ్గాలపై కేవలం పురుషులు మాత్రమే ఉపాధి పొందుతుండగా.. మహిళలకూ పెద్దఎత్తున ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కేటీఆర్ అప్పారెల్ పార్క్ ఏర్పాటు చేయించారు. సిరిసిల్ల శివారులోని సర్దాపూర్‌లో రూ.170 కోట్లతో 65 ఎకరాల్లో ఈ పార్క్ రూపుదిద్దుకున్నది. ఇక్కడ గార్మెంట్ పరిశ్రమలతోపాటు సూటింగ్, షర్టింగ్ నుంచి మొదలు అన్నిరకాల దుస్తులు తయారు చేసే కంపెనీలు ఏర్పాటు చేసుకునే వీలుగా షెడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతుంది.



గోకుల్‌దాస్ కంపెనీలో ఉపాధి పొందుతున్న మహిళలు (ఫైల్)

### త్వరలో అందుబాటులోకి టెక్స్‌పోర్టు ఇండస్ట్రీస్..

అప్పారెల్ పార్కులో షెడ్ల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు టీఎస్ఐపాస్ వెనువెంటనే లైసెన్సులు జారీ చేస్తున్నది. ప్రస్తుతం పార్కులో రెండు అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి. అందులో గోకుల్‌దాస్ కంపెనీ ఉత్పత్తులు ప్రారంభించింది. మరో అంతర్జాతీయ కంపెనీ.. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ త్వరలో ఉత్పత్తిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. టెక్స్‌పోర్ట్ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం 7.40 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుతం షెడ్ల నిర్మాణం చివరిదశకు చేరుకున్నది. ఈ కంపెనీలో మొత్తం 2 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మొదటి విడతలో 800 మెషిన్లతో రెండు షిఫ్టుల్లో 1,600 మందికి, రెండో విడతలో వెయ్యి మెషిన్లతో 2 వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నది. అంతర్జాతీయ ప్రమాణాలతో సూటింగ్, షర్టింగ్ దుస్తులు ఈ కంపెనీలో తయారు చేయనున్నారు. బెంగళూరు, ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీ వేలాది మందికి ఉద్యోగాలు కల్పించింది. భారీ పెట్టుబడులతో నడుస్తున్న టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్లకు వచ్చింది. అప్పారెల్ పార్కులో పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నందున నిరుద్యోగ యువతలో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి.

### నిరుద్యోగ యువతకు భరోసా

అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన దుస్తుల తయారీతో వేలాది మందికి అప్పారెల్ పార్కు ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తున్నందుకు నిరుద్యోగ యువతలో సంతోషం వ్యక్తమవుతున్నది. సమైక్య పాలనలో నిర్వీర్యమైన వస్త్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పునర్జీవం పోసింది. మంత్రి కేటీఆర్ చొరవతో బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్, విద్యార్థుల యూనిఫాంల తయారీ ఆర్డర్లు నేరుగా వస్త్ర పరిశ్రమకు ఇచ్చి వేలాది మంది నేత కార్మికులకు ఉపాధి కల్పించి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపును తీసుకొచ్చారు.

### పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు

అప్పారెల్ పార్క్‌లో పెట్టుబడుల కోసం మంత్రి కేటీఆర్ పలుమార్లు అమెరికాలో పర్యటించారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పలు కంపెనీలతో చర్చించి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొనేలా కృషి చేశారు. అందులోభాగంగా గోకుల్‌దాస్ కంపెనీ దాదాపు రూ. 23.58 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. పరిశ్రమను ప్రారంభించి, ఏడాదిలోనే వెయ్యి మంది మహిళలకు ఉపాధి కల్పించింది. 500 జూకీ మెషిన్లతో మొదటి దశలో 500 మందికి నైపుణ్య శిక్షణనిచ్చిన ఈ కంపెనీ ప్రస్తుతం వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తున్నది. ఇందులో పనిచేస్తున్న మహిళా కార్మికులు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పైగా సంపాదిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన మహిళలే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి ఉపాధి పొందుతున్నారు. వీరికి కంపెనీ ఇంటర్‌సిటీ పేరిట ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రెండు షిఫ్టులలో వెయ్యి మంది కార్మికులు పనిచేస్తున్నారు.

# నేడు రాష్ట్ర మంత్రివర్గ భేటీ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానున్నది. ప్రగతి భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ అంశాలపై చర్చించి ఆమోదించనున్నది. ఇదే సమావేశంలో మంత్రివర్గ సిఫార్సుపై గవర్నర్ ఆమోదించే రెండు ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థులను ఖరారు చేయనున్నట్టు సమాచారం.

# రేపు బీఆర్ఎస్ కీలక భేటీ

- ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులతో సమావేశం
- ఆహ్వానితులు విధిగా హాజరు కావాలన్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ, లెజిస్లేటివ్ పార్టీ సహా, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం ఈనెల 10న పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరుగనున్నది. తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ విస్తృతస్థాయి భేటీలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్‌లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు పాల్గొంటారు. ఇది ఎన్నికల సంవత్సరం కావటంతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ కార్యకలాపాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఆహ్వానితులందరూ విధిగా సమావేశానికి హాజరు కావాలని అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశించారు.

## నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రాంరెడ్డి, నవీన్‌కుమార్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వారు ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్, ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, రోడ్లు భవనాలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ సహా పలువురు మంత్రులతో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొననున్నారు.

# గర్భస్రావానికి, హృద్రోగాలకు లింకు

న్యూఢిల్లీ, మార్చి 8: గర్భస్రావానికి, గుండె సంబంధ వ్యాధులకు లింకు ఉన్నట్టు పరిశోధకులు తెలిపారు. రెండు లేదా అంతకన్నా ఎక్కువసార్లు గర్భస్రావం సంభవించిన మహిళల్లో గుండె వ్యాధులు వస్తున్నట్టు గుర్తించామని చెప్పారు. అయితే భయపడాల్సిన పనిలేదని, కొంతమంది జీన్స్‌ను బట్టి ఇలా జరుగుతుంటుందని వెల్లడించారు.



అమెరికాలోని పెనాన్స్ సిటీలో ప్రవాస పారిశ్రామికవేత్తలతో మంత్రి కొప్పుల ఈశ్వర్

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### అమెరికా పర్యటనలో ప్రవాసులకు మంత్రి కొప్పుల పిలుపు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికన్ సంస్థలను ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఆయన బుధవారం పెనాన్స్ నగరంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ రాజ్ గుంటకు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రవాసులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని అమెరికన్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు.10 రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ఇప్పటికే సాల్ట్ లేక్ సిటీలోని ఎల్‌డీఎస్ హ్యూమానిటేరియన్ సెంట్రల్ వేర్ హౌస్ రూట్స్ టెక్‌ను మంత్రి సందర్శించారు.

# ప్రపంచ పర్యాటకులను తెలంగాణకు రప్పించండి

### టూర్, ట్రావెల్ ఆపరేటర్లకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి



బెర్లిన్ ఇంటర్నేషనల్ కల్చర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలకు తెలంగాణ నిలయంగా ఉన్నదని, రాష్ట్రంలో అనేక దర్శనీయ స్థలాలు ఉన్నాయని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వాటి విశిష్టతలను ప్రపంచంలోని వివిధ ప్రాంతాలవారికి వివరించి తెలంగాణను సందర్శించేలా చూడాలని టూర్, ట్రావెల్ ఆపరేటర్లను కోరారు. బెర్లిన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ టూరిజం, కల్చరల్ ఎగ్జిబిషన్‌లో భాగంగా బుధవారం ఆయన పలువురు టూర్, ట్రావెల్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. తెలంగాణలో బౌద్ధ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా ప్రపంచస్థాయిలో బుద్ధవనం ప్రాజక్టు నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. ఐటీతోపాటు వైద్య, ఔషధ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ ప్రఖ్యాతి పొందిందని, ఐటీలో అతిపెద్ద ఎగుమతిదారుగా ఎదిగిందని చెప్పారు. నామమాత్రపు ధరలకే అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్న నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్.. కరోనా సమయంలో యావత్ ప్రపంచానికి వ్యాక్సిన్లను సరఫరా చేసి తన ఘనతను చాటుకున్నదని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ లాంటి పండుగలు ఎంతో ప్రత్యేకమైనవని తెలిపారు. రాష్ట్రానికి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా టూర్, ట్రావెల్ ఆపరేటర్లు కృషిచేయాలని కోరారు. సమావేశంలో కేంద్ర పర్యాటక శాక కార్యదర్శి అర్వింద్ సింగ్, భారత రాయబారి పర్వతనేని హరీశ్, రాష్ట్ర టూరిజం శాఖ ఎండీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




# దీక్షకు భయపడే కక్ష

- కవితను నిలువరించేందుకే కుట్ర
- అందుకే ఈడీ పేరుతో నోటీసులు
- పిచ్చి పట్టినట్టు బీజేపీ వ్యవహారశైలి
- ఇతర పార్టీలు ఉండొద్దనేది కేంద్ర ప్రభుత్వ దుష్టవిధానం
- విపక్షాలను టార్గెట్ చేసేందుకు దేశవ్యాప్తంగా గల్లీగల్లీకి ఈడీ, సీబీఐ బ్రాంచ్‌లు తెరుచుకోండి
- కావాలంటే శ్మశానాల వద్ద మృతదేహాలనూ ప్రశ్నించేలా ఓ చట్టం తెచ్చుకోండి
- ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ ఫైర్


బుధవారం మీడియాతో మాట్లాడుతున్న ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దీక్షకు భయపడే కేంద్రం కక్ష కట్టిందని మండిపడ్డారు. 'ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడంలో కేంద్రం కుట్ర ఉన్నది. చట్టసభల్లో మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపడితే దేశవ్యాప్తంగా తమ పరువు పోతుందని గ్రహించిన బీజేపీ పెద్దలు ఆమెను నిలువరించేందుకు కుట్ర చేశారు' అని సంజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ విధానాలను ప్రశ్నించే, వ్యతిరేకించే పార్టీలు, వ్యక్తులపై బీజేపీ సర్కార్ కక్షగట్టి వేధించడమే పనిగా పెట్టుకొన్నదని, ఇందుకు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని తెలిపారు. ప్రశ్నించిన వారిపై బీజేపీ పిచ్చి, వెర్రి పట్టినట్టుగా వ్యవహరిస్తూ.. తన చేతిలోని సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని వెల్లడించారు. బీజేపీకి పట్టిన పిచ్చికి చికిత్స చేయించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

### గల్లీ గల్లీకో బ్రాంచ్ తెరుచుకోండి

దేశంలో తాము తప్ప.. ఇతర పార్టీలు ఉండకూడదనే దుష్ట విధానంతో బీజేపీ ఉన్నదని ఎంపీ సంజయ్ సింగ్ విమర్శించారు. ఇలా దర్యాప్తు సంస్థలను తన ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నేతలు, ప్రశ్నించిన వారిని వేధించే బదులు దేశంలో విపక్షాలు లేకుండా ఉండేలా వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఒక బిల్లు తీసుకొచ్చుకోండి! అని ఎద్దేవా చేశారు. బీజేపీ తన నియంతృత్వాన్ని మరింత విజయవంతంగా కొనసాగించేందుకు ఈడీ, సీబీఐలకు బడ్జెట్ పెంచి, విపక్షాలను టార్గెట్ చేసేందుకు గల్లీ గల్లీకి వాటి బ్రాంచ్‌లను తెరుచుకోవాలని వ్యంగ్యంగా చురకలంటించారు. ఇష్టానుసారం విపక్ష నేతలను అరెస్టు చేయిస్తూ, దేశంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చనిపోయిన వారిని కూడా వేధిస్తామనేలా బీజేపీ వ్యవహారశైలి ఉన్నదని, ఇందుకు దర్యాప్తు సంస్థలు శ్మశానాల వద్దకు వెళ్లి.. మృతదేహాలను కూడా ప్రశ్నించేలా ఒక చట్టం చేసుకోవాలని కేంద్రాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

### ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకే..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశ అభివృద్ధి పట్టడం లేదని, ప్రతిపక్ష నేతలను వేధించడమే వారి పని అని సంజయ్‌సింగ్ విమర్శించారు. దేశ ప్రజలకు విద్య, వైద్యం, కరెంటు, సంక్షేమం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం బీజేపీకి అవసరం లేదని, వాళ్లకు అవసరం ఉన్నదల్లా అధికారమేనని మండిపడ్డారు. దేశ ప్రజలకు మంచి చేయటం చేతగాని కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పాటుపడే నాయకులను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేక కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ వారిని జైల్లో ఉంచాలని కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వ చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో ఆ పార్టీకి తప్పక బుద్ధి చెప్తామని పేర్కొన్నారు.

## రేపు ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత ధర్నా



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): చట్టసభల్లో మూడో వంతు మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టనున్నారు. ఒకరోజు చేపట్టే ఈ ధర్నాను సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించనున్నారు. ధర్నాలో జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాతోపాటు దేశంలోని వివిధ పార్టీల నేతలు పాల్గొననున్నారు. ముగింపు కార్యక్రమానికి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా హాజరవుతారు. ఈ కార్యక్రమానికి 18 రాజకీయ పార్టీల నేతలు, దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా సంఘాలు, మహిళా హక్కుల సంస్థల ప్రతినిధులు తరలివచ్చి కవితకు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించనున్నారని భారత జాగృతి వర్గాలు తెలిపాయి.

## తాటాకు చప్పుళ్లకు భయపడం

- బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయాలని కేంద్రం కుట్రలు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బెదిరించడం, వేధించడం, కేసుల్లో ఇరికించడం.. బీజేపీ విధానమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయాలని కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా భయపడబోమని స్పష్టంచేశారు. డైరెక్ట్‌గా బీఆర్ఎస్‌ను తెలంగాణలో ఎదుర్కోలేక కేంద్రం ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చిందని, బీజేపీ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిని కేసులతో లొంగదీసుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత ధర్నాకు పిలుపు ఇవ్వగానే హడలిపోయిన కేంద్రం ఆమెకు ఈడీతో నోటీసులు ఇప్పించిందని విమర్శించారు.

## ఈడీ, బోడీలను తిప్పికొడతాం..

- కేసులతో లొంగదీసుకోవాలని కేంద్రసర్కారు చూస్తున్నది
- మంత్రి సత్యవతి రాథోడ్



వరంగల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహిళా దినోత్సవం రోజే ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ కక్షపూరిత చర్యేనని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ప్రపంచమంతా మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకుంటుంటే ఒక మహిళ పట్ల కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కవిత ఢిల్లీలో ఆందోళనకు సిద్ధమవడంతో బీజేపీకి భయం పట్టుకున్నదన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే కవితకు ఈడీ నోటీసులు జారీ చేసిందని విమర్శించారు. కేంద్రం కక్షపూరిత చర్యలు బీజేపీ పతనానికి నాంది అని పేర్కొన్నారు. ఈడీ, బోడీలను అడ్డుపెట్టుకొని బీజేపీ ఎన్ని వేసాలు వేసినా వాటిని తెలంగాణ తిప్పికొడుతుందని చెప్పారు.

## ఇలా నోటీసులిచ్చి.. అలా రమ్మనటమే కుట్ర

- రవాణాశాఖ మంత్రి పువ్వాడ ఫైర్



ఖమ్మం, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. ఈడీ తెల్లవారుజామున నోటీసులు ఇవ్వడం, తెల్లారే ఢిల్లీకి రావాలని చెప్పడం అత్యంత హేయమని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే నోటీసులు పంపించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌ను ఎదుర్కొలేకనే దొడ్డిదారిన కుట్ర పన్నుతున్నదని అన్నారు. ఇందులో భాగంగానే లిక్కర్ స్కామ్‌తో కవితకు సంబంధం ఉన్నట్టు చిత్రీకరిస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాల నాయకులపై బెదిరింపులకు పాల్పడడం, లొంగదీసుకునే కుట్రలు చేయడం బీజేపీకి అలవాటేనన్నారు.

## ఢిల్లీ ధర్నాకు భయపడే ఈడీ నోటీసులు

- కీలుబొమ్మల్లా ఈడీ, సీబీఐ,.. ఐటీ సంస్థలు
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ టౌన్, మార్చి 8: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలో ఎమ్మెల్సీ కవిత చేపట్టనున్న దీక్షకు భయపడే కేంద్రం ఈడీతో నోటీసులు జారీ చేయించిందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ధ్వజమెత్తారు. నిర్మల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఈడీ, సీబీఐ, ఐటీ దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా మార్చి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని మండిపడ్డారు. కక్షసాధింపు ధోరణి వీడి వెంటనే నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసులకు భయపడేది లేదని, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి దేశంలో ఆదరణ పెరుగుతుండటంతోనే కేంద్రం కక్షసాధింపు చర్యలకు దిగిందని మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతునొక్కేందుకు సీబీఐ, ఈడీ దాడుల పేరుతో వేధిస్తున్నదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## ఆడబిడ్డపై అక్కసా..విపక్షాలంటే అలుసా

- కవితకు ఈడీ నోటీసులు
- మోదీకి ఆడబిడ్డల ఉసురు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్



వేల్పూర్, మార్చి 8: దేశంలో మోదీ అవినీతి పాలనను కేసీఆర్ ప్రశ్నిస్తున్నందునే ఆయన్ను ఢీకొనే సత్తా లేక వారి కుమార్తె ఎమ్మెల్సీ కవితను ఆడబిడ్డ అని కూడా చూడకుండా ఈడీ నోటీసుల పేరిట వేధిస్తున్నదని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఇది నీచాతి నీచమైన రాజకీయ కుట్ర, యావత్ దేశ ప్రజల గొంతుకై ప్రశ్నిస్తున్న కేసీఆర్‌పై మోదీ రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమే ఇవన్నీ అన్నారు. కేసీఆర్ బిడ్డను ఇబ్బంది పాలు చేసి కేసీఆర్ మనో ధైర్యాన్ని దెబ్బ తీయాలనే దురాలోచన అని మండిపడ్డారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ తలొగ్గరని, ఇలాంటి ఊకదంపుడు బెదిరింపులకు భయపడితే తెలంగాణ రాష్ట్రం సాధించేవాడే కాదని స్పష్టం చేశారు. మేమంతా కేసీఆర్ కుటుంబసభ్యులమేనని, ఎన్ని కేసులు పెడుతారో పెట్టుకోండని అన్నారు. ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న మోదీకి తెలంగాణ ఆడపడుచుల ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## మాట వినని వారిపై కేసులు

- మోదీ కక్షకు ఇది పరాకాష్ట
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబమే టార్గెట్‌గా బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నదని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. అందులో భాగంగానే కవితకు ఈడీ నోటీసులు ఇచ్చిందని విమర్శించారు. మోదీ సర్కారు రాజ్యాంగబద్ధ సంస్థలు సీబీఐ ఈడీలను భ్రష్టు పట్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల దినోత్సవం రోజు ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేయడం మహిళలను గౌరవించకపోవడమేనని అన్నారు. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనలేక ఎమ్మెల్సీ కవితను అడ్డంపెట్టుకొని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన అదానీ గురించి కేంద్రం నోరు మెదపదు కానీ, తన మాటవినని వారిపై కేసులు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదన్నారు.

## అదిరేది లేదు.. బెదిరేది లేదు

- తెలంగాణ ఆడబిడ్డ జోలికొస్తే తెగువ చూపుతం
- ఈడీ నోటీసుపై మంత్రి గంగుల



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని మోదీ సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ జాగృతికి ప్రతీకైన కల్వకుంట్ల కవితను విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం మోదీ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీచేయడాన్ని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బేటీ బచావ్, బేటీ పడావ్ అంటే ఇదేనా.. మోదీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని నిలదీశారు. మహిళల తరపున పనిచేస్తున్న కవితను వేధించడం సబబేనా అని ప్రశ్నించారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకత్వంపై రాజకీయ కుట్రతో దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం నీచమని మండిపడ్డారు. నిరంకుశ చర్యలు మానుకోకపోతే తెలంగాణ సమాజం తన తెగువేంటో చాటిచెబుతుందని హెచ్చరించారు. ఈ ఉడుత బెదిరింపులకు తెలంగాణ భయపడదని, కడిగిన ముత్యంలా బయటకొస్తుందని తెలిపారు.

## బీజేపీవి పిరికి చేష్టలు

- విపక్ష నేతలపై సంస్థలను ఉసిగొల్పుతున్న కేంద్రం
- మంత్రి సబిత ఆగ్రహం



రంగారెడ్డి, మార్చి 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే కేంద్రం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను తమ పార్టీ నాయకులపై ఉసిగొల్పుతున్నదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. అధికార దుర్వినియోగంతో నాయకుల గొంతు నొక్కే ప్రయత్నానికి మోదీ సర్కారు పాల్పడటం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు సీఎం కేసీఆర్ సన్నద్ధమైన నేపథ్యంలో, ఆయనను ఎదుర్కోలేక ఎమ్మెల్సీ కవితను కేంద్రం టార్గెట్ చేసి పిరికి చర్యలకు దిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బీ జేపీ పగటి కలలు కంటున్నదని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నదని మండిపడ్డారు.

## అదానీపై నోరెందుకు మెదపరు?

- కేంద్రసంస్థలను భ్రష్టుపట్టిస్తున్న బీజేపీ
- మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేయటం కేంద్రంలోని బీజేపీ సర్కార్ కక్షపూరిత చర్యకు నిదర్శనమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేకే ఎమ్మెల్సీ కవితపై ఈడీ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ భ్రష్టు పట్టించి, వాటి విశ్వసనీయతను దెబ్బతీసిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన అదానీపై మోదీ సర్కారు నోరెందుకు మెదపదని నిలదీశారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో ఎమ్మెల్యేలను కొని అక్రమంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేసి బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మండిపడ్డారు. తమ మాటవినని వారిపై కేంద్రం కేసులు పెడుతున్నదని, మోదీ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు.

## నియంతలకే దిక్కులేదు.. మోదీ ఎంత?

- ఈ పప్పులు సీఎం కేసీఆర్ ముందు ఉడుకవు
- మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 'రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాల పరాకాష్టకు ఇది నిదర్శనం' అని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ పాలకులకు కంట్లో నలుసుగా మారిన ఢిల్లీలోని ఆప్, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టే కుట్రలో భాగమే ఇది అన్నారు. సీఎం కేసీఆర్ ఆత్మస్థైర్యం దెబ్బ తీయాలన్నది మోదీ సర్కార్ యోచనగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఇటువంటి పప్పులు కేసీఆర్ దగ్గర ఉడకవని చెప్పారు. నియంతలు ఎప్పుడూ నిలబడిన దాఖలాలు లేవని, ప్రపంచంలో అంతమైన నియంతల కంటే మోదీ గొప్పోడు ఏం కాడని అన్నారు. మోదీ దుర్మార్గాలకు కాలం చెల్లిందన్నారు.

## పోగాలం దాపురించి..

- లేదంటే ప్రజలే బుద్ధి చెప్తరు
- మండలి చైర్మన్ గుత్తా



నల్లగొండ, మార్చి 8: ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చట్టాలను తన చుట్టాలుగా మార్చుకొని ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందులు పెట్టే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. కేంద్రం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. నల్లగొండలోని తన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు కేసీఆర్ ఎంతో ప్రాధాన్యమిస్తూ దేశంలోనే గొప్ప మహిళా పక్షపాత ముఖ్యమంత్రిగా పేరు సంపాదించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని, వారు యువతకు ఏం సందేశం ఇస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పోగాలం దాపురించి లాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నదని హెచ్చరించారు.

# తలవంచదు తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

గుర్తు చేశారు. రాజకీయ రంగంలో తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్నది తమ డిమాండ్ అని ఆమె తెలిపారు. ధర్నాకు ఒక రోజు ముందు 9న దర్యాప్తునకు రావాలంటూ తనకు నోటీసులు వచ్చాయన్నారు. ముందస్తుగా ఖరారై ఉన్న కార్యక్రమాలు, అపాయింట్‌మెంట్ల దృష్ట్యా దర్యాప్తునకు హాజరయ్యేందుకు కొంత సమయం కావాలని ఈడీని కోరనున్నట్టు ఆమె చెప్పారు. విచారణకు హాజరయ్యే తేదీపై న్యాయ సలహా తీసుకుంటానన్నారు. ఈడీ నోటీసులు, విచారణలతో బీఆర్ఎస్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని కవిత స్పష్టంచేశారు. ఇలాంటి చర్యలతో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడకుండా బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్‌ను ఆపలేరని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను తాము కేసీఆర్ నాయకత్వంలో ఎండగడుతూనే ఉంటామన్నారు. కేంద్రంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి తెలంగాణ తలవంచబోదన్న విషయాన్ని మరోమారు గుర్తుచేస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా మరింత సమయం కావాలన్న కవిత అభ్యర్థనపై ఈడీ స్పందించాల్సి ఉంది. మరోవైపు జంతర్‌మంతర్ దీక్షకు ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం కవిత బుధవారమే ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

### 11న విచారణకు హాజరవుతా.. ఈడీకి కవిత లేఖ

ఈడీ నుంచి నోటీసులు అందిన నేపథ్యంలో ఈ నెల 11న తాను విచారణకు హాజరు కాగలనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవారం ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు ఆమె లేఖ రాశారు. ముందే నిర్దేశించుకున్న కార్యక్రమాలు, ముందస్తు అపాయింట్‌మెంట్లు ఉన్నందున 9న విచారణకు హాజరు కాలేనని తేల్చిచెప్పారు. నోటీసుల తీరుపైనా కవి త అభ్యంతరం వ్యక్తంచేశారు. గతంలో ఆయా కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించే అవకాశం ఉన్నప్పటికీ నేరుగా ఈడీ కార్యాలయానికి పిలవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. '8న నోటీసులు ఇచ్చి.. 9న విచారణకు హాజరుకావాలని చెప్పారు. ఇం త స్వల్పవ్యవధిలో విచారణకు రావాలని హడావుడిగా నోటీసులు జారీ చేయడం ఏమిటి? అంత అత్యవసరమేమిటో అర్థం కావడం లేదు' అని పేర్కొన్నారు. ఒక మహిళగా, దేశ పౌరురాలిగా చట్టపరమైన అన్ని హక్కులనూ ఉపయోగించుకుంటానని స్పష్టంచేశారు.

### రోజులు దగ్గరపడ్డాయి



జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ బలపడకుండా కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్సీ కవితకు కేంద్రం ఈడీతో నోటీసులు జారీ చేయించిందని ఆ పార్టీ లోక్‌సభాపక్షనేత నామా నాగేశ్వరరావు ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను అణగదొక్కటమే పనిగా మోదీ సర్కార్ వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈడీ, సీబీఐ సంస్థలను ఇష్టారీతిగా దుర్వినియోగం చేస్తున్న బీజేపీకి పాపం పండే రోజు వస్తుందని అన్నారు. అదానీ వ్యవహారాన్ని తేల్చాలని పార్లమెంట్‌లో తాము నిగ్గదీసినా పట్టించుకోని కేంద్రం.. విపక్ష నేతలను టార్గెట్ చేయటం శోచనీయమని పేర్కొన్నారు.

-బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా

### విపక్షాలే టార్గెట్.. ఇది ఓపెన్ సీక్రెట్



సీఎం కేసీఆర్ కుటుంబాన్ని బ్లాక్ మెయిల్ చేయాలని మోదీ సర్కార్ కుట్రలు చేస్తున్నదని రాజ్యసభ స భ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో కవితకు నోటీసులు ఇచ్చినంత మాత్రన బీఆర్ఎస్ బెదిరిపోదని స్పష్టం చేశారు. 2014 నుంచి సీబీఐ దాడులు ఎదుర్కొన్న 124 మంది నాయకుల్లో 118 మంది విపక్ష నేతలేనని అన్నారు. ప్రజాధనాన్ని కేంద్రం కార్పొరేట్లకు కట్టబెడుతుంటే దర్యాప్తు సంస్థలు ఏమిచేస్తున్నాయని ప్రశ్నించారు. విపక్షాలే మోదీ టార్గెట్..ఇది ఓపెన్ సీక్రెట్ అని విమర్శించారు.

-ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### జాతి 'జాగృత'మైతున్నది



ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడంలో భాగంగానే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేసిందని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ విమర్శించారు. భారత జాగృతి ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసిన కవిత ఇప్పుడు దేశ ప్రజలను జాగృతి చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటే అడ్డుకోవడానికి కేంద్రం ఈడీ ద్వారా నోటీస్ ఇప్పించిందని ఆరోపించారు. ఈ నోటీసులకు భయపడేది లేదన్నారు. కేంద్రం వేధింపులను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని చెప్పారు.

- అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

### మహిళలంటే గిట్టకనే కవితకు నోటీసులు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఎమ్మెల్సీ కవితకు రాజకీయ దురుద్దేశంతో ఈడీ నోటీసులు ఇచ్చిందని రెడ్ కో చైర్మన్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న నాయకురాలిపై ఈడీ నోటీసులు ఇవ్వడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. బీజేపీ అక్రమాలను, అరాచకాలను ప్రశ్నించిన వారిని ఈడీ, సీబీఐ, ఐటీతో అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు.

-రెడ్ కో చైర్మన్ వై సతీశ్‌రెడ్డి

### ప్రశ్నిస్తే వేధింపులా



కేంద్ర ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కుటుంబంపై కేంద్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఆరోపించారు. ఇందులో భాగంగానే కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇరికించేందుకే ఈడీతో నోటీసులు జారీ చేయించిందని విమర్శించారు. ఇటీవల ఇదే కుంభకోణంపై సీబీఐ అధికారులు జరిపిన విచారణలో కవిత అన్ని విషయాలు వెల్లడించిన తర్వాత కూడా నోటీసులు ఇప్పించడం దారుణమని మండిపడ్డారు. రాజకీయ ప్రతీకారంతో కేంద్రం ఇంత దారుణంగా వేధించడం దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

-రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

### ఇదేమి రాజ్యం?



మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఏ ప్రతిపక్ష పార్టీ ఉండొద్దనే రీతిలో పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ హనుమంతరావు (వీహెచ్) ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో రాజ్యాంగ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను మోదీలాగా ఎవరూ దుర్వినియోగం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో దాడులకు గురైన సుజనా చౌదరీ, సీఎం రమేశ్ లాంటి వాళ్లు బీజేపీలో చేరగానే పవిత్రులైపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ దుర్మార్గ విధానాన్ని ప్రజలకు చెప్తున్నామని తెలిపారు.

-కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ, వీహెచ్

## నిమ్స్ వైద్యుడికి అరుదైన గౌరవం




హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): నిమ్స్ పీడియాట్రిక్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్వీకుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సల విభాగంలో రెండేండ్ల ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాలని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ భావిస్తున్నది. దీనికోసం నియమ నిబంధనల రూపకల్పనకు దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో ఆర్వీకుమార్‌కు చోటు దక్కింది.

## తల్లి పులి ఆపరేషన్‌లో వీడని ఉత్కంఠ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఏపీలోని నంద్యాల జిల్లాలో తల్లి పులి గాలింపులో ఉత్కంఠ ఇంకా కొనసాగుతున్నది. ఆపరేషన్‌లో కీలక పరిణామం చోటు చేసుకున్నట్టు ఆపరేషన్ కమిటీ మెంబర్, డిప్యూటీ డైరెక్టర్ విగ్నేశ్ అప్పవ్ పేర్కొన్నారు. పెద్దగుమ్మాడాపురం అటవీ ప్రాంతంలో పెద్దపులి జాడను అటవీశాఖ సిబ్బంది గుర్తించినా, అది తల్లి పులి జాడలా? కాదా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. మరోవైపు 50 మందికిపైగా అటవీ అధికారులతో మొత్తంగా 300 మంది సిబ్బందితో ఆపరేషన్ తల్లి పులి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దాదాపు 200 హెక్టార్లలో 40 ట్రాప్ కెమెరాలతో ట్రేస్ చేస్తున్నామని చెప్పారు. అవసరాన్ని బట్టి డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తామని అన్నారు. నాలుగు పులి పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయని, వైద్య బృందంతో ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. నిపుణుల సూచనల మేరకు పులికూనలకు పాలు, సెరెలాక్, చికెన్, లివర్ ముక్కలను అందించినట్టు విగ్నేశ్ తెలిపారు.

# ఇన్‌ఫ్లూయెంజాతో ప్రమాదం లేదు

- కొత్త రూపంలో పాత వైరస్
- వ్యాధిగ్రస్తుల్లో సాధారణ లక్షణాలే..
- గాంధీ దవాఖానలో నిర్ధారణ పరీక్షలు
- అన్ని దవాఖానల్లో ప్రత్యేక వార్డులు



హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఇన్‌ఫ్లూయెంజాపై కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్న వేళ, ఆ వైరస్ పెద్ద ప్రమాదకరి కాదని ఐసీఎమ్మార్ వెల్లడించింది. కొవిడ్ తరహాలో ఇదేదో కొత్త వైరస్ అని పేర్కొన్నది. వాస్తవానికి ఈ వైరస్ కొత్తదేం కాదు.. మన దేశంలో దాదాపు 2002 సంవత్సరం నుంచి కాస్త ప్రభావం చూపుతున్నది. మొదట్లో ఈ వ్యాధి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపినా, ఆ తర్వాత సాధారణ జలుబుగా మారిపోయింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 'హెచ్3ఎన్2' కూడా ఇదే కోవకు చెందిందే. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, జ్వరం వంటి లక్షణాలే తప్ప ప్రాణాంతకంగా పరిణమించేలా ప్రభావం చూపడం లేదు. కొన్ని రోజులుగా ప్రపంచ దేశాల్లో లక్షల సంఖ్యలో కేసులు నమోదవుతున్నా, ఒక్క మరణం కూడా నమోదు కాలేదని నిపుణులు చెప్తున్నారు. కొత్త వైరస్ లక్షణాలతో దవాఖానలకు వస్తున్న వారిలో సగటున 10-15 శాతం మంది మాత్రమే ఉన్నట్టు తేలింది. గర్భిణులు, ఐదేండ్ల లోపు చిన్నారులు, 60 ఏండ్ల పైబడిన వృద్ధులకు ఈ వైరస్ కొంత ప్రభావం చూపే అవకాశాలున్నట్టు వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వీరితో పాటు కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

### గాంధీలో నిర్ధారణ పరీక్షలు

హెచ్3ఎన్2 కేసులకు సంబంధించి గాంధీ మెడికల్ కళాశాలలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఫీవర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ తెలిపారు. కరోనా పరీక్షల తరహాలోనే ఈ పరీక్షలను కూడా చేస్తారని చెప్పారు. వీటికి ప్రత్యేకమైన కిట్స్ ఉంటాయని తెలిపారు. కేసుల సంఖ్య పెరిగితే ఫీవర్ హాస్పిటల్‌లో కూడా హెచ్3ఎన్2 నిర్ధారణ పరీక్షలను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. హెచ్3ఎన్2తో పాటు అన్ని రకాల ఫ్లూలకు సంబంధించిన టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్లూ-షాట్ టీకా తీసుకుంటే సరిపోతుంది. ఇది ఫ్లూ నుంచి రక్షణ కల్పిస్తుంది.

### మాస్క్ ధరిస్తే మంచిదే..

కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇన్‌ఫ్లూయెంజా నుంచి తప్పించుకోవడానికి అవకాశం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

- ఇంటి నుంచి బయటికి వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి.
- చేతులను తరుచూ శుభ్రం చేసుకోవాలి.
- ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ముక్కును, నోటిని తరుచూ చేతులతో తాకడాన్ని మానుకోవాలి.
- వీటితోపాటు మరిన్ని కొవిడ్ తరహా ముందు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు.
- సొంత వైద్యం చేసుకొని, ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని కోరుతున్నారు.

### అందుబాటులో చికిత్స



హెచ్3ఎన్2 స్వైన్‌ఫ్లూ ఉప వేరియంట్. ఇది పాతవైరసే. ఈ ఫ్లూకు అవసరమైన పూర్తి చికిత్స మనదగ్గర అందుబాటులో ఉంది. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన పనిలేదు. సొంత వైద్యం పనికిరాదు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ దవాఖానను ఆశ్రయించడం మంచిది.

*- డాక్టర్ శంకర్, సూపరింటెండెంట్*

### కరోనా నియమాలు పాటించాలి



హెచ్3ఎన్2 ప్రమాదకారి కాక పోయినా గతంలో కంటే కొంత హాస్పిటల్ అడ్మిషన్స్ పెరుగుతున్నట్టు ఐసీఎమ్మార్ వెల్లడించింది. మరికొంత కాలం కరోనా నియమాలు పాటిస్తే ఈ ఫ్లూను కూడా జయించిన వారమవుతాం. దీనికి యాంటి వైరల్ మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

*- డాక్టర్ కిరణ్ మాడాల, నిజామాబాద్*

## ఆందోళన వద్దు

- లక్షణాలుంటే డాక్టర్‌ను సంప్రదించాలి
- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఇన్‌ఫ్లూయెంజా కేసుల గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లో ఇన్‌ఫ్లూయెంజా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం వైద్యారోగ్యశాఖ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో పరిస్థితులు, ఆరోగ్యశాఖ సన్నద్ధతపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు ఉంటే సమీప ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. జ్వరం, జలుబు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ రిజ్వి, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, డీహెచ్ శ్రీనివాస్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజారావు, ఫీవర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ శంకర్, నిలోఫర్ సూపరింటెండెంట్ ఉషారాణి, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### లోకం పోకడ




ఉల్లిచారు, ఉల్లిఫ్రై, ఉల్లి చట్నీ, ఉల్లి పలావ్, ఉల్లి బిర్యానీ... స్టాకు అయిపోయేంత వరకు మీకు ఇవే కూరలు...

## యాదగిరీశుడికి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, మార్చి 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి గజవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపి స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దర్బార్ సేవ, ఉత్సవమూర్తులకు తిరువీధి సేవ వైభవంగా జరిగింది. స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సుమారు 17 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ఖజానాకు రూ.19,95,069 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో గీత తెలిపారు.

## నెలాఖరున కృష్ణా బోర్డు సమావేశం

**వార్షిక బడ్జెట్, వివిధ అంశాలపై ప్రధాన చర్చ**
**ఎజెండా సిద్ధం చేస్తున్న కేఆర్ఎంబీ అధికారులు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 17వ సమావేశాన్ని ఈ నెలాఖరున నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఎజెండా అంశాలపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. వాస్తవానికి ఈ సమావేశం జనవరి 11వ తేదీనే జరగాల్సి ఉన్నప్పటికీ ఇరు రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు వాయిదా పడింది. ఆ తర్వాత బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఇప్పటివరకు ఈ సమావేశం జరగలేదు. దాదాపు నెల క్రితం కొత్త చైర్మన్‌గా శివనందన్‌కుమార్ నియమితులవడంతో బోర్డు సమావేశం ఏర్పాటుపై కేఆర్ఎంబీ దృష్టి సారించింది. ప్రస్తుతం కేఆర్ఎంబీ వద్ద ఉన్న నిధులు మరో 3 నెలలకు మాత్రమే సరిపోయే అవకాశం ఉండటంతో వీలైనంత త్వరగా బోర్డు సమావేశాన్ని నిర్వహించి వార్షిక బడ్జెట్‌ను ఆమోదింపజేసుకునేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం బోర్డులో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు బేసిక్‌పై అధికంగా చెల్లిస్తున్న 25 శాతం ఇన్సెంటివ్స్‌ను కేంద్ర జల్‌శక్తి శాఖ రద్దు చేయడంతోపాటు ఇప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఇటీవల కేఆర్ఎంబీని ఆదేశించింది. దీనితోపాటు నీటి పంపకాలు, పలు ఇతర అంశాలపై బోర్డు చర్చించనున్నట్టు తెలుస్తున్నది.

## భారత్ చేరిన నిసార్ ఉపగ్రహం

- నాసా, ఇస్రో సంయుక్తంగా తయారీ
- వచ్చే ఏడాది ప్రవేశపెట్టే అవకాశం



బెంగళూరు, మార్చి 8: భూమిపై పరిణామాలను నిత్యం పరిశీలించి తక్షణం సమాచారాన్ని అందించే నిసార్ ఉపగ్రహాన్ని అమెరికా వైమానిక దళం బుధవారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు బెంగళూరులో అందజేసింది. అమెరికాకు చెందిన నాసా, భారత్‌కు చెందిన ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ నిసార్ రెండు దేశాల అంతరిక్ష సహకారానికి మైలురాయిగా నిలుస్తుందని చెన్నైలోని యూఎస్ కాన్సులేట్ జనరల్ వ్యాఖ్యానించారు. నిసార్‌లో రెండు వేర్వేరు రాడార్లు ఉంటాయి. లాంగ్ రేంజ్ రాడార్‌ను అమెరికా, ఎస్-బ్యాండ్ రాడార్‌ను భారత్ శాస్త్రవేత్తలు రూపొందించారు. తర్వాత వీటిని అమెరికాలోని జెట్‌పాపుల్సన్ ల్యాబరేటరీకి పంపి ఏక యూనిట్‌గా మార్చారు. అక్కడి నుంచి దీనిని విమానంలో భారత్‌కు తరలించారు. ఈ ఉపగ్రహాన్ని భూమిపై వాతావరణంలో జరిగే నిగూఢ మార్పుల శోధనకు ఉపయోగిస్తారు. దట్టమైన మేఘాలు ఆవరించి ఉన్న సమయంలోనూ వాతావరణంలోని మార్పులను పసిగట్టి తెలియజేయగల సత్తా దీని సొంతం. అంతేకాకుండా ఇది భూ ఉపరితలం, మంచుగడ్డలు ఉన్న ప్రాంతాలలో జరిగే కదలికలను పసిగడుతుంది. పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. వ్యవసాయ మ్యాపింగ్‌కు, కొండచరియలు అధికంగా ఉండే ప్రాంతాలలోని పరిస్థితుల అంచనాకు సైతం దీనిని వినియోగించాలని ఇస్రో భావిస్తున్నది. ఈ ఉపగ్రహాన్ని వచ్చే ఏడాది ఏపీలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్టు ఒక అధికారి తెలిపారు.

## ఎండాకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 36.0°c | 21.0°c |
| మహబూబ్‌నగర్ | 35.9°c | 22.0°c |
| రంగారెడ్డి | 34.3°c | 13.3°c |
| వరంగల్ | 34.0°c | 19.0°c |
| కరీంనగర్ | 34.0°c | 19.0°c |
| నల్లగొండ | 33.5°c | 19.4°c |
| మెదక్ | 32.3°c | 14.3°c |
| ఆదిలాబాద్ | 31.3°c | 14.7°c |
| నిజామాబాద్ | 30.9°c | 18.7°c |
| హైదరాబాద్ | 26.0°c | 20.0°c |


## కేటాయింపులకు మించి కృష్ణా జలాల వినియోగం

- కేఆర్ఎంబీకి ఈఎన్సీ మురళీధర్ లేఖ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ జలాల వినియోగంలో ఏపీ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నదని, కేటాయింపులకు మించి నీటిని వాడుకుంటున్నదని తెలంగాణ ప్రభుత్వం ధ్వజమెత్తింది. దీనిపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు వెంటనే స్పందించాలని, ఏపీ అక్రమాలను నిలువరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్ బుధవారం కేఆర్ఎంబీకి లేఖ రాశారు. 66:34 నిష్పత్తి ప్రకారం ఏపీ 641.05 టీఎంసీలు, తెలంగాణ 330.23 టీఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ ఫిబ్రవరి 28 నాటికే ఏపీ 673.60 టీఎంసీలను ఉపయోగించుకున్నదని వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి నీటిని వినియోగించకుండా ఏపీని నిలువరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంటనే ఆ రాష్ట్రానికి తగు ఆదేశాలు జారీచేయాలని ఈఎన్సీ మురళీధర్ కోరారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 15 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు
- హాజరుకానున్న 9.51 లక్షల మంది విద్యార్థులు
- 1,473 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పరీక్షలు ఈ నెల 15 న ప్రారంభమై, ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మొత్తం 9,51,022 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 9.06 లక్షల రెగ్యులర్ విద్యార్థులుండగా, మరో 45 వేలు ప్రైవేట్ విద్యార్థులున్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 1,473 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే కాలేజీ లాగిన్ ఐడీలో విద్యార్థుల హాల్‌టికెట్లను విడుదల చేశారు. సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలను నిర్వహిస్తారు. ప్రశ్నపత్నాలను తెరవడం.. ఆన్సర్‌షీట్లను నింపే ప్రక్రియనంతా సీసీ కెమెరాలో రికార్డు చేస్తారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

### 53 వేల మంది విద్యార్థులు ఫీజు చెల్లించలేదు

ఇంటర్‌లో ఈ ఏడాది 53,162 విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించలేదు. వీరంతా అడ్మిషన్లు పొందినా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదుచేసుకున్నా పరీక్ష ఫీజు చెల్లించలేకపోయారు. ఇలాంటి వారు ఫస్టియర్‌లో 16,191 మంది విద్యార్థులు కాగా, సెకండియర్‌లో 36, 971 మంది విద్యార్థులున్నారు. ఫీజు చెల్లించేందుకు ఇంటర్‌బోర్డు పలు మార్లు అవకాశం ఇచ్చింది. తత్కాల్ స్కీం కింద కూడా ఫీజు చెల్లించే వెసులుబాటు ఇచ్చింది. అయినా 53 వేలకు పైగా విద్యార్థులు ఫీజు చెల్లించకపోవడం అధికారులను ఆశ్చర్యపరిచింది.

| సంవత్సరం | అడ్మిషన్లు పొందిన వారు | పరీక్ష ఫీజు చెల్లించినవారు |
|---|---|---|
| ఫస్టియర్ | 4,98,692 | 4,82,501 |
| సెకండియర్ | 4,60,872 | 4,23,901 |
| మొత్తం | 9,59,564 | 9,06,402 |

### ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్

| తేదీ(రోజు) | పేపర్ |
|---|---|
| 15-3-2023 (బుధవారం) | రెండోభాష పేపర్ -1 |
| 17-3-2023 (శుక్రవారం) | ఆంగ్లం పేపర్ -1 |
| 20-3-2023 (సోమవారం) | గణితం పేపర్ 1ఏ, బాటనీ పేపర్ -1, పొలిటికల్ సైన్స్ పేపర్ -1 |
| 23-3-2023 (గురువారం) | గణితం పేపర్ 1బీ, జువాలజీ పేపర్ -1, హిస్టరీ పేపర్ -1 |
| 25-3-2023 (శనివారం) | ఫిజిక్స్ పేపర్ -1, ఎకనామిక్స్ పేపర్ -1 |
| 28- 3-2023 (మంగళవారం) | కెమిస్ట్రీ పేపర్ -1, కామర్స్ పేపర్ -1 |
| 31-3-2023 (శుక్రవారం) | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -1, బ్రిడ్జికోర్సు గణితం పేపర్ -1 (బైపీసీ విద్యార్థులకు) |
| 03-4-2023 (సోమవారం) | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -1, జాగ్రఫీ పేపర్ -01 |

### సెకండియర్ పరీక్షల షెడ్యూల్

| తేదీ (రోజు) | పేపర్ |
|---|---|
| 16-3-2023(గురువారం) | రెండోభాష పేపర్ -2 |
| 18-3-2023 (శనివారం) | ఆంగ్లం పేపర్ -2 |
| 21-3-2023 (మంగళవారం) | గణితం పేపర్ -2ఏ, బాటనీ పేపర్ -2, పొలిటికల్ సైన్స్ పేపర్ -2 |
| 24-3-2023 (శుక్రవారం) | గణితం పేపర్ -2బీ, జువాలజీ పేపర్ -2, హిస్టరీ పేపర్ -2 |
| 27-3-2023 (సోమవారం) | ఫిజిక్స్ పేపర్ -2, ఎకనామిక్స్ పేపర్ -2 |
| 29-3-2023 (బుధవారం) | కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్ -2 |
| 1-4-2023 (శనివారం) | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2, బిడ్జికోర్సు గణితం పేపర్ -2 (బైపీసీ విద్యార్థులకు) |
| 4-4-2023 (మంగళవారం) | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ -2, జాగ్రఫీ పేపర్ -2 |

## విద్యా - ఉద్యోగ సమాచారం

### 6 రోజులకే 31 వేల ఎంసెట్ దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఆరు రోజులకే 31,820 దరఖాస్తులు వచ్చాయి. 32,842 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఈ నెల 3 నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన విషయం తెలిసిందే.

### ఒకే ఎంట్రెన్స్‌తో 10 సబ్జెక్టులు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది సీయూఈటీ (యూజీ) ప్రవేశ పరీక్షకు 10 సబ్జెక్టులను ఎంపిక చేసుకొనే అవకాశం కల్పించారు. ఇదివరకు గరిష్ఠంగా తొమ్మిది సబ్జెక్టులుండగా, ఈసారి మరో సబ్జెక్టును అదనంగా చేర్చారు. దీంతో విద్యార్థులు ఒకే ఎంట్రన్స్‌తో 10 సబ్జెక్టులను రాసుకొనే వీలు కల్గింది. సెంట్రల్ యూనివర్సిటీలు సహా ఇతర విద్యాసంస్థల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ (యూజీ)కి ఈ నెల 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది 150 యూనివర్సిటీలు ఇప్పటికే సీయూఈటీ స్కోర్ ఆధారంగా అడ్మిషన్లు చేపట్టేందుకు ముందుకొచ్చాయని, త్వరలోనే వీటి సంఖ్య 200కు చేరుతుందని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు.


### పాలిటెక్నిక్ అనుత్తీర్ణులకు మరో చాన్స్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ కోర్సుల్లో ఫెయిలైన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరికోసం కొత్తగా ప్రత్యేక పరీక్షలకు అనుమతి ఇచ్చింది. 1990 నుంచి ఇప్పటివరకు (2018లో అడ్మిషన్ పొందినవారు) ఫెయిలైన అభ్యర్థులకు ఈ ఏడాది జూన్‌లో పరీక్షలు ఉంటాయని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి డాక్టర్ సీ శ్రీనాథ్ తెలిపారు. బుధవారం పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను విడుదల చేశారు. అభ్యర్థులు ఏప్రిల్ 10లోపు పరీక్ష ఫీజుగా రూ.3 వేలు చెల్లించాలని తెలిపారు. రూ.400 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, తత్కాల్ స్కీం కింద మరో రూ. 6 వేల అదనంగా కలిపి ఏప్రిల్ 15 వరకు ఫీజు చెల్లించవచ్చని సూచించారు. పరీక్షల నిర్వహణతో పాటు అభ్యర్థులకు మూడు సబ్జెక్టుల నుంచి మినహాయింపునిచ్చినట్టు పేర్కొన్నారు.

**సబ్జెక్టుల మినహాయింపు ఇలా**

- ఒక విద్యార్థి 12 సబ్జెక్టులు ఫెయిలైతే.. సంబంధిత అభ్యర్థి మూడు సబ్జెక్టుల నుంచి మినహాయింపు పొంది 9 సబ్జెక్టులకు పరీక్షలు రాయొచ్చు. నాలుగు సబ్జెక్టులు ఫెయిలైన అభ్యర్థి ఒక సబ్జెక్టు రాసి, పాసైతే సరిపోతుంది.

## తొలి ప్రైవేటు లా కాలేజీ ఫౌండర్ పీఆర్ఆర్ ఇకలేరు



హైదరాబాద్, మార్చి 8(నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రాంతంలో తొలి ప్రైవేటు న్యాయ కళాశాలను ఏర్పాటు చేసిన పడాల రాంరెడ్డి ఇకలేరు. వయోభారంతో బుధవారం మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పెరవలి మండలం పీతల వేమవరం గ్రామంలో పుట్టిన పడాల రాంరెడ్డి, న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్న అనంతరం హైకోర్టు లైబ్రేరియన్‌గా, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా సేవలు అందించారు.

### తొలి ప్రైవేటు లా కాలేజీ ఏర్పాటు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేటు లా కళాశాల అవసరాన్ని గుర్తించిన ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.1988లో హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ఎల్లారెడ్డిగూడలో తొలి ప్రైవేటు న్యాయ కళాశాలను ఏర్పాటు చేసి న్యాయ విద్యాభివృద్ధికి రాంరెడ్డి కృషి చేశారు. విద్యార్థులకు న్యాయ సలహాలు ఇస్తూ వారిని ప్రోత్సహించేవారు, ఇప్పటివరకు ఎంతో మంది న్యాయ కోవిదులను తీర్చిదిద్దారు. భారత రాజ్యాంగం, న్యాయశాస్త్రానికి సంబంధించి 120 పుస్తకాలను రచించారు. ఆయన కొడుకు హైదరాబాద్‌లో స్థిరపడగా, కూతురు యూఎస్‌లో నివాసం ఉంటున్నది. గండిపేటలో స్థిరపడిన కొడుకు శ్రీనివాస్‌రెడ్డి వద్దనే గత రెండు నెలలుగా ఉంటున్న పడాల రాంరెడ్డి వయోభారంతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

### నేడు అంత్యక్రియలు

అస్వస్థతకు గురైన రాంరెడ్డి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్టుగా తెలిసింది. భౌతికకాయాన్ని నిమ్స్‌కు తరలించారు. గురువారం అంతిమ సంస్కారాలు జరగనుండగా, పంజాగుట్టలోని ద్వారకాపురి కాలనీలో ఆయన సొంతింటిలో భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచనున్నారు.

## కోర్ గ్రూప్ కోర్సులు క్లోజ్ చేయం

- ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు జేఎన్టీయూ షాక్
- సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచుల్లో కనీసం 30 సీట్లు తప్పనిసరి
- ఎమర్జింగ్ గ్రూపులకే యాజమాన్యాల మొగ్గు
- అనుమతించేది లేదంటున్న వర్సిటీ అధికారులు
- దరఖాస్తు చేసుకొన్న సగానికి పైగా కాలేజీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, ఈసీఈ వంటి కోర్ గ్రూప్ కోర్సులను ఎట్టిపరిస్థితుల్లో మూసివేయబోమని జేఎన్టీయూహెచ్ స్పష్టంచేసింది. ఇందుకు కాలేజీలకు అనుమతులిచ్చే ప్రసక్తే లేదని తెలిపింది. ఈ కోర్సులు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేట్, నిర్మాణ, ఉత్పాదక రంగాల్లో మంచి అవకాశాలు ఉంటాయని వెల్లడించింది. ఈ కోర్ గ్రూప్ కోర్సుల్లో తగిన విద్యార్థులు లేకపోయినా కనీసం 30 సీట్లతో డిపార్టుమెంట్లను కొనసాగించాలని జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ తెలిపారు. వర్సిటీ నిబంధనలను పాటించకుండా కేవలం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) డిపార్టుమెంట్లనే నిర్వహించాలనుకొనే యాజమాన్యాలకు అనుమతులివ్వబోమని, వీటికి వచ్చే విద్యాసంవత్సరంలో అఫిలియేషన్లు నిలిపివేస్తామని పేర్కొన్నారు. కొన్నేండ్ల క్రితమే పలు ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో కోర్ గ్రూపుల కోసం డిపార్టుమెంట్లు, టీచింగ్ ఫ్యాకల్టీ, ల్యాబ్‌ల వంటివి ఏర్పాటు చేసి ఉన్నాయని, వాటిని ఇప్పటికిప్పుడు క్లోజ్ చేయడం మంచిది కాదని వర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. జేఎన్టీయూ నిర్ణయంతో కంప్యూటర్ సైన్స్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచుకొనేందుకు సిద్ధమవుతున్న కాలేజీలకు షాక్ తగిలినట్టయింది.

**దరఖాస్తు చేసుకున్న సగానికిపైగా కాలేజీలు**

కోర్ గ్రూపుల్లోని డిపార్టుమెంట్లు, సీట్ల మూసివేతకు, కేవలం సీఎస్ఈ గ్రూప్‌లో సీట్లు పెంచుకొనేందుకు దాదాపు 80కిపైగా కాలేజీలు జేఎన్టీయూకు దరఖాస్తు చేసుకొన్నట్టు అధికారులు తెలిపారు. అయితే, దీనిపై కసరత్తు జరుగుతున్నదని, త్వరలోనే దరఖాస్తుల వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అధికారులు వెల్లడించారు. కాగా, ఈసారి ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల క్లోజర్ కోసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు తెలిపారు.

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో దళితులకు ముప్పు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): మతోన్మాద ఆర్ఎస్ఎస్, బీజేపీ విధ్వంసకర చర్యలతో దిక్కుతోచని స్థితిలో దళితులు భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యం దళితులపై దాడులు, మారణహోమాలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. మోదీ ప్రధాని అయ్యాక దళితులపై మరింతగా పెరిగాయని, ఇందుకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికే సాక్ష్యమని చెప్పారు. కులం ఆధారంగా ద్వేషపూరిత నేరాల ఘటనలను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. దేశమంతటా వివక్ష, సామాజిక బహిష్కరణను ఎదుర్కుంటున్న దళితులు, ఆదివాసీ వర్గాల బాధలు అత్యంత దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులు కల్పించే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తున్నదని విమర్శించారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### సమీర్‌లో..

సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ & రిసెర్చ్ (సమీర్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 21
- పోస్టులు: సైంటిస్ట్ సీ, సైంటిస్ట్ బీ
- అర్హతలు, ఎంపిక కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఏప్రిల్ 8
- వెబ్‌సైట్: http://www.sameer.gov.in

### బెల్‌లో..

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో తాత్కాలిక/కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 20
- పోస్టులు: ట్రెయినీ ఇంజినీర్-8, ప్రాజెక్ట్ ఇంజినీర్- 12
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 25
- వెబ్‌సైట్: www.bel-india.in

### హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో...

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో శాశ్వత, కాంట్రాక్టు/నిర్ణీత కాలానికి కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 43
- పోస్టులు: మేనేజర్, డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్, సీనియర్ కన్సల్టెంట్ తదితరాలు
- విభాగాలు: లీగల్, కమర్షియల్, టెక్, సేఫ్టీ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- వెబ్‌సైట్: http://www.hslvizag.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- సైన్స్ అండ్ టెక్నాలజీ, బయాలజీ ఇంటర్ మ్యాథ్స్ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.
- కింది వెబ్‌సైట్‌ను క్లిక్ చేయండి.
- https://bit.ly/3kTqXZI

‘వేదిక’ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# మూడోవంతు ఇవ్వాల్సిందే!

**రువాండా..** ఆఫ్రికాలో ఒక చిన్న దేశం. జనాభా కోటిన్నర ఉండదు. అటువంటి దేశం 1994లో జాతిపరమైన విద్వేషంలో కూరుకుపోయి భయంకరమైన హత్యాకాండ చోటు చేసుకుంది. కేవలం 100 రోజుల్లో దాదాపు 8 లక్షల మంది టుట్సీ జాతి ప్రజలు మరణించారు. యావత్ ప్రపంచం నివ్వెరపోయింది. రువాండా అంతర్మథనంలో పడింది. మరోసారి ఇటువంటిది జరగవద్దని భావించి.. దేశాన్ని శాంతి ధామంగా మలచాలనుకుంది. రెండు దశాబ్దాలు గడిచాయి. నేడు రువాండా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారింది. దీనికి ప్రధాన కారణం.. మహిళలకు పాలనలో భాగస్వామ్యం కల్పించటం. ప్రపంచంలోనే చట్టసభల్లో అత్యధికంగా (61 శాతం) మహిళలు ఉన్న దేశం రువాండా. జనాభాలో సగమైన స్త్రీలకు పాలనలో పగ్గాలు అప్పగిస్తే.. విధ్వంస దేశాన్ని సైతం నందనవనంగా మార్చగలరని చెప్పటానికి రువాండానే ఒక ఉదాహరణ. అనేక దేశాలు రువాండా నుంచి స్ఫూర్తి పొందాల్సి ఉంది. ఎందుకంటే, ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల చట్టసభల్లో స్త్రీల వాటా 24 శాతం లోపే.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటింది కానీ, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం సగం కాదుకదా.. మూడోవంతు కూడా ఉండటం లేదు. లోక్‌సభలో మరీ దిగదిడుపుగా 14 శాతమే వారి వాటా. 140 కోట్ల జనాభాలో 70 కోట్ల మంది స్త్రీలు. చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోతే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది? లోక్‌సభలో, శాసనసభల్లో మూడోవంతు స్థానాలను అతివలకు అందించే మహిళా రిజర్వేషన్ బిల్లు 27 ఏండ్లుగా పెండింగులోనే పడి ఉన్నది. 1996లో తొలిసారి ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ, ఆమోదం పొందలేదు. ఆ తర్వాత అనేక మార్లు మళ్లీ చర్చకు వచ్చింది. ఎట్టకేలకు 2010లో రాజ్యసభ ఆమోదముద్ర వేసింది కానీ, లోక్‌సభలో ఎప్పటిలాగే అడ్డంకి ఎదురైంది. 2014లో 15వ లోక్‌సభ రద్దుతో బిల్లు కూడా వీగిపోయింది. కాంగ్రెస్ హయాం ముగిసి బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదేండ్లలో కూడా బిల్లుకు పార్లమెంటు ఆమోదముద్ర పడేలా అధికారపార్టీ ఎటువంటి ప్రయత్నాలు జరుపలేదు.

మహిళా సాధికారత విషయంలో మోదీ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. నారీశక్తి, బేటీ పడావో బేటీ బచావో వంటి ఆకర్షణీయమైన నినాదాలను తీసుకొచ్చింది కానీ, ఆచరణలో ఆమడదూరంలో ఉంది. లోక్‌సభలో, రాజ్యసభలో ఇప్పుడు ఆ పార్టీకి పూర్తి మెజారిటీ ఉంది. దానిని అడ్డం పెట్టుకొని వివాదాస్పద సాగు చట్టాలను రైతుల మీద రుద్దింది. కానీ, మహిళా బిల్లును మాత్రం ముందుకు తీసుకురావటం లేదు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలన్న భారత జాగృతి సారథి కవిత డిమాండ్ సమంజసమైనది. మహిళా బిల్లుకు బీఆర్ఎస్ ఇప్పటికే పూర్తి మద్దతు ప్రకటించింది. మహిళలకు అవకాశం కల్పిస్తే పురుషులకు సీట్లు తగ్గుతాయన్న ఆందోళన పార్టీలకు ఉంటే.. చట్టసభల్లో 33 శాతం మేర సీట్లు పెంచి, వాటిని స్త్రీలకు కేటాయించాలని సీఎం కేసీఆర్ ఒక మంచి ప్రత్యామ్నాయాన్ని కూడా కేంద్రానికి సూచించారు. మోదీ ఇకనైనా ఈ బిల్లుపై మౌనం వీడాలి. మహిళాభ్యున్నతి పట్ల మాటలు మాని, చేతల్లో చిత్తశుద్ధిని చాటుకోవాలి.

---

## కలగన్న కాలం



సామాజిక మాధ్యమాలా?
వైరుధ్య అగ్నికీలల మంటలా?
ఏ మాధ్యమం ఎవడి ప్రతినిధి అయినా..
‘సత్యం వద! ధర్మం చర!!’
ఆర్యోక్తిని ప్రతినిత్యం వధించడమెందుకు?

పవిత్ర దేవాలయాలు, న్యాయ సంస్థలు
సత్యాసత్య విచక్షణా ప్రతిరూపాలు..
ప్రభుత్వ నిఘా సంస్థలు
ప్రజల ధర్మాగ్రహ మెరుగని దీనావస్థలు
భరోసా కరువైన సత్యశోధన విచారణలు

అత్యున్నత స్థాయిలోని అక్రమాల పుట్టలు
విష కీటకాల నెలవైన వికృతరూపాలు
అరణ్య రోదనలో అలమటించే నిజ నిర్ధారణలు
దేశవ్యాప్త సిగ్గుమాలిన ప్రజాస్వామ్య ఖూనీలు

నేటి ఆటవిక రాజ్యంలో...
దురాచారాల పాలైన సదాచారాలు
ప్రజాభీష్టమనే ప్రజల నాడి-కల్పతరువు
ప్రలోభాల వేలంలో విలపించే దుర్దశ
నివ్వెరపోయిన నాగరిక సమూహాలు

వ్యవస్థల విష వలయాల్లో
బందీయైన రాజకీయ చదరంగం
తక్షణ పరిష్కారమెరుగని అక్రమాల అకృత్యాలు
రాజ్యాధికార చట్రంలో దాక్కున్న అక్రమార్కులు
అధికారం పెనుగులాటలో విద్వేష ధోరణులు
స్థాయిమరచి ప్రకోపాలపాలైన దుర్బల మనస్తత్వాలు

ఓ నా భారతమా!
సనాతన సత్సాంప్రదాయాలు..
నిష్ఠాగరిష్ఠుల నిలయమా!
ఏమిటీ దుస్థితి?
నడిసంద్రంలో తీరంకై తీరని అన్వేషణ
దరిచేర్చే నాథుడెవరో?
కలగన్న ‘కాలం’ కనుక్కుంటుంది.



కె.లక్ష్మణ్‌గౌడ్
97049 30509

---

# నాణేనికి మరోవైపు

**ఢిల్లీ లిక్కర్ స్కాం**

ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2021-22లో రాష్ట్రంలో నూతన మద్యం విధానాన్ని తెచ్చింది. దీని ప్రకారం ఢిల్లీ రాష్ట్రంలో మద్యం అమ్మకాలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం ఉండదు. ప్రైవేటు దుకాణాలే ఆ పనిచేస్తాయి. 2021 నవంబర్‌లో ఈ పాలసీ అమల్లోకి వచ్చింది. అప్పుడు ఎక్సైజ్ మంత్రిగా మనీష్ సిసోడియా ఉన్నారు. మద్యం మాఫియాను, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి, సరుకును అన్ని దుకాణాల మధ్య సమంగా పంపిణీ చేయడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి, వినియోగదారులకు మరింత మంచి సేవలు అందించడానికి కొత్త మద్యం విధానం ఉపయోగపడుతుందని ఆప్ ప్రభుత్వం పేర్కొన్నది. దేశంలోనే అత్యుత్తమ, పారదర్శక మద్యం విధానాన్ని తాము రూపొందించామని, ఇందులో కుంభకోణం వంటిదేదీ లేదని కూడా అది స్పష్టం చేసింది.



పట్టాభి వేములపాటి



ఈ విధానంలో భాగంగానే ఢిల్లీ ప్రభుత్వం మద్యం విక్రేతలకు కొన్ని సడలింపులు కూడా ఇచ్చింది. వీటి ప్రకారం వారు అమ్మకాలను పెంచుకోవడానికి వినియోగదారులకు డిస్కౌంట్లు ఇవ్వవచ్చు. ఎమ్మార్పీకి బదులుగా ఆయా బ్రాండ్లకు వారే ధరలను నిర్ణయించుకోవచ్చు. కొత్త విధానం ఫలితంగా ఎక్సైజ్ రాబడి గణనీయంగా (27 శాతం) పెరిగిందని, ప్రభుత్వానికి రూ.8,900 కోట్ల ఆదాయం సమకూరిందని ఆప్ సర్కారు వెల్లడించింది.

ఇదిలా ఉంటే, ఢిల్లీ పోలీసు శాఖలోని ఆర్థిక నేరాల విభాగం ఎక్సైజ్ పాలసీపై సమస్యలు సృష్టించడం మొదలుపెట్టింది. ఢిల్లీ పోలీసుశాఖ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. ఆర్థికనేరాల విభాగం ఆరోపణలు, ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అందిన నివేదిక మేరకు కావచ్చు లెఫ్టినెంట్ గవర్నర్ రంగప్రవేశం చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియమించిన వ్యక్తే అన్నది ఇక్కడ గమనార్హం. ఎక్సైజ్ మంత్రి సిసోడియా నియమ నిబంధనలను మార్చారని, చట్టాన్ని ఉల్లంఘించారని, తద్వారా మద్యం వ్యాపారులకు అనుచిత లబ్ధి చేకూర్చారని లెఫ్టినెంట్ గవర్నర్ ఆరోపించారు. దీనిపై సీబీఐ దర్యాప్తు జరపాలని విన్నవించారు. తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ఒత్తిడి మేరకు, కొత్త మద్యం విధానాన్ని 2022 జూలైలో రద్దు చేశారు.

ఇప్పుడు ఈ మొత్తం మద్యం విధానంపై వినిపిస్తున్న ఆరోపణ ఏమంటే, ఎక్సైజ్ మంత్రిగా సిసోడియా, సౌత్ గ్రూప్‌గా పేరు పడ్డ మద్యం వ్యాపారులకు (లైసెన్సీలకు) లబ్ధి చేకూర్చారని, అందుకు ప్రతిగా క్విడ్ ప్రో కో (ఆర్థికంగా ఇచ్చి పుచ్చుకునే లావాదేవీల)కు పాల్పడ్డారని, తద్వారా మద్యం వ్యాపారుల నుంచి వంద కోట్లకు పైగా ముడుపులు తీసుకున్నారని! దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నామినీ అయిన లెఫ్టినెంట్ గవర్నర్ ఒత్తిడి మేరకు వెంటాడటం మొదలైంది. ఇందులో భాగంగా మొదట సీబీఐ, తర్వాత ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) రంగప్రవేశం చేశాయి.

> కనీస విచక్షణ, కొంచెం న్యాయ పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా ఇక్కడ ఒక మౌలికమైన ప్రశ్న స్ఫురణకు వస్తుంది. మద్యం విధానం అనేది రాష్ట్రం (రాష్ట్ర ప్రభుత్వం) తీసుకునే కార్యనిర్వాహక చర్య. దానివల్ల ఆర్థిక లాభనష్టాలు, పర్యవసానాలు ఏవైనా ఉంటే వాటిని చూసుకోవాల్సింది, పరిశీలించాల్సింది కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, అంటే కాగ్. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన విధానంలో లొసుగులు, ఆర్థిక అక్రమాలు ఏవైనా కనిపిస్తే, వాటిని కాగ్ ఎలాగూ ఎత్తి చూపుతుంది. ఎత్తిచూపాలి. ప్రభుత్వాన్ని తప్పుబట్టాలి. అది దాని బాధ్యత.

కానీ ఇక్కడ ఏం జరిగింది? కేవలం ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక ఫిర్యాదు ఇచ్చారనే కారణంతోనే చర్యలు ప్రారంభించారు. దీనివల్ల ఒక విషయం స్పష్టం అవుతున్నది. అప్పటికే ఆప్‌తో యుద్ధానికి దిగిన కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీలోని ఆ పార్టీ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి, దెబ్బతీయడానికి ఎటువంటి చిన్న అవకాశమైనా దొరకకపోతున్నదా అని ఎదురుచూస్తున్నది. పైకి చూస్తే ఇదే సోకాల్డ్ లిక్కర్ స్కాం. ఈ లిక్కర్ స్కాం కేవలం ఆరోపణల్లో మాత్రమే వినిపిస్తుంది. ఏ నాటికైనా ఇది న్యాయపరంగా ఒక కొలిక్కి వస్తుందా? దీనికి సహేతుకమైన ముగింపు లభిస్తుందా? అన్నది పూర్తిగా సందేహాస్పదం.

ఎందుకంటే ఈడీ, సీబీఐ, వీటితో పాటు ఆదాయ పన్ను విభాగం (ఐటీ) కేంద్ర ప్రభుత్వ పంజరంలోని చిలకలుగా మారిపోయాయి. కేంద్రం చెప్పినట్టు పాడుతున్నాయి. ఆడుతున్నాయి. అంతే కాదు; గత కొన్నేండ్లుగా అవి కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలకు పూర్తిగా జీ హుజూర్ అనేలా మారిపోయాయి.

సీబీఐ, ఈడీ, ఐటీ అనేవి కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయన్నది వాస్తవమే అయినా, నిజానికవి తమ పనితీరులో స్వతంత్రంగా వ్యవహరించాలి. నిర్ణయాల్లో స్వయం ప్రతిపత్తిని చూపించాలి. అంతే తప్ప కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ‘యెస్ బాస్’ అన్నట్టుగా ఉండకూడదు. కేంద్రంలో అధికారంలో ఉన్న నేతల బంట్లుగా, ఏజెంట్లుగా వ్యవహరించకూడదు. ఈ సంస్థలు చట్ట ప్రకారం వ్యవహరించాలే తప్ప, అధికారంలో ఉన్న వారి ఇష్టాయిష్టాల ప్రకారం ప్రవర్తించకూడదు.

స్వతంత్రంగా ఉండాల్సిన సంస్థలు దుర్వినియోగానికి గురవుతూ అధికారంలో ఉన్న వ్యక్తులకు ఏజెంట్లుగా మారుతున్నాయి. ఎన్నికల సంఘం (ఈసీ) విషయంలో ఇటీవల జరిగిన పరిణామమే దీనికొక తాజా ఉదాహరణ. కేంద్రప్రభుత్వానికి ఏజెంట్‌గా ఈసీ కమిషనర్లు ఉండటానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), పార్లమెంట్‌లో ప్రతిపక్షనేతలతో కూడిన కమిటీ ఎన్నికల సంఘం కమిషనర్లను ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తలవంచని వారిని వేధించటానికి, బలి పశువులను చేయటానికి, నాశనం చేయటానికి ఈడీని ఎంత యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారనేది ఒక పెద్ద చరిత్ర. మనీల్యాండరింగ్ పేరిట ఎంపీలపై 51 కేసులు పెట్టారు. ఎమ్మెల్యేలపై 71 కేసులు పెట్టారు. ఇవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. రాజకీయ శత్రుత్వంలో భాగంగానే ఈ కేంద్ర దర్యాప్తు సంస్థలను వేధింపుల కోసం ఉపయోగిస్తున్నారని దీని ద్వారానే స్పష్టమవుతున్నది. కోర్టుల్లో ఈడీ కేసులు సాధారణంగా నిలబడవు. మెజారిటీ కేసులు కాలంతో పాటు నిర్వీర్యమైపోతుంటాయి.

రాజకీయ ప్రత్యర్థులను వేధించటమనే తన పాత వ్యూహాన్నే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అమలుచేస్తున్నది. మన్మోహన్‌సింగ్ హయాంలో అధికారంలో ఉన్న యూపీయే ప్రభుత్వాన్ని ఇదే బీజేపీ 2జీ స్కాం పేరుతో తీవ్రంగా ఇరుకునపెట్టిన విషయం ఇంకా ప్రజలు మర్చిపోలేదు. ఆ అంశాన్ని గోరంతను కొండంతలు చేసి మన్మోహన్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసి రాజకీయ తుపానును సృష్టించింది నాటి భారతీయ జనతా పార్టీ. మన్మోహన్‌ది అవినీతి ప్రభుత్వమంటూ ప్రచారం చేసి చివరికి 2014 ఎన్నికల్లో ఆయనను గద్దె దించగలిగింది.

> “ సీబీఐ, ఈడీ, ఐటీ అనేవి కేంద్రప్రభుత్వ నియంత్రణలో ఉంటాయన్నది వాస్తవమే అయినా, నిజానికవి తమ పనితీరులో స్వతంత్రంగా వ్యవహరించాలి. నిర్ణయాల్లో స్వయం ప్రతిపత్తిని చూపించాలి. అంతే తప్ప కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ‘యెస్ బాస్’ అన్నట్టుగా ఉండకూడదు. కేంద్రంలో అధికారంలో ఉన్న నేతల బంట్లుగా, ఏజెంట్లుగా వ్యవహరించకూడదు. ”

బీజేపీ గెలిచిన తర్వాత ఆ 2జీ స్కాం విషయమే ప్రస్తావనకు రావటం లేదు. ఇదే వ్యూహాన్ని ఇప్పుడు బీజేపీ అనుసరిస్తున్నది. ఆప్, బీఆర్ఎస్ పార్టీలను మరే విధంగానూ ఢీ కొనలేక, లిక్కర్ స్కాం పేరుతో దాడికి దిగింది. ఈ రెండు పార్టీలు తమతమ రాష్ట్రాల్లో ఎంతో బలంగా ఉన్నాయి. దీంతో బీజేపీ తన వెనుకటి వ్యూహాన్ని తీసుకొచ్చింది. ఒక కథను సృష్టించటం, దానిని సంచలనాత్మకం చేయటం, విపరీతంగా ప్రచారం జరిపి దాన్నో భారీ కుంభకోణంగా చిత్రించటం.

> అత్యంత విషాదం ఏమంటే.. రాజకీయ ప్రత్యర్థులను వేధించటానికి, బెదిరించటానికి, భయకంపితులను చేయటానికి ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను కేంద్రంలో అధికారంలో ఉన్న వ్యక్తులు ఓ వైపు తీవ్రంగా వాడుకుంటున్నారు. మరోవైపు సదరు ప్రత్యర్థులు వీరికి లొంగిపోయి, బీజేపీలో చేరితే తక్షణం వారిపై ఉన్న కేసులు, చర్యలు అన్నీ మాయమవుతున్నాయి. వారికి పూర్తిరక్షణ కల్పిస్తారు. వారొక్కటే సారి పాపుల నుంచి పునీతులుగా మారుతారు. దీనికి ఎన్నో ఉదాహరణలు.. ఏపీలో సుజనా చౌదరి, సీఎం రమేశ్. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ నేతల విషయంలో, అసోంలో కాంగ్రెస్ నాయకుల విషయంలో ఇదే జరిగింది.

తెలంగాణలో బీజేపీకి ప్రజా బలం లేదు. కాంగ్రెస్ కూడా బలహీనంగా ఉంది. కాబట్టి, బీఆర్ఎస్‌ను ఓడించటం సాధ్యం కాని పని. తెలంగాణ ఉద్యమం నుంచీ నేటి వరకూ ప్రజలను తన మాటలతో మంత్రముగ్ధులను చేసే కేసీఆర్ వంటి ప్రజా నాయకుడు, గొప్ప వక్త వారి వద్ద ఎవరూ లేరు. కాబట్టి కేసీఆర్‌ను గద్దె దించటానికి, ప్రభుత్వాన్ని కూల్చటానికి బీజేపీ ముందున్న ఒకే ఒక దారి.. కేసీఆర్‌పై అబద్ధాలు ప్రచారం చేసి ఆయనను అపఖ్యాతి పాలు చేయటం, ఆయన పట్ల ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టడం. అచ్చంగా నాటి మన్మోహన్ ప్రభుత్వంపై 2014లో అమలు చేసిన వ్యూహమే ఇది.

చివరగా, నేను కోరుకుంటున్నదేమంటే.. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల అధిపతుల నియామకాలపైనా సుప్రీంకోర్టు దృష్టిసారించాలి. ప్రధాని, ప్రతిపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ వీరిని నియమించాలి. తద్వారా ఈ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతాయి. దీనివల్ల ఈ సంస్థలు ఎవరికీ తలవంచకుండా, ఎవరి పట్లా పక్షపాతం చూపకుండా చట్టానికి అనుగుణంగా పని చేయటం సాధ్యపడుతుంది.

> రాజకీయ ప్రత్యర్థులను వేధించటమనే తన పాత వ్యూహాన్నే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అమలుచేస్తున్నది. మన్మోహన్‌సింగ్ హయాంలో అధికారంలో ఉన్న యూపీయే ప్రభుత్వాన్ని ఇదే బీజేపీ 2జీ స్కాం పేరుతో తీవ్రంగా ఇరుకునపెట్టిన విషయం ఇంకా ప్రజలు మర్చిపోలేదు. ఆ అంశాన్ని గోరంతను కొండంతలు చేసి మన్మోహన్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసి రాజకీయ తుఫానును సృష్టించింది నాటి భారతీయ జనతా పార్టీ.

(వ్యాసకర్త: సీనియర్ అడ్వకేట్, తెలంగాణ హైకోర్టు)

---



# ఎదుర్కోనలేకే బీజేపీ కుట్ర

దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు శాసన నిర్మాణంలో అతి తక్కువ స్థానం ఇవ్వడం సమంజసం కాదు. తక్కువ సంఖ్యలో ఉన్నవారు అధికారాన్ని చెలాయిస్తూ అధిక సంఖ్యాకులైన మహిళలు, వెనుకబడినవర్గాల వారు రాజ్యాధికారానికి దూరంగా ఉండటం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రధాని మోదీ పదేపదే చెప్తున్న ‘బేటీ పడావో.. బేటీ బచావో’ అనే నినాదం బీజేపీ ఊకదంపుడు ఉపన్యాసాలకు మాత్రమే పరిమితమైంది.



కాసర్ల నాగేందర్‌రెడ్డి
+61 478 311 563

భారత పార్లమెంట్‌లో తొలి సారి 1996 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. 27 ఏండ్లు గడిచినా ఈ బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. 2008లో రాజ్యసభలో చివరిసారి మరో బిల్లును ప్రవేశపెట్టారు. ఇది 2010లో ఎగువసభ ఆమోదం పొందింది. కానీ, దీన్ని లోక్‌సభ సుమారు నాలుగేళ్లు పక్కన పెట్టింది. 15వ లోక్‌సభ ముగింపుతో ఈ బిల్లు సైతం వీగిపోయింది. రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం 15 శాతం కంటే తక్కువగా ఉన్నది. ప్రస్తుతం దేశంలోని పశ్చిమబెంగాల్‌కు మాత్రమే ఒక మహిళ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందడంలో విఫలమవుతున్నాయి. ప్రస్తుత లోక్‌సభలో మహిళా ఎంపీల ప్రాతినిధ్యం గతంలో కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయ పరంపరలో మహిళలు ఇప్పటికీ అట్టడుగున కొనసాగుతున్నారు.

1998, 1999లో కూడా రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు లోక్‌సభలో మూడింట ఒక వంతు సీట్ల మేర రిజర్వేషన్‌ను కల్పించడానికి ఉద్దేశించిన బిల్లులను ప్రవేశపెట్టారు. అయితే వీటి విషయంలో రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఎప్పుడూ కుదరలేదు. 2008లో అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టినప్పుడు కొంతమంది సభ్యులు మంత్రి చేతిలో నుంచి బిల్లు ప్రతులను లాక్కోవడానికి ప్రయత్నించి వికృతంగా ప్రవర్తించారు. అంటే ఈ బిల్లుపై ఎంపీలకు ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ, కాంగ్రెస్ ఈ అంశాన్ని చేర్చాయి. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం సీట్ల రిజర్వేషన్ కల్పిస్తామని ఈ పార్టీలు పేర్కొన్నాయి. అయితే పార్లమెంట్‌లో ఈ బిల్లును ప్రవేశపెట్టడం కోసం కేంద్రం తీసుకున్న చర్యలపై 2019 డిసెంబర్‌లో అప్పటి న్యాయ శాఖామంత్రి, బీజేపీకి చెందిన రవిశంకర్ ప్రసాద్ రాజ్యాంగ సవరణ కోసం ఒక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందు అన్ని రాజకీయపార్టీల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావాల్సిన అవసరం ఉన్నదన్నారు.


ఛాందసవాద సిద్ధాంతాలను అనుసరించే దేశాల్లో కూడా చట్టసభల్లో మహిళల శాతం మన దేశంలో కన్నా మెరుగ్గా ఉన్నది. బంగ్లాదేశ్, నేపాల్ లాంటి చిన్న దేశాలు స్త్రీ, పురుష సమానత్వంలో మనకంటే ముందున్నాయి. 2002లో పాక్ సైతం జాతీయ అసెంబ్లీలో 17 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేసింది. భారత్‌లో మహిళా ఎంపీల వాటా లోక్‌సభలో 14.4 శాతం, రాజ్యసభలో 11.2 శాతంగా ఉన్నది. ఫ్రాన్స్, దక్షిణకొరియా, నేపాల్ వంటి దేశాలు.. అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు 50 శాతం టికెట్లను రిజర్వ్ చేయాలని చట్టాలు చేశాయి. అయితే దక్షిణాఫ్రికాలోని రాజకీయపార్టీలు స్వచ్ఛందంగా మహిళలకు ఎక్కువ సీట్లు కేటాయిస్తున్నాయి. రాజకీయ పార్టీలు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. ఆఫ్రికా ప్రాంతాల్లో జాతీయ పార్లమెంట్‌లో ప్రపంచ సగటు 26.2 శాతం కన్నా ఎక్కువే మహిళలు ఎంపీలుగా ఉన్నారు. నేపాల్‌లో 34, బంగ్లాదేశ్ 21, పాకిస్థాన్ 20, భూటాన్ 17 శాతంతో మన దేశం కన్నా మెరుగ్గా ఉన్నాయి. ఆసియా దేశాల్లో 19.2 శాతం, అరబ్ దేశాల్లో 18.4 శాతం, పసిఫిక్ దేశాల్లో 13.5 శాతంగా ఉన్నది. మన దేశంలో 10 నుంచి 15 శాతం లోపు మహిళా ఎంపీలున్నారు. ప్రపంచం మొత్తమ్మీద రెండు దేశాల్లో మాత్రమే పార్లమెంట్లో 50 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు. 2016 జూన్ గణాంకాల ప్రకారం రువాండా దేశంలో 63.8 శాతం, బొలీవియాలో 53.1 శాతం ఉండగా, 30 శాతం కంటే ఎక్కువ మహిళా ప్రాతినిధ్యం గల దేశాల సంఖ్య పెరిగింది.

2008లో లోక్‌సభలో మహిళా రిజర్వే షన్ల కోసం ప్రవేశపెట్టిన సవరణ బిల్లును వ్యతిరేకించిన వారు దీనినే ప్రధాన అంశంగా తీసుకొచ్చారు. రిజర్వేషన్‌తో మహిళల పరిస్థితి మారదని పేర్కొన్నారు. అయితే, ఈ వాదనను వ్యతిరేకించిన వారు రిజర్వేషన్‌లో రొటేషన్ విధానాన్ని అనుసరిస్తే.. ఇప్పటికే ఎంపికైన పురుష ఎంపీలు తర్వాత ఎన్నికల్లో పోటీ చేయలేరు కాబట్టి నియోజకవర్గాలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టే అవకాశాలు తగ్గుతాయని, తద్వారా మహిళలు స్వశక్తితో ఎదుగుతారని పేర్కొన్నారు.

అయితే ‘తెలంగాణ జాగృతి సంస్థ’ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను ఖండాంతరాలకు వ్యాప్తిచెందేలా కృషిచేశారు. బతుకమ్మ పండగను అధికారికంగా నిర్వహించేస్థాయికి తీసుకొచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిష్టించే దాకా అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారు. రేపు మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేశవ్యాప్తంగా మహిళలను ఐక్యం చేసి ఢిల్లీ వేదికగా జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కవిత దీక్షకు భయపడిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమ జేబు సంస్థ అయిన ఈడీని ఉసిగొల్పి ‘జంతర్ మంతర్’ దీక్షకు ముందుగానే ఢిల్లీకి రావాలని పిలిపించింది. దీనిద్వారా కవిత దీక్షను భగ్నం చేయాలనే బీజేపీ కుట్ర బహిర్గతమవుతున్నది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు)

---




---

**బొడ్రాయి**

## మరిన్ని వ్యాసాలు epaper.ntnews.com



- **ఉద్యమ కాంక్షలు సాకారం** - సయ్యద్ నజీం అహ్మద్

బక్కపల్చని మనిషి ఉక్కు సంకల్పంతో రేపు భారత జాతిని ప్రపంచంలో మేటిగా నిలబెట్టగలరని మనం ఇప్పుడు గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పొచ్చు. కేసీఆర్ దీక్షాదక్షతలు మనకు తెలుసు కాబట్టి.



- **అవి ‘ఆపద’ యాత్రలు** - గుంటిపల్లి వెంకట్

రాష్ట్రంలో విపక్షాలు చేస్తున్న పాదయాత్రలపై తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేధావులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండి వీరి కుట్రలను భగ్నం చేయకపోతే, మళ్లీ తెలంగాణ ఉత్తరాది పార్టీల కబంధ హస్తాల్లో బందీగా మారేప్రమాదం ఉందంటున్నారు.



- **కేంద్ర విధానం కార్పొరేట్లకు లాభం** - అళవందార్ వేణుమాదవ్

ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద బొగ్గు నిల్వలు భారత్‌లో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి ఏటా బొగ్గు కొరత ఎందుకు ఏర్పడాలి? కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి. కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేయడం, బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఈ రెండు కంపెనీలకు గొప్ప అనుభవం ఉన్నది.

# చైనాతో ముప్పు!

- దేశంలో ఆర్థిక స్థిరత్వం, అంతర్గత భద్రత బాగోలేదు
- లడక్‌ చైనా ఆధీనంలోకి పోకుండా కాపాడుకోవాలి
- జీ20.. ప్రచారానికే తప్ప విజయవంతమైన వేదిక కాదు
- అగ్నివీర్‌ పథకం దేశానికి ఏ రకంగానూ ఉపయోగపడదు
- గ్రామాలు బాగుపడకుండా దేశం అభివృద్ధి చెందదు
- ప్రధాని మోదీకి క్రోనీ క్యాపిటలిస్టుల మద్దతు ఉన్నది
- సంస్కృతి, మతతత్వం, అణచివేత బీజేపీ ఆయుధాలు
- యువత శక్తిసామర్థ్యాలను మతతత్వం వాడుకుంటున్నది
- బిగ్‌ ఎకానమీ, సూపర్‌ పవర్‌.. మోసపూరిత నినాదాలు
- ఈ వైఫల్యాలను హిందువులే ప్రశ్నించాలి, ఎదిరించాలి
- ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రొఫెసర్‌ మనోరంజన్‌ మహంతి



ప్రొఫెసర్‌ మనోరంజన్‌ మహంతి

హైదరాబాద్‌, మార్చి 8(నమస్తే తెలంగాణ): 'చైనా సైన్యంతో తలపడలేం' అని విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్‌ చేతులెత్తేశారు. దూకుడు తగ్గేదేలే అన్నట్టుంది చైనా. దేశ భద్రతకు, భవిష్యత్తుకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరిస్తున్నారు ప్రొఫెసర్‌ మనోరంజన్‌ మహంతి. రాజనీతి శాస్త్రవేత్త అయిన మహంతి ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని డెవలపింగ్‌ కంట్రీస్‌ రిసెర్చ్‌ సెంటర్‌ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. భారత్‌-చైనా సంబంధాలు, చైనా అంతర్జాతీయ రాజకీయాల గురించి అనేక పుస్తకాలు రాశారు. దేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక తాజా పరిస్థితులను విశ్లేషించేందుకు హైదరాబాద్‌ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన నమస్తే తెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**• జై శంకర్‌ బేల మాటలకు కారణం చైనా బలమా? భారత్‌ బలహీనతా?**

జై శంకర్‌ తెలివైన వారు. 'చైనా, భారత్‌ కంటే బలమైన ఆర్థిక వ్యవస్థ. కాబట్టి మన సైన్యం చైనాతో యుద్ధం చేయలేదు' అని అతని పరిస్థితి తనని అలా మాట్లాడిస్తున్నది. ఒక పొరుగు దేశంతో తలపడాలంటే ఆర్థిక స్థిరత్వం, అంతర్గత భద్రత, సుస్థిరత ఉండాలి. ఇప్పుడు జై శంకర్‌ ఇలా మాట్లాడటానికి కారణం.. దేశంలో అంతర్గత భద్రత, సుస్థిరత, ఆర్థిక స్థిరత్వం బాగా లేకపోవడమే. అందుకే చైనా దూకుడుగా ఉన్నది.

**• భారత్‌-చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు ఎటు దారి తీస్తాయి?**

మోదీ హయాంలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్నది. భారత సైన్యం వెనక్కు తగ్గుతున్నది. అందువల్ల చైనా, భారత భూభాగాలను ఆక్రమిస్తున్నది. సరిహద్దు ఉద్రిక్తతలు భారత దేశాన్ని మిలటరీ స్టేట్‌, కమ్యూనల్‌ నేషనలిజం వైపునకు నడిపించే ప్రమాదం ఉన్నది.

**అంతర్జాతీయంగా సంబంధాల్లో భారత్‌ ఎందుకు వెనుకబడింది?**

ఒక విజయవంతమైన విదేశీ విధానం ఉండాలంటే అందుకు తగ్గట్టుగా దేశీయ పాలనా విధానాలు ఉండాలి. వాటికి ప్రజామోదం కూడా ఉండాలి. సైనిక వ్యూహాలు, విదేశీ విధానాలను దేశ పరిస్థితులు, పాలనా విధానాలతో సమన్వయం చేసుకోవాలి. బీజేపీ ప్రభుత్వం ఈ విషయంలో విఫలమైంది.

**• జీ 20 దేశాలకు అధ్యక్ష దేశంగా చైనాపై అంతర్జాతీయ ఒత్తిడి తేలేమా?**

జీ 20లో దేశాల మధ్య సరిహద్దు వివాదాలు, ప్రపంచాన్ని పీడిస్తున్న సామాజిక ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, పేదరిక నిర్మూలనకు ఒప్పందాలేవీ జరగలేదు. అది ఒక మంచి ప్రచారానికి వాడుకుంటున్నారే తప్ప ఒక విజయవంతమైన విదేశీ విధాన రూపకల్పనకు, ఫలవంతమైన చర్చలకు వేదికగా మలచలేకపోయారు.

**• అగ్నివీర్‌ పథకం భారత సైన్యం మీద ఎటువంటి ప్రభావం చూపిస్తున్నది?**

దిక్కుతోచని స్థితిలో, ఉద్యోగాలు కల్పించలేదనే విమర్శల ఒత్తిడిలో మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ పథకం దేశానికి ఉపయోగపడదు. ఇది శిక్షణా కాదు. అలాగని ఉద్యోగమూ కాదు. యువత, పార్టీలు అగ్నివీర్‌ పద్ధతిని విమర్శించడం సరైనదే.

**• మేకిన్‌ ఇండియా చైనాకి చెక్‌ పెడుతుందా?**

భారత ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. గ్రామీణ పరిశ్రమలు బాగా వెనుకబడ్డాయి. చాలా మూతపడ్డాయి. వాటిని అభివృద్ధి పథంలో నడపాలి. గ్రామాలు బాగుపడకుండా దేశం అభివృద్ధి చెందలేదు.

**• ఎన్నికల్లో బీజేపీ ఎందుకు సక్సెస్‌ అవుతోంది? విజయాలకు కారణాలు?**

సోషల్‌ క్యాపిటల్‌, కల్చరల్‌ క్యాపిటల్‌, ఫైనాన్స్‌ క్యాపిటల్‌ బీజేపీ బలం. సంస్కృతి, మతతత్వం, టెక్నాలజీ, డబ్బు, అణచివేత బీజేపీ ఆయుధాలు. సాంస్కృతికమైన ఉద్వేగాలు, సామాజిక ఉద్రిక్తతలను పెంచటం, ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా ఆర్థిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చుతున్నది. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, సూపర్‌ పవర్‌ వంటి నినాదాలతో మధ్య తరగతిని మాయ చేస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ మాయోపాయాలే బీజేపీ బలం.

> *దేశంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏ రూపంలో ఉండాలి?*
>
> ప్రతిపక్షాల ఐక్యకూటమి ఎన్నికల్లో బీజేపీని ఓడించవచ్చు. కానీ ఎన్నికల్లో ఓడించడం ద్వారానే బీజేపీని ఎదుర్కోలేరు. నయా ఉదారవాదం అన్ని పార్టీల్లో ఉన్నది. క్షేత్రస్థాయిలో బీజేపీ వ్యతిరేక ఉద్యమ నిర్మాణం జరగాలి. ఈ నిర్మాణం గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి దాకా జరగాలి. ఈ మార్పు వస్తేనే బీజేపీని అడ్డుకోగలం. యువత శక్తి సామర్థ్యాలను మతతత్వం వాడుకోవాలని చూస్తున్నది. దీనికి అడ్డుకట్టపడాలి.

**• బీజేపీని ఓడించే అంశాలేమిటి?**

బిగ్‌ ఎకానమీ, సూపర్‌ పవర్‌ లాంటి మోసపూరితమైన నినాదాలకు మధ్యతరగతిని వాడుకోకుండా చూసుకోవాలి. వనరుల వినియోగం, దేశ సంపద పంపిణీ గురించి ప్రజలే నిర్దేశించేలా చర్చలు నిర్వహించాలి. అధిక ధరలు, పేదరికం, నిరుద్యోగం, దళితులపై దాడులు, ఆదివాసీ హక్కుల ఉల్లంఘనలు, కుల సమస్య, లింగవివక్ష వంటి సమస్యలన్నింటినీ కిందిస్థాయిలో చర్చకు తీసుకురావాలి. దేశం కోసం - ధర్మం కోసం, హిందూ రాష్ట్ర పేరిట జరిగే రాజకీయాల వల్ల నష్టపోతున్న వాళ్లలో హిందువులే ఎక్కువ. కాబట్టి హిందువులే స్పందించి బీజేపీని ప్రశ్నించాలి.

**మోదీ, షాల విజయాలు బీజేపీ బలమా? ప్రతిపక్షాల బలహీనతా?**

బీజేపీ బలం వల్ల, ప్రతిపక్షాల బలహీనత వల్ల మోదీ ప్రభుత్వానికి విజయాలు చేకూరడం అవాస్తవం. గ్లోబల్‌ ఫైనాన్స్‌ క్యాపిటల్‌, నేషనల్‌ ఫైనాన్స్‌ క్యాపిటల్‌ ఒక్కటయ్యాయి. క్రోనీ క్యాపిటలిజం (ప్రభుత్వాల సహకారంతో లాభాలు పొందే పెట్టుబడిదారీ వ్యవస్థ) అనుసరిస్తుండటం వల్లే అంతర్జాతీయ పెట్టుబడిదారులు మోదీ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నారు. అమెరికా, ఇతర అంతర్జాతీయ శక్తుల మద్దతు కూడా మోదీకి ఉన్నది. కాబట్టే వాళ్లు గెలవగలుగుతున్నారు. క్రోనీ క్యాపిటలిస్టులు కొంతమందిని డబ్బుతో లోబరుచుకుంటారు. ప్రశ్నించినవాళ్లను భయపెడతారు, జైళ్లలో పెడతారు, అణచివేస్తారు. అసరమైతే చంపడానికీ వెనుకాడరు. ఇప్పుడు కేంద్ర నిఘా, విచారణ సంస్థల దాడులన్నీ ఇందులో భాగమే.

---



గత శుక్రవారం ఎమ్మెల్యే కుమారుడి ఇంట్లో పట్టుబడిన రూ. 8 కోట్ల నగదు (ఫైల్‌)

## 8 కోట్లతో పట్టుబడ్డ బీజేపీ ఎమ్మెల్యేకు బెయిల్‌

- పోలీసులు వెతుకుతుండగానే ముందస్తు బెయిల్‌
- కర్ణాటక న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం
- నిరసన వ్యక్తంచేస్తూ సీజేఐ చంద్రచూడ్‌కు లేఖ



విరూపాక్షప్ప

బెంగళూరు, నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి: అధికారం ఉంటే ఏదైనా సాధ్యమేనని లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మదల్‌ విరూపాక్షప్ప ఉదంతం చూస్తే అనిపిస్తుంది. ఈ కేసులో అధికారులను రాత్రికి రాత్రే హఠాత్తుగా మార్చేసింది బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం. గత వారం రూ.40 లక్షల లంచం తీసుకుంటున్న విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్‌ మదల్‌ను లోకాయుక్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నది. ప్రధాన నిందితుడిగా ఎమ్మెల్యేపై కేసు నమోదు కావడంతో ఆయన పరారయ్యాడు. పోలీసులు వెతుకుతుండగానే హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేసింది. ఆయన ఏదో ఘనకార్యం చేసినట్టు మంగళవారం దావణగెరె జిల్లాలోని చన్నగిరి నియోజకవర్గంలో భారీ ఊరేగింపు జరిపారు. ఇప్పుడేమో నిందితులను ప్రశ్నించడానికి కొద్ది గంటల ముందు ఏకంగా ఈ కేసు దర్యాప్తు అధికారులనే మార్చేశారు. దర్యాప్తు అధికారులుగా డిప్యూటీ ఎస్పీ ప్రమోద్‌ కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ కుమారస్వామి స్థానంలో ఆంథోని జాన్‌, బాలాజీ బాబును నియమించారు.

**పెద్దమొత్తంలో అక్రమార్జన సొత్తు**

ప్రభుత్వ రంగ సంస్థ కర్ణాటక సోప్స్‌ అండ్‌ డిటర్జెంట్‌ లిమిటెడ్‌కు మదల్‌ విరూపాక్షప్ప చైర్మన్‌గా కూడా ఉన్నారు. ఓ కాంట్రాక్టుకు సంబంధించి రూ.40 లక్షల లంచాన్ని ఎమ్మెల్యే తరపున ఆయన కుమారుడు తీసుకుంటుండగా, లోకాయుక్త గత గురువారం పట్టుకొన్నది. తర్వాత ఎమ్మెల్యే, ఆయన కుమారుడి ఇండ్లలో జరిపిన సోదాల్లో రూ.8.23 కోట్ల నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు భూములు, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్యే అప్పటి నుంచి పరారై మంగళవారం బెయిల్‌ తెచ్చుకున్నారు.

**న్యాయవాదుల ఆగ్రహం.. సీజేఐకు లేఖ**

విరూపాక్షప్పకు హైకోర్టు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయడం పట్ల బెంగళూరు న్యాయవాదుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు వారు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. విరూపాక్షప్ప దర్యాప్తు సంస్థల ముందు 48 గంటలలోపు హాజరవుతానని లేఖ ఇచ్చిన మరునాడే కర్ణాటక హైకోర్టు బెయిల్‌ మంజూరు చేసిందని వివరించారు. ఇది కచ్చితంగా 'వీఐపీ ట్రీట్‌మెంటే'నని ఆరోపించారు. సాధారణంగా ఇలాంటి ముందస్తు బెయిల్‌ కేసులు లిస్టు కావడానికి రోజులు, వారాల సమయం పడుతుందని, అయితే ఈ కేసులో 'వీఐపీ' ఒత్తిడి ప్రభావమో, ఏమో ఒక్క రోజుకే బెయిల్‌ వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి చర్యల వల్ల న్యాయవ్యవస్థపై సామాన్యులు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉన్నదన్నారు.

---

## ఏఐ టూల్‌తో 18 లక్షలు కొట్టేశారు!

న్యూఢిల్లీ: ఏఐ టూల్‌ వాడి సైబర్‌ నేరగాళ్లు కెనడాకు చెందిన ఓ వృద్ధ జంట నుంచి రూ.18 లక్షలు కొట్టేశారు. ఇటీవల వృద్ధ జంటకు ఫోన్‌ చేసిన ఓ వ్యక్తి.. ఏఐ టూల్‌ సాయంతో అచ్చం వారి మనవడిలా మాట్లాడాడు. ప్రస్తుతం జైలులో ఉన్నానని, బెయిల్‌ కోసం వెంటనే డబ్బు కావాలని నమ్మబలికాడు. దీంతో కంగారుపడిన ఆ జంట సమీపంలోని తమ బ్యాంకుకు వెళ్లి 3 వేల కెనడియన్‌ డాలర్ల నగదును విత్‌డ్రా చేశారు. ఆ సొమ్మును బిట్‌కాయిన్‌ ద్వారా అవతలి వ్యక్తికి పంపారు. అనంతరం మరింత సొమ్ము కోసం మరో బ్యాంకుకు వెళ్లిన ఆ జంటను బ్యాంకు మేనేజర్‌ విషయం అడగటంతో మోసం బట్టబయలైంది. తమ బ్యాంకులోని మరో కస్టమర్‌కు కూడా ఇలాంటి ఫోన్‌ కాల్‌ వచ్చిందని, అది నకిలీదిగా తేలిందని చెప్పటంతో తాము మోసపోయామని ఆ వృద్ధ జంట గ్రహించింది.

## చాట్‌జీపీటీకి పోటీగా వెయ్యి భాషలతో ఏఐ: గూగుల్‌

వాషింగ్టన్‌: కృత్రిమ మేధ రంగంలోనూ ఆధిపత్యం చూపాలని టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌ ప్రణాళికలు వేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న చాట్‌జీపీటీకి పోటీగా వెయ్యి భాషలను సపోర్టు చేసేలా ఓ ఏఐ మాడల్‌ను అభివృద్ధి చేసే పనిలో పడింది. గూగుల్‌ గత ఏడాది నవంబర్‌లో యూనివర్సల్‌ స్పీచ్‌ మాడల్‌ (యూఎస్‌ఎం)ను పరిచయం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే 1,000 భాషలను సపోర్టు చేసేలా ఓ లాంగ్వేజ్‌ మాడల్‌ను సృష్టిస్తామని ప్రకటించింది. తన లక్ష్యాలను చేరుకోవడంలో యూఎస్‌ఎం కీలక అడుగుగా గూగుల్‌ భావిస్తున్నది.

## ఎర్రని కాంతితో అంగస్తంభన సమస్యకు చెక్‌!

న్యూఢిల్లీ: కేవలం 60 సెకండ్ల పాటు ఒక ప్రత్యేకమైన రెడ్‌ లైట్‌ను పురుషాంగంపై ప్రసరింపజేస్తే.. అంగస్తంభన సమస్య నుంచి పరిష్కారం లభిస్తుందని తాజా అధ్యయనం పేర్కొన్నది. నార్డ్‌-1 కాంపౌండ్‌ను అంగం చర్మంలో ప్రవేశపెట్టిన తర్వాత ఒక ప్రత్యేక టార్చ్‌లైట్‌ ద్వారా కాంతిని ప్రసరింపజేస్తారు. ఆ కాంతికి నార్డ్‌-1 స్పందించి నైట్రిక్‌ ఆక్సైడ్‌ను విడుదల చేస్తుంది. ఇది అంగానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సాయం చేస్తుందని, తర్వాత పురుషాంగానికి రక్త ప్రసరణ మెరుగై అంగ స్తంభన సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ తరహా చికిత్స జంతువుల్లో సమర్థవంతంగా పనిచేసిందన్నారు.

## వలసదారుల అడ్డుకట్టకు సునాక్‌ కొత్త బిల్లు

లండన్‌: బ్రిటన్‌కు అక్రమంగా వలస వస్తున్న వారికి అడ్డుకట్ట వేసేందుకు ఆ దేశ ప్రధాని రిషి సునాక్‌ కొత్త బిల్లు తెచ్చారు. వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో వారిని శరణార్థులుగా పరిగణించమని ఆయన తెలిపారు. ఇల్లీగల్‌ మైగ్రెంట్‌ బిల్లుతో ఇక నుంచి శరణార్థుల అక్రమ వలసలకు అడ్డుకట్ట పడుతుందని వెల్లడించారు. 'మీరు కనుక మా దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తే ఇక నుంచి మిమ్మల్ని శరణార్థులుగా పరిగణించం, మీకు గతంలోలాగా బానిసత్వ రక్షణ ప్రయోజనాలు లభించవు. అలాగే మీరు నకిలీ మానవ హక్కుల దావాలు వేసుకోలేరు. అసలు మీరు ఇక్కడ ఉండలేరు' అని పేర్కొన్నారు. ఈ కొత్త బిల్లును హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి.

## ప్రతి నలుగురిలో ఒకరు మహిళా ప్రజాప్రతినిధి

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురు శాసనకర్తల్లో ఒకరు మహిళేనని ఇంటర్‌ పార్లమెంటరీ యూనియన్‌ అధ్యయనం పేర్కొన్నది. చరిత్రలో తొలిసారిగా ప్రతి దేశ పార్లమెంట్‌లో కనీసం ఒక్క మహిళ అయినా సభ్యురాలిగా ఉన్నారని తెలిపింది. 2011లో ప్రతి ఐదుగురు చట్టసభల సభ్యుల్లో ఒకరు మహిళ ఉండేవారని, అయితే ఈ దశాబ్ద కాలంలో అది మెరుగైందని తెలిపింది. ప్రస్తుత పురోగతి రేటుతో లింగ సమానత్వం స్థాయికి చేరుకోవడానికి 80 ఏండ్లు పడుతుందని మహిళల ప్రాతినిధ్యంపై ఐపీయూ తన వార్షిక నివేదికలో అంచనా వేసింది. కేవలం ఆరు దేశాల్లోని చట్టసభల్లో సగం మంది మహిళలు ఉన్నారని తెలిపింది. ఇటీవల చాలా దేశాల్లో ప్రవేశపెట్టిన జెండర్‌ కోటా పరిస్థితులు మెరుగుదలలో కీలక పాత్ర పోషించాయంది.

---

## పావురాలకు గింజలేస్తే 500 ఫైన్‌

ముంబై: మహారాష్ట్రలోని ఠాణెలో పావురాలకు ఎవరైనా గింజలు వేస్తూ కనిపిస్తే రూ.500 జరిమానా విధిస్తామని థానె మున్సిపల్‌ కార్పొరేషన్‌ హెచ్చరించింది. ఈ మేరకు నగరవ్యాప్తంగా పోస్టర్లు వేసింది. ఇటీవల నగరంలో న్యుమోనియా కేసులు పెరిగిన నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించింది. పావురాల విసర్జితాలు ప్రమాదకరమని, ఎండిన రెట్టల నుంచి ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉన్నదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్ఫెక్షన్‌ కారక క్రిములు గాలిలో కలిసిపోయి, మనుషుల్లో శ్వాస సంబంధ సమస్యలు తలెత్తుతాయని పేర్కొంటున్నారు.

## విషప్రయోగ నేరగాళ్లకు కఠినశిక్ష: ఇరాన్‌

టెహ్రాన్‌: విద్యార్థినులపై అనుమానిత విషప్రయోగం ఘటనపై ఇరాన్‌ అధినేత అయతుల్లా ఖమేనీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది క్షమించరాని నేరమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థినులు విష ప్రయోగానికి గురై దవాఖానల పాలయ్యారని తెలిపారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని, నేరగాళ్లకు మరణశిక్ష తప్పదని వెల్లడించారు.

## మాజీ ఉద్యోగికి ట్విట్టర్‌ చీఫ్‌ క్షమాపణలు

శాన్‌ఫ్రాన్సిస్కో: తన కంపెనీ మాజీ ఉద్యోగి గురించి వాస్తవాలు తెలుసుకోకుండా ట్వీట్‌ చేసినందుకు ట్విట్టర్‌ అధినేత ఎలాన్‌ మస్క్‌ క్షమాపణలు చెప్పారు. గత ఆదివారం థోర్లీఫ్‌సన్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఆయన 'హల్లీ' పేరుతో ట్విటర్‌ ఖాతా కలిగి ఉన్నారు. కండరాల లోపంతో బాధపడుతూ చక్రాల కుర్చీ వాడుతున్నారు. తన తొలగింపు వెనక్కి తీసుకోవాలని ఆయన మస్క్‌కు ట్వీట్‌ చేశారు. దీనిపై చాటింగ్‌ చేసిన మస్క్‌.. థోర్లీఫ్‌సన్‌ ధనవంతుడని, పెద్ద మొత్తంలో పరిహారం పొందడానికే అందరికీ తెలిసేలా ఇలా ట్వీట్‌ చేశాడని ఆరోపించారు. అయితే ఆ తర్వాత థోర్లీఫ్‌సన్‌ ఆరోగ్యం గురించి తెలుసుకున్న మస్క్‌ అతడి పరిస్థితిని తప్పుగా అర్థం చేసుకున్నందుకు అతడిని క్షమాపణ కోరుతున్నానని ట్వీట్‌ చేశారు. మస్క్‌ క్షమాపణ 'ఆశ్చర్యంగా' ఉన్నదని థోర్లీఫ్‌సన్‌ స్పందించారు.

---

## సిసోడియా హత్యకు కుట్ర

- అందుకే కరుడుగట్టిన నేరస్థుల వార్డులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం
- బీజేపీపై ఆప్‌ నేతల ఆరోపణ



సంజయ్‌ సింగ్‌

న్యూఢిల్లీ, మార్చి 8: ఢిల్లీలో నూతన విద్యా విధానానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం, ఆప్‌ నేత మనీశ్‌ సిసోడియాను కరడుగట్టిన ఖైదీలు ఉండే తీహార్‌ జైలు-1 వార్డులో ఉంచారని ఆ పార్టీ నేత సంజయ్‌ సింగ్‌ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిసోడియాను హత్య చేయడానికే అక్కడ ఉంచారేమోనని, ఆయనకు అక్కడ ప్రాణహాని ఉన్నదని ఆరోపించారు. అసలు మొదటిసారి ఖైదీ అయిన వ్యక్తిని అలాంటి నేరస్థులతో ఉంచుతారా? అని ప్రశ్నించారు. ఒక అండర్‌ట్రైల్‌ ఖైదీని సెల్‌ నెంబర్‌1లో ఉంచరని, అందులో హంతకులు, కరడుగట్టిన నేరస్థులు, కొందరు పిచ్చివాళ్లు కూడా ఉంటారని మరో ఆప్‌ నేత సౌరభ్‌ భరద్వాజ ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలను తీహార్‌ జైలు అధికారులు కొట్టివేస్తూ సిసోడియా భద్రత దృష్ట్యా అతడిని వేరొక వార్డుకు మారుస్తున్నట్టు తెలిపారు. వీలైతే ప్రత్యే సెల్‌ కేటాయిస్తామన్నారు.



ధ్యానం చేస్తున్న కేజ్రీవాల్‌

**దేశం కోసం కేజ్రీవాల్‌ సుదీర్ఘ ధ్యానం**

హోలీ సందర్భంగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ బుధవారం ఏడు గంటల పాటు ధ్యానం చేశారు. ఈ చిత్రాలను ఆప్‌ ట్విట్టర్‌లో పోస్ట్‌ చేసి, కేజ్రీవాల్‌ దేశం కోసం ప్రార్థించారని తెలిపింది. ధ్యానం ప్రారంభించడానికి ముందు కేజ్రీవాల్‌ రాజ్‌ఘాట్‌లో గాంధీకి నివాళి అర్పించారు. 'దేశంలో మంచి చదువు, వైద్యం అందించేవారిని ప్రధాని జైల్లో పెడతారు. దేశాన్ని దోచుకొనేవారికి మద్దతిస్తారు. నేను దేశం కోసం ధ్యాన్యం, ప్రార్థన చేస్తాను. మీరు కూడా ప్రధాని మోదీ చేస్తున్నది తప్పని భావిస్తే, దేశం గురించి ఆందోళన చెందుతుంటే దేశం కోసం ప్రార్థించండి' అని కేజ్రీవాల్‌ వీడియో సందేశంలో పేర్కొన్నారు.

## యూజీసీలో అన్నీ అక్రమాలే


**న్యాక్‌ చైర్‌పర్సన్‌ పట్వర్ధన్‌ లేఖ**

(స్పెషల్‌ టాస్క్‌ బ్యూరో)

హైదరాబాద్‌, మార్చి 8 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌లో జరిగేవన్నీ అక్రమాలేనని న్యాక్‌ మాజీ చైర్‌పర్సన్‌ పట్వర్ధన్‌ ఆరోపించారు. ఆదివారం ఆయన నేషనల్‌ అసెస్‌మెంట్‌ అండ్‌ అక్రిడేషన్‌ కౌన్సిల్‌ (న్యాక్‌) చైర్‌పర్సన్‌ పదవికి రాజీనామా చేశారు. ఈ పదవి పవిత్రత, గౌరవాన్ని కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వెల్లడించారు. ఈ మేరకు యూజీసీ చైర్మన్‌ జగదీశ్‌ కుమార్‌కు ఓ లేఖ రాశారు. న్యాక్‌ చైర్‌పర్సన్‌ పదవికి రాజీనామా చేయాలని అనుకొంటున్నట్టు గత నెల 26నే యూజీసీ చైర్మన్‌కు పట్‌వర్ధన్‌ లేఖ రాశారు. ఉన్నత విద్యాసంస్థలకు గ్రేడింగ్‌, గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, అవినీతి పెరిగిపోయిందని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, అనిల్‌ సహస్రబుద్దెను తదుపరి న్యాక్‌ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ మార్చి 3న యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. సహస్రబుద్దె నియామకంపై తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పట్‌వర్ధన్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## స్టాండింగ్‌ కమిటీల్లో ధన్‌కర్‌ వ్యక్తిగత సిబ్బంది

- రాజ్యసభ సెక్రటేరియట్‌ ఉత్తర్వులు
- తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు



జగదీప్‌ ధన్‌కర్‌

న్యూఢిల్లీ, మార్చి 8: కేంద్రం మరో వివాదాస్పద నిర్ణయం తీసుకొన్నది. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్‌ జగదీప్‌ ధన్‌కర్‌ వ్యక్తిగత సిబ్బందిలోని 8 మంది అధికారులను 12 స్టాండింగ్‌ కమిటీలు, 8 శాఖా సంబంధ స్టాండింగ్‌ కమిటీల్లో నియమించింది. ఈ మేరకు మంగళవారం రాజ్యసభ సెక్రటేరియట్‌ ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణం అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు వారు కొనసాగుతాయని పేర్కొన్నది. ఈ నిర్ణయాన్ని విపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ ఉత్తర్వు ఊహించలేనిదని రాజ్యసభ ఎంపీ ఒకరు అన్నారు. దీనిపై కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ ఎంపీ మనీశ్‌ తివారీ మాట్లాడుతూ 'ఉపరాష్ట్రపతి.. వైస్‌ చైర్‌పర్సన్‌, లేదా ప్యానల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌లా సభకు చెందిన సభ్యుడు ఎంత మాత్రం కాదు. అలాంటప్పుడు ఆయన తన వ్యక్తిగత సిబ్బందిని పార్లమెంటరీ స్టాండింగ్‌ కమిటీలలో ఎలా నియమిస్తారు? ఇది వ్యవస్థాగత ద్రోహంతో సమానం కాదా?' అని ప్రశ్నించారు. అన్ని రాజ్యసభ కమిటీలకు సరిపడా సిబ్బంది ఉన్నారని, అయినా ఆ కమిటీలు రాజ్యసభకు మాత్రమే చెందినవని, చైర్మన్‌కు సంబంధించినవి కావని రాజ్యసభలోని కాంగ్రెస్‌ చీఫ్‌ విప్‌ జైరాం రమేశ్‌ అన్నారు. పార్లమెంటరీ కమిటీల్లో ఎంపీలకు మాత్రమే స్థానముందని, వారికి సహకరించడానికి లోక్‌సభ, రాజ్యసభ సచివాలయ సిబ్బందిని మాత్రమే నియమించాలని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్‌ పీడీటీ ఆచార్య తెలిపారు. గతంలో ఎన్నడూ ఇలాంటి నియామకాలు జరగలేదన్నారు. ప్రస్తుతం 24 స్టాండింగ్‌ కమిటీలు ఉండగా, అందులో 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. సాధారణంగా చాలా బిల్లులు సభలో ప్రవేశపెట్టిన తర్వాత పరిశీలన నిమిత్తం వాటిని ఈ కమిటీలకు పంపుతారు. సభ్యుల డిమాండ్‌ మేరకు స్పీకర్‌, రాజ్యసభ చైర్మన్‌ వీటిని కమిటీలకు పంపే అధికారం ఉంటుంది.

---

## పెండ్లి కాకున్నా పిల్లల్ని కనండి

**జనాభా పెంచేందుకు చైనా తంటాలు**

బీజింగ్‌, మార్చి 8: జనాభా తగ్గిపోతున్న నేపథ్యంలో జననాల రేటు పెంచడానికి చైనా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. పెండ్లి కాకున్నా సరే పిల్లల్ని మాత్రం కనండి అంటూ ప్రకటనలు ఇస్తున్నది. మరో వైపు, పెండ్లిళ్ల ఖర్చులు తగ్గించేలా చర్యలు చేపట్టింది. పెండ్లి కూతురిని పెంచేందుకు ఆమె కుటుంబానికి అయిన ఖర్చును వరుడు 'కైలీ' రూపంలో చెల్లించే సంప్రదాయం చైనాలో ఉన్నది. చైనాలో జరిగే మూడొంతుల పెండ్లిండ్లలో ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇందుకోసం వరుడి కుటుంబం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో దీన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

## చిరు వ్యాపారులపై బీజేపీ బుల్డోజరిజం



**డబుల్‌ ట్రబుల్‌ ఇంజిన్‌**

*బడా కార్పొరేట్‌ వ్యాపారవేత్తలకు ప్రజాధనం దోచిపెడుతున్న బీజేపీ సర్కారు.. చిరు వ్యాపారులపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నది. మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం ముంబైలోని మిరా భయందర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ (ఎంబీఎంసీ) వీధి వ్యాపారులపై బుల్డోజరిజం చేసింది. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటారనే సాకుతో తోపుడు బండ్లను జేసీబీతో తొక్కించింది. మీరా రోడ్డులోని బనేగర్‌ రోడ్డులో చిరు వ్యాపారులకు చెందిన 80కిపైగా తోపుడుబండ్లను ధ్వంసం చేయించింది.*

## 90 ఎయిరిండియా విమానాల్లో మహిళా పైలట్లే!

*న్యూఢిల్లీ: మహిళా శక్తిని చాటేలా ఎయిరిండియా గ్రూప్‌ వినూత్న చర్యలు చేపట్టింది. మార్చి 1-8 వరకు 90కి పైగా విమాన సర్వీసులను మొత్తం మహిళా సిబ్బందితోనే నడిపించింది. జేఆర్డీ టాటా మొదటి వాణిజ్య విమానం నడిపి 90 ఏండ్లు అయిన సందర్భంగా ఆయనకు నివాళి అర్పించడానికే 90కి పైగా విమాన సర్వీసులను ఇందుకు ఎంచుకున్నట్టు ఎయిరిండియా గ్రూప్‌ ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిరిండియా, ఏఐ ఎక్స్‌ప్రెస్‌, ఎయిర్‌ ఏషియా ఇండియా సంస్థలకు చెందిన విమానాలను మహిళలతో నడిపించామని తెలిపింది. ఇందులో జాతీయ, అంతర్జాతీయ సర్వీసులు ఉన్నట్టు వెల్లడించింది. సాధారణంగా మగవారి ఆధిపత్యం ఉండే విమానయాన విభాగాల్లో తమ ఉద్యోగినులు కీలక స్థానాల్లో ఉన్నారని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌ సీఈవో అలోక్‌ సింగ్‌ పేర్కొన్నారు.*

## బీజేపీకి 13 మంది నేతలు గుడ్‌బై

*చెన్నై, మార్చి 8: తమిళనాడులో బీజేపీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొత్తం 13 మంది కీలక నేతలు ఆ పార్టీని వీడారు. బుధవారం వారు బీజేపీ మిత్ర పక్షం అన్నాడీఎంకేలో చేరారు. వీరంతా చెన్నై పశ్చిమ ప్రాంతానికి చెందిన బీజేపీ ఐటీ విభాగం నేతలు. ఇటీవల పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేసి అన్నాడీఎంకేలో చేరడం గమనార్హం.*

## ఉల్లి కొనాలని ఏజెన్సీలకు ఆదేశాలు

*ముంబై: ఉల్లి ధరలు దారుణంగా పడిపోవటంతో రైతులంతా రోడ్డునపడ్డారు. మొన్న ఓ మహారాష్ట్ర రైతు పంటను కాల్చేయగా, మరికొందరు రైతులు ప్రధాని మోదీకి ఉల్లి పాయలు పార్సిల్‌ పంపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో చలనం వచ్చింది. మార్కెట్ల నుంచి ఉల్లిగడ్డలను కొనుగోలు చేయాలని మంగళవారం రెండు ప్రభుత్వ సంస్థలను ఆదేశించింది.*

## గ్యాస్ ధర పెంపుపై వినూత్న నిరసన



వంట గ్యాస్ ధర పెంపుపై మహిళలు వినూత్న నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్‌కు చెందిన కోఆప్షన్ సభ్యులతో పాటు మహిళలు బుధవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్లను వీధిలో ఉంచి గంటతో గంట కొడుతూ నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు ఇష్టమొచ్చినట్లుగా పెంచుతుంటే మహిళా దినోత్సవాన్ని ఎలా జరుపుకోవాలని వారు ప్రశ్నించారు. – కోల్‌సిటీ

## ఆన్‌లైన్ ద్వారా శ్రీరామ నవమి సేవలు

భద్రాచలం, మార్చి 8: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహించే శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు సంబంధించి భక్తులకు ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్లు ఈవో రమాదేవి బుధవారం తెలిపారు. ఈ నెల 30న శ్రీరామనవమి, 31న నిర్వహించే పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తుల కోసం దేవస్థానం గతేడాది మాదిరిగానే పరోక్ష సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. భక్తుల గోత్రనామాలతో స్వామివారి కల్యాణం జరిపించడానికి రూ.5వేలు లేదా రూ.1,116 టికెట్టును ఆన్‌లైన్‌లో www.bhadrachalam online.com ద్వారా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.







దుశ్చర్ల సత్యనారాయణ సృష్టించిన అడవిలోని లేక్‌లో తామరపూలు

# కేన్స్ ఫెస్టివల్‌కు 'దుశ్చర్ల' అడవి ఎంపిక

**ఇండియాస్ గ్రీన్ హార్ట్ పేరిట షార్ట్ ఫిలిం రూపకల్పన**



సత్యనారాయణ

సూర్యాపేట, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 'ఇండియాస్ గ్రీన్ హార్ట్ దుశ్చర్ల సత్యనారాయణ' పేరిట తీసిన డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్ కేన్స్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్‌కు అధికారికంగా ఎంపికైంది. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి చిలుకూరి సుశీల్‌రావు ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. వచ్చే నెల 6న అవార్డుల కార్యక్రమం నిర్వహించనున్నారు. వాతావరణ మార్పులు, వాటి పర్యవసానాలపై దృష్టిసారించిన పర్యావరణం, అడవుల పరిరక్షకుడు దుశ్చర్ల సత్యనారాయణ చేస్తున్న కృషి అంతర్జాతీయ వేదికలపై వెలుగు చూడటం అభినందనీయం. సూర్యాపేటకు సమీపంలోని రాఘవాపురంలో తన పూర్వీకుల నుంచి వచ్చిన 70 ఎకరాల భూమిలో ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ అడవిని సృష్టించారు. ఆరు దశాబ్దాల క్రితమే అడవిని అభివృద్ధి చేయడం ఆరంభించి ఎంతో కృషిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో డాక్యుమెంటరీ స్పెషల్ జ్యూరీ అవార్డును గెలుచుకున్నారు. ఈ సందర్భంగా దుశ్చర్ల సత్యనారాయణ 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా భూతాపం పెరిగిపోతున్నదని, 2030 నాటికి ఒకటిన్నర డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గించాలని ఐక్యరాజ్యసమితిలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతను ఆపడం, మొక్కలు పెంచడంతో భూతాపం తగ్గేందుకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారని చెప్పారు. అడవులు పచ్చగా పెరిగితే ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, తన 70 ఎకరాల్లో అడవిని సృష్టించడం ద్వారా ఈ విషయం తెలిసిందని పేర్కొన్నారు. తాను సృష్టించిన ఈ అడవిపై చిలుకూరి సుశీల్‌రావు తీసిన డాక్యుమెంటరీకి గతంలో తెలంగాణ స్టేట్ ఫిలింఫేర్ అవార్డుల్లో ఫస్ట్ ప్రైజ్ దక్కిందని, నేడు కేన్స్ ఫిలింఫేర్‌కు ఎంపికకావడం ఎంతో సంతోషంగా ఉన్నదని దుశ్చర్ల సత్యనారాయణ పేర్కొన్నారు.



**• రుణాల మంజూరుపై హర్షం**

వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెలో బుధవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. – సిరిసిల్ల రూరల్

# ఖమ్మం జిల్లా టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- తెలుగుయువత అధ్యక్షుడిని గెంటేసిన ప్రసూన
- క్షమాపణ చెప్పాలని తెలుగు తమ్ముళ్ల అడ్డగింత



నల్లమల్ల రంజిత్

ఖమ్మం, మార్చి 8 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీలో గ్రూపు తగాదాలు వీధినపడ్డాయి. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా పరిశీలకురాలు కాట్రగడ్డ ప్రసూన ఆ విభేదాలకు ఆజ్యం పోయడం విస్మయానికి గురి చేస్తున్నది. జిల్లాలో కొంతకాలంగా టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రసూన జిల్లా కార్యాలయానికి వచ్చారు. అయితే టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీ నేత కూరపాటి వెంకటేశ్వర్లుకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోగా, కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కూరపాటి ఫొటో లేకపోవడంతో ఆయన వర్గానికి చెందిన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల రంజిత్ తదితరులు ప్రసూనను నిలదీశారు. ఆమె ఆగ్రహంతో రంజిత్‌ను కాలర్ పట్టుకొని బయటకు గెంటేశారు. పరుష పదజాలంతో దూషించారు. ఆగ్రహానికి గురైన కార్యకర్తలు ప్రసూనపై ఎదురుదాడి చేశారు. దీంతో ప్రసూన, కూరపాటి వర్గీయులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. కూరపాటి వర్గీయులను కార్యాలయం నుంచి బయటకు పంపించి లోపల మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె బయటకు రాగా క్షమాపణ చెప్పాలని కూరపాటి వర్గీయులు సుమారు రెండు గంటల పాటు ప్రసూన కారును అడ్డగించారు.

## 13న కామారెడ్డి జిల్లాకు మంత్రి కేటీఆర్

**• అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు**

నిజాంసాగర్, మార్చి 8: ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 13న కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, పిట్లం మండలాల్లో పర్యటించనున్నట్టు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో అతిథిగృహంతోపాటు హెలిప్యాడ్, నాగమడుగు వద్ద నిర్మించిన పైలాన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ.. నిజాంసాగర్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించిన అతిథి గృహంతో పాటు మంజీర పరీవాహక ప్రాంతంలో రూ.25 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం వొడ్డెపల్లి-కొమలంచ శివారు ప్రాంతంలో మంజీర పరీవాహక ప్రాంతంలో రూ.476 కోట్లతో చేపట్టనున్న నాగమడుగు మత్తడి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. పిట్లంలో నిర్వహించే బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారని తెలిపారు.

## గొంతులో మక్కజొన్న గింజలు ఇరుక్కొని చిన్నారి మృతి



బిందు (ఫైల్)

చుంచుపల్లి, మార్చి 8: గొంతులో మక్కజొన్న గింజలు ఇరుక్కొని ఊపిరాడక ఓ చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రాంపురం పంచాయతీలో బుధవారం వెలుగుచూసింది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటకృష్ణ, అశ్విని దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్దకుమార్తె బిందుకు మూడేండ్లు. మంగళవారం రాత్రి బిందు మక్కజొన్న గింజలు తింటుండగా గొంతులో ఇరుక్కున్నాయి. ఈ క్రమంలో పాప శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బంది పడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని స్థానిక దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే పాప మృతిచెందినట్టు నిర్ధారించారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

## చెవులను శుభ్రం చేసే హెడ్‌ఫోన్స్

న్యూఢిల్లీ, మార్చి 8: పాటలు లేదా ఇతర కార్యక్రమాల గురించి వినడానికి హెడ్‌ఫోన్స్ వాడుతుంటాము. ఇప్పుడు చెవులను సైతం శుభ్రం చేసే హెడ్‌ఫోన్స్ వచ్చాయి. ఈ హెడ్‌ఫోన్స్‌లో కొంతమేర నీరు ఉంటుంది. ఈ నీరు కేవలం 35 సెకన్లలో చెవులను శుభ్రం చేస్తాయి. ఈ హెడ్‌ఫోన్స్ సొంతం చేసుకోవాలంటే రూ.2.25 లక్షలు ఖర్చు చేయాల్సిందే.

# క్యూ4లో వృద్ధి 4 శాతమే

- పూర్తి ఏడాదికి ప్రభుత్వ అంచనాలు మిస్
- ఆర్థికాభివృద్ధి మరింత దిగజారుతుందన్న ఇండియా రేటింగ్స్ ఏజెన్సీ



న్యూఢిల్లీ, మార్చి 8: ఈ ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో (2023 జనవరి-మార్చి, క్యూ4) దేశ ఆర్థిక వ్యవస్థ 4 శాతం వృద్ధి రేటును మాత్రమే సాధించగలుగుతుందని, పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7 శాతంలోపునకు పడిపోతుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ అంచనా వేసింది. 2022-23 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్)లో 13.2 శాతం వృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థ రేటు ద్వితీయ త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) 6.3 శాతానికి, మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) 4.4 శాతానికి దిగజారిన సంగతి తెలిసిందే. ఇది ప్రస్తుత క్యూ4లో మరింత తగ్గుతుందని ఇండియా రేటింగ్స్ అనలిస్ట్ పరాస్ జెస్రానీ వివరించారు. ఈ ఫిబ్రవరి 28న ప్రభుత్వం ప్రకటించిన ముందస్తు అంచనాల ప్రకారం పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7 శాతం వృద్ధి రేటు నమోదవుతుంది. దీనిని అందుకోవాలంటే, ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో కనీసం 4.1 శాతం వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ తెలిపింది. 2021-22లో 9.1 వృద్ధి సాధించినట్టు ప్రభుత్వం ఇటీవల అంచనాల్ని ఎగువముఖంగా సవరించింది. దీంతో పోలిస్తే ప్రస్తుత ఏడాది వృద్ధికి పెద్ద దెబ్బ తగిలినట్టే. క్యూ4లో త్రైమాసికంలో జాతీయ గణాంకాల శాఖ (ఎన్ఎస్‌వో) 5.1 శాతం వృద్ధిని అంచనా వేసింది. అయితే కొవిడ్ తదుపరి ఏర్పడిన డిమాండ్ తగ్గడం, అంతర్జాతీయ వృద్ధి మాంద్యంతో ఎగుమతులు క్షీణించడం తదితర రిస్కుల కారణంగా ప్రభుత్వ అంచనాలు నెరవేరవని ఇండియా రేటింగ్స్ విశ్లేషించింది.

### వేడి గాలుల ప్రభావం

ఈ ఏడాది మార్చి-మే మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా తీవ్రమైన వేడి గాలులు వ్యాపించవచ్చంటూ ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వ్యవసాయ దిగుబడి తగ్గవచ్చని, ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి గ్రామీణ డిమాండ్ దెబ్బతింటుందని రేటింగ్ ఏజెన్సీ అనలిస్ట్ పరాస్ జెస్రానీ తెలిపారు. క్యూ4లో వ్యవసాయ రంగం వృద్ధి 4.3 శాతం ఉంటుందని ఎన్ఎస్‌వో అంచనా వేసింది. మరోవైపు బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ తగ్గిందని, జనవరి నెలలో డబ్బుకు ఉన్న నికర డిమాండ్‌తో పోలిస్తే లిక్విడిటీ నాలుగు నెలల కనిష్ఠస్థాయి 0.43 శాతానికి తగ్గిందని, 2022 డిసెంబర్‌లో ఇది 0.53 శాతమని పేర్కొంది. ఈ అంశం సైతం జీడీపీ వృద్ధి తగ్గవచ్చనడానికి సంకేతమేనని ఇండియా రేటింగ్స్ తెలిపింది.

### ఎగుమతుల దెబ్బ

వరుసగా రెండో నెలైన జనవరిలో ఉత్పత్తుల ఎగుమతులు 6.6 శాతం క్షీణించి 32.91 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 3.6 శాతం తగ్గుదలతో 50.66 బిలియన్ డాలర్లకు పడిపోయాయని ఇండియా రేటింగ్స్ గుర్తుచేసింది. ఇవి ఇంతగా క్షీణించడం గత 25 నెలల్లో ఇదే తొలిసారని తెలిపింది. సానుకూల అంశమేమిటంటే సర్వీసుల విభాగంలో వాణిజ్య మిగులు జనవరి నెలలో ఏడాది క్రితంతో పోలిస్తే 8.39 బిలియన్ డాలర్ల నుంచి 16.48 బిలియన్ డాలర్లకు రెట్టింపు అయ్యింది. దీంతో మొత్తంగా వాణిజ్య లోటు (సర్వీసులు, ఉత్పత్తులు కలుపుకొని) 1.26 బిలియన్ డాలర్ల వద్ద నిలిచింది. 2022 జనవరిలో ఈ లోటు 8.95 బిలియన్ డాలర్లుగా ఉంది.



# 56 వేల దిగువకు పసిడి

- హైదరాబాద్‌లో రూ.720 తగ్గిన తులం
- రూ.2,500 దిగొచ్చిన కిలో వెండి

న్యూఢిల్లీ, మార్చి 8: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.615 దిగొచ్చి రూ.55 వేల స్థాయికి రూ.55,095కి పడిపోయింది. అంతకుముందు ఈ ధర రూ.55,710గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.2,285 తగ్గి రూ.62,025 వద్దకు జారుకున్నది. ఇటు హైదరాబాద్‌లోనూ బంగారం 56 వేల దిగువకు పడిపోయింది. 24 క్యారెట్ల తులం గోల్డ్ ధర రూ.56,350 నుంచి రూ.55,630కి తగ్గింది. తులంపై రూ.720 తగ్గినట్లు అయింది. అలాగే 22 క్యారెట్ల ధర రూ.650 తగ్గి రూ.51 వేల స్థాయికి జారుకున్నది. రూ.2,500 తగ్గిన కిలో వెండి ధర రూ.67,500కి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,814 డాలర్లకు పడిపోగా, వెండి 20.05 డాలర్లుగా నమోదైనట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. ధరలను నియంత్రించడానికి భవిష్యత్తులోనూ వడ్డీరేట్లను మరింత పెంచకతప్పదని అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు పసిడి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం.

| బంగారం (10 గ్రాములు) | |
|---|---|
| హైదరాబాద్ (24 క్యారెట్) | 55,630 |
| హైదరాబాద్ (22 క్యారెట్) | 51,000 |
| వెండి (కిలో) | 67,500 |

### 31 కల్లా ఆధార్‌తో పాన్ లింక్ చేయండి

- ఇన్వెస్టర్లకు సెబీ సూచన

న్యూఢిల్లీ, మార్చి 8: సెక్యూరిటీల మార్కెట్లో లావాదేవీలను సజావుగా కొనసాగించేందుకు ఈ నెల 31కల్లా ఆధార్ నంబర్‌తో పాన్ (పర్మినెంట్ అకౌంట్ నంబర్)ను లింక్ చేయాలంటూ ఇన్వెస్టర్లకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ సూచించింది. ఈ రెండింటినీ లింక్ చేయకపోతే కేవైసీ నిబంధనల్ని పాటించనట్టుగా పరిగణిస్తామని, వీటిని అనుసంధానించేంతవరకూ సెక్యూరిటీల (షేర్లు, బాండ్లు తదితరాలు) లావాదేవీలపై నియంత్రణలు ఉంటాయని సెబీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023 మార్చి 31కల్లా ఆధార్‌తో లింక్ చేయని పాన్ చెల్లదని 2022 మార్చిలోనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఒక సర్క్యులర్ జారీచేసింది.

### రాష్ట్రంలో మరో 8 నగరాల్లో జియో 5జీ

హైదరాబాద్, మార్చి 8: దేశీయ టెలికం దిగ్గజం జియో..రాష్ట్రంలో మరో 8 నగరాలకు 5జీ సేవలను విస్తరించింది. తాజాగా సిద్దిపేట, సంగారెడ్డి, జగిత్యాల్, కొత్తగూడెం, కోదాడ, తాండూరు, జహీరాబాద్, నిర్మల్‌లో జియో ఈ సరికొత్త సేవలను ప్రారంభించింది. ప్రారంభ ఆఫర్ కింద జీబీపీఎస్ వేగంతో అన్‌లిమిటెడ్ డాటాను అందిస్తున్నది సంస్థ. ఇందుకోసం ఎలాంటి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

### నాట్కో ఫార్మా షేర్ల బైబ్యాక్

హైదరాబాద్, మార్చి 8: ప్రముఖ ఔషధ సంస్థ నాట్కో ఫార్మా.. రూ.210 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. ఒక్కో షేరుకు రూ.700 చొప్పున 30 లక్షల షేర్లను ఓపెన్ మార్కెట్ నుంచి కొనుగోలు చేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. బుధవారం స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత నమోదైన రూ.571.15 షేరు కంటే బైబ్యాక్ 22 శాతం అధికమని పేర్కొంది.

# 100 శాతం నూనె ఉత్పత్తి

- ఐఐసీటీ టెక్నాలజీతో సాధ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): నాణ్యమైన నూనెల ఉత్పత్తిని పెంచేలా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ప్రత్యేక సాంకేతికతను అభివృద్ధి చేసింది. శరీరానికి అవసరమైన మంచి కొవ్వులకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా నూనెను వెలికితీసే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎంతో శాస్త్రీయంగా జరిగే ఈ విధానం ద్వారా నూనె గింజల నుంచి వంద శాతం నూనెను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని ఐఐసీటీ వర్గాలు తెలిపాయి. ఐఐసీటీలో జరుగుతున్న వన్ వీక్-వన్ ల్యాబ్ కార్యక్రమంలో నూతన సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు. నూనెల తయారీ ప్లాంట్ నమూనా, దాని ప్రత్యేకతను బుధవారం ఐఐసీటీ సిబ్బంది తిరుపతి, రవీందర్, శివశంకర్ వివరించారు.

### తవుడు నూనెలో పోషకాలు మెండు

నిజానికి పల్లీ, నువ్వులు, పొద్దుతిరుగుడు పువ్వు గింజలతో పోల్చితే వడ్లను శుద్ధి చేయగా వచ్చే తవుడు (రైస్ బ్రాన్)లో పుష్కలమైన పోషకాలు ఉంటాయని ఐఐసీటీ ఈ సందర్భంగా వివరించింది. దీని నుంచి సేకరించిన నూనెలోనూ అదే తరహాలో హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ ఉంటుందన్నది. కాగా, నిత్యం 100 టన్నుల ఉత్పాదక సామర్థ్యం తమ టెక్నాలజీతో నడుస్తున్న ప్లాంట్లకు ఉంటుందని.. తెలంగాణ, ఏపీల్లో ఇలా 16 ప్లాంట్లున్నాయని ఐఐసీటీ తెలియజేసింది. రాష్ట్రంలో 8 ప్లాంట్లున్నట్టు వివరించింది. ఇక ఏటా దేశ వ్యాప్తంగా 12.5 లక్షల టన్నుల నూనె వినియోగం ఉండగా.. ఇందులో 6 లక్షల టన్నుల నూనె ఐఐసీటీ డెవలప్ చేసిన టెక్నాలజీతోనే ఉత్పత్తి అవుతుండటం గమనార్హం. ఈ కార్యక్రమం ఈ నెల 12 వరకు జరుగనుంది. దీన్ని ఉచితంగానే సందర్శించవచ్చు.



నమూనా ఆయిల్ ప్లాంట్

### మెట్రో రైల్ బిజినెస్ పార్కుకు గోల్డ్ రేటింగ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్‌లోని రాయదుర్గంలో తాము నిర్మించిన బిజినెస్ పార్కు టవర్ 1కి ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ ఇచ్చిందని ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీ శేఖర్ రెడ్డి నుంచి ఈ గోల్డ్ రేటింగ్ పత్రాన్ని అందుకున్నట్టు చెప్పారు. రవాణా ఆధారిత అభివృద్ధి ట్రాన్సిట్ ఓరియెంట్ డెవలప్‌మెంట్-టీవోడీ)లో భాగంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ సమీపంలో బిజినెస్ పార్కు టవర్ 1ను గతంలో నిర్మించింది సంస్థ. ఈవీల కోసం చార్జింగ్ పాయింట్లు, లో ఫ్లో ప్లంబింగ్‌ను, విద్యుత్ ఆదాకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ భవనానికి ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ రావడం చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా కేవీబీ రెడ్డి తెలిపారు.

# మనీ లాండరింగ్ పరిధిలోకి క్రిప్టో

- ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ
- ఎక్స్ఛేంజీలు, మధ్యవర్తులకు కేవైసీ నిబంధనలు

న్యూఢిల్లీ, మార్చి 8: మనీ లాండరింగ్ చట్టం కిందకు క్రిప్టో వ్యాపారాలు, లావాదేవీలను తీసుకొస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మోదీ సర్కారు ఓ గెజిట్ నోటిఫికేషన్‌నూ విడుదల చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన ఈ ప్రకటన ప్రకారం క్రిప్టో ఎక్స్ఛేంజీలు, వాటి సంరక్షకులు, వ్యాలెట్ ప్రొవైడర్లుసహా యావత్తు క్రిప్టో బిజినెస్ ట్రేడింగ్.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) 2002 కిందకు వస్తుంది. దీంతో అన్ని లావాదేవీల వివరాలను తప్పక పేర్కొనాల్సిందే. ఈ ట్రేడర్స్‌ను 'రిపోర్టింగ్ ఎంటిటీ'లుగా కేంద్రం పేర్కొన్నది. అలాగే ఎక్స్ఛేంజీలు, మధ్యవర్తులు తమ క్లయింట్లు, లబ్ధిదారులకు సంబంధించి కేవైసీ నిబంధనల్ని పాటించాల్సిందే. కనీసం ఐదేండ్లపాటు అన్ని లావాదేవీల రికార్డులను నిర్వహించాలి. ముఖ్యంగా రూ.10 లక్షలకుపైగా ఉన్న లావాదేవీలను భద్రపర్చాల్సిందే.

### నోటిఫికేషన్‌లో ఏముంది?

ఈ కింది లావాదేవీల్లో భాగమైన సంస్థలు పీఎంఎల్‌ఏ కింద రిపోర్టింగ్ ఎంటిటీలు అవుతాయి

- క్రిప్టోకరెన్సీ ఆస్తులు, ఫియట్ కరెన్సీల మధ్య ఎక్స్ఛేంజ్
- ఒకటి లేదా అంత కన్నా ఎక్కువ రూపాల్లో వర్చువల్ డిజిటల్ అసెట్స్ మధ్య ఎక్స్ఛేంజ్
- వర్చువల్ డిజిటల్ అసెట్స్ బదిలీ
- వర్చువల్ డిజిటల్ అసెట్స్ ప్రమేయమున్న సాధనాల్లో పెట్టుబడులు, క్రిప్టోకరెన్సీల నిర్వహణ, వాటిని భద్రపర్చడం
- వర్చువల్ డిజిటల్ అసెట్ అమ్మకం, ఇతరత్రా లావాదేవీల్లో పాల్గొనడం వీటిని నేరుగాగానీ లేదా ఎవరి తరఫునైనా గానీ నిర్వహించినా తెలియపర్చాలి.



### ఇప్పటికే పన్నులు

ఈ ఆర్థిక సంవత్సరానికి (2022-23)గాను నిరుడు ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రిప్టో లావాదేవీలపై 30 శాతం పన్నును వేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ డిజిటల్ అసెట్స్‌ను పన్ను పరిధిలోకి తేవడమే గాక, పరిమితి దాటితే వీటి లావాదేవీలపై 1 శాతం టీడీఎస్‌నూ విధించారు. చివరకు క్రిప్టో, డిజిటల్ ఆస్తుల్లో బహుమతులపైనా పన్నుంటుందని స్పష్టం చేశారు. దీంతో క్రిప్టోకరెన్సీని చట్టబద్ధం చేసినట్టైంది. తాజాగా మనీ లాండరింగ్ కిందకూ ఈ లావాదేవీలను తేవడంతో ఈ రంగానికి మరింత గుర్తింపును ప్రభుత్వం ఇచ్చినట్టైంది. నిజానికి క్రిప్టోకరెన్సీ లావాదేవీలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎప్పట్నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి విదితమే.

నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్ | గురువారం
9 మార్చి 2023
www.ntnews.com


మాతృత్వానికి ప్రతినిధులు..
అంగన్‌వాడి అమ్మలు.
కరోనాతో పోరాడి గెలిచిన యోధులు..
మన ఊరి ఆశ కార్యకర్తలు.
ఖాకీడ్రస్‌లోని కరుణామూర్తులు..
పోలీసు ఉద్యోగులు.
పల్లె రూపం మార్చిన కార్యసాధకులు..
ఆదర్శ సర్పంచ్‌లు.
సంప్రదాయ సారథులు.. జానపద కళాకారిణులు.
అక్షరాల నెచ్చెలులు.. పాత్రికేయులు.
చదువులమ్మ ముద్దుబిడ్డలు.. సాహితీవేత్తలు.
సరిగమల సిరిమంతులు.. గాయనీమణులు.
బొమ్మలు గీసి, ప్రాణంపోసే.. చిత్రకారిణులు.
ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా.. భిన్న రంగాలలో అపార ప్రతిభ కనబరుస్తున్న స్త్రీ మూర్తులను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'ఉమెన్ అవార్డ్స్-2023' పురస్కారాలతో.. ఘనంగా సత్కరించింది తెలంగాణ ప్రభుత్వం. హనుమకొండ వేదికగా జరిగిన ఆ వేడుక పట్టుచీరల రెపరెపలతో, మట్టిగాజుల గలగలలతో.. పుట్టింటి సంబురాన్ని తలపించింది. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు 'జిందగీ'తో తమ మనోభావాలు పంచుకున్నారు.

# మహిళకు నమస్కారం ప్రతిభకు పురస్కారం 2023

## ■ గర్భిణులే కనుపాపలుగా..

**నేను** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ పరిధిలోని పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నా. కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితుల్లో ఇంటింటికి తిరిగి కరోనా సేవలు అందించాను. అందులోనూ గర్భిణుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాను. నా వంతు ధైర్యం చెప్పాను.



• **ముండ్ల కృష్ణవేణి**, ఆశా వర్కర్

## ■ కరోనా సమయంలో..

**మాది** మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా. కీసర మండలం పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంగా పనిచేస్తున్నాను. మాతా శిశు సంరక్షణ నా బాధ్యత. జాతీయ అవార్డు కూడా అందుకున్నా. కరోనా సంక్షోభ సమయంలో ప్రజలకు సేవ చేయడం నా అదృష్టంగా భావించాను. ఎంతో సంతృప్తినిచ్చిన అనుభవం ఇది.



• **తుంగ ఇందిర**, ఏఎన్ఎం

> ముదితల్ నేర్వగరాని విద్య కలదే.. అనే మాట పాతబడి పోయింది. ఇప్పుడు ఆమెకు ఎవరూ నేర్పాల్సిన పనిలేదు. తనే కష్టపడుతుంది. తనే మార్గం సిద్ధం చేసుకుంటుంది. అనుకున్న విజయాన్ని సాధిస్తుంది.



## ■ గిన్నిస్ రికార్డు..

**రెండేళ్ల వయసులోనే** పోలియోతో 90 శాతం వైకల్యం బారినపడ్డాను. అయినా, అధైర్యపడకుండా ముందుకు సాగుతున్నాను. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చదివాను. చిత్రకారిణిగా రాణిస్తూ.. ఎన్నో అవార్డులు అందుకున్నా. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ పేరు సాధించాను.

• **నారా విజయలక్ష్మి**, చిత్రకారిణి

## ■ కోయ బిడ్డలకు అండగా



**దట్టమైన** అడవిని దాటి.. అవతలివైపు చేరుకొని ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన గుత్తికోయ బాలలకు సేవలు అందించాను. గిరిజన గ్రామమైన గుట్టుమల్లా పంచాయతీలో అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తున్నా. రక్తదాతగానూ ప్రశంసా పురస్కారం అందుకున్నాను.

• **బానోత్ జ్యోతి**, అంగన్‌వాడి టీచర్

## ■ యువతకు 'భరోసా'



**సెంటర్** కోఆర్డినేటర్‌గా, కౌన్సెలర్‌గా.. భరోసా, సఖి కేంద్రల్లో పనిచేశాను. తరుణి సంస్థ నేతృత్వంలో యుక్తవయసు బాలికల నైపుణ్యాలను మెరుగుపరిచాను. కాలేజీలు, స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాను. యువత సన్మార్గంలో నడుస్తూ చదువుపై దృష్టి పెట్టేలా మార్గదర్శనం చేశాను. ఆ ప్రయత్నంలో వివిధ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నా.

• **గుండా రాజకుమారి**
హైదరాబాద్

## ■ దివ్యాంగులే లోకంగా



**శాంతి** నిలయం.. మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం కార్యదర్శిగా దివ్యాంగ బాల బాలికల సంక్షేమానికి కృషిచేస్తున్నా. అయినవారికి దూరమైన ఆ పిల్లలకు ప్రేమను పంచడం నా బాధ్యతగా భావిస్తున్నా. లైంగిక వేధింపులకు గురైన మహిళలకు నీడనిస్తున్నా. తోడుగా నిలుస్తున్నా. ఖమ్మం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పరిశుభ్రత పట్ల అవగాహన కల్పిస్తున్నా. జీవన నైపుణ్యాలు బోధిస్తున్నా.

• **ఆల్ఫి కిడాంజన్**
సోషల్ సర్వీస్

## ■ పల్లెకు కొత్త వెలుగులు



**ఆదిలాబాద్** జిల్లాలోని ముఖ్రా గ్రామ సర్పంచ్ హోదాలో ఆ పల్లె రూపురేఖలు మార్చేశాను. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా మహిళా అఛీవర్ అవార్డు అందుకోవడం గొప్ప అనుభూతి. ముఖ్యమంత్రి సహాయనిధికి నా వంతుగా రూ.లక్ష విరాళంగా అందించాను. గ్రామంలోని చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చి పంచాయతీకి అదనపు ఆదాయం సంపాదిస్తున్నా. గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభించాను.

• **గాడ్గే మీనాక్షి**
ముఖ్రా(కే) సర్పంచ్

## ■ 'తీన్మార్' ముద్ర



**తీన్మార్** చంద్రవ్వగా నేను సుపరిచితురాలిని. సెంట్రల్ యూనివర్సిటీలో కూచిపూడిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత, మెదక్ జిల్లా స్త్రీల జానపద కళల మీద ఎంఫిల్ చేశాను. ఎంసీజేలో గోల్డ్‌మెడల్ సాధించాను. అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాను. ఇప్పటి వరకూ మూడువేల జానపద ప్రదర్శనలు ఇచ్చాను. సినిమాలు, లఘు చిత్రాల్లో నటించాను.

• **పి.సుజాత**, యాంకర్

## ■ అక్షరమే ఆయుధంగా



**పాత్రికేయ** వృత్తి నా ప్రాణం. అక్షరాలే నా నేస్తాలు. లింగ వివక్షను ప్రశ్నించాను. మహిళలపై నేరాలను ఎత్తి చూపాను. అనేక సామాజిక సమస్యల పట్ల అక్షరమే ఆయుధంగా పోరాడాను. యునిసెఫ్, లాడ్లీ అవార్డులు అందుకున్నాను. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా నా ఆలోచనలను, అనుభవాలను, యాత్రా విశేషాలను పంచుకుంటున్నా. కాపీ ఎడిటర్, బులెటిన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వర్తించాను.

• **స్వరూప పొట్లపల్లి**, జర్నలిస్ట్

## ■ జానపదమే శ్వాసగా



**తెలంగాణ** జానపద సాహిత్యం, బతుకమ్మ పాటల మీద పీహెచ్‌డీ చేశాను. బతుకమ్మ ఫౌండేషన్ స్థాపించాను. పాఠ్య పుస్తక రచయిత్రిని కూడా. ఇప్పటి వరకూ పదహారు రచనలు వెలువరించాను. జానపదాలు ఏ జాతికైనా ఆత్మలాంటివి. వాటిని బతికించుకోవాలి. రేపటి తరాలకు భద్రంగా అందించాలి. నా రచనల అంతిమ లక్ష్యం కూడా అదే.

• **డాక్టర్ బండారి సుజాత శేఖర్**, జానపద సాహిత్యం

## ■ నాట్యం.. జీవన వేదం



**నాట్యకళ** భారతీయ సంస్కృతిలో భాగం. నాట్య గురువుగా నేను ఎంతోమందికి కూచిపూడి నేర్పించాను. అనేక వేదికల మీద ఆ సంప్రదాయ నాట్యానికి ప్రాతినిధ్యం వహించాను. వివిధ పుస్తకాలు రచించాను. అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించాను. శతాబ్దాల నాటి కూచిపూడి ప్రాథమిక మూల సామగ్రిని, వంశపారంపర్య గురువుల రచనలను భద్రపరిచి 'ఆర్ట్ ఇండియా ఫౌండేషన్' ద్వారా ప్రపంచానికి అందించాను.

• **డాక్టర్ తడకమల్ల అనూరాధ**,
శాస్త్రీయ నృత్యకారిణి

## ■ సమాజమే బడిగా..



**తెలంగాణ** ప్రభుత్వ పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేశాను. ఆంగ్లభాష, సాహిత్య బోధనలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. నా నేతృత్వంలో ఎంతోమంది ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. వినూత్నమైన చిట్కాలతో ఆంగ్ల వ్యాకరణాన్ని సుబోధకం చేశాను.

• **ప్రొఫెసర్ డి. కనకదుర్గ**, కాలమిస్ట్, సామాజికవేత్త

## ■ నాణ్యమైన వైద్య సేవలు



**మాది** వైద్యుల కుటుంబం. శ్వాస ఉన్నంతవరకు రోగులకు సేవ చేయాలని నా కోరిక. కాకతీయ వైద్య కళాశాలలో చదువుకున్నా. గాంధీ వైద్య కళాశాలలో పీజీ చేశాను. ప్రస్తుతం పిల్లల వార్డు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నా. చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే నా తపన. వివిధ అంటురోగాలు, ప్రాణాంతక రుగ్మతల పట్ల జనంలో అవగాహన పెంచుతున్నా.

• **డాక్టర్ పొన్నూరు మాలతి**

## ■ ఎక్కడికెళ్లినా.. బాధ్యతే సర్వస్వం



**అంగన్‌వాడి** కేంద్రాన్ని శుభ్రంగా ఉంచడం, మెనూ ప్రకారం ఆహారం వండటం నా బాధ్యత. గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, పిల్లలందరికీ పౌష్టికాహారం అందేలా చూస్తున్నా. సమావేశాల కోసం ఎక్కడికి వెళ్లినా.. పిల్లలకు వీడియోల రూపంలో కథలు, పాటలు పరిచయం చేస్తూనే ఉంటా.

• **రజియా సుల్తానా**, అంగన్‌వాడి కార్యకర్త

Women's Day Awards

## ■ జీవితాంతం సేవ చేస్తా..



**చిన్నపిల్లల్లో** క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాను. క్యాన్సర్ బాధితులకు జీవితాంతం సేవ చేయాలని నిర్ణయించుకున్నా. స్టోన్ ఫెలోషిప్‌తో 2011లో లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి పట్టా అందుకున్నా. వృత్తి జీవితంలో ఎన్నో మైలురాళ్లు దాటాను. ఇప్పుడు సమాజ సేవ కోసం పని చేస్తున్నా.

• **సమంతారెడ్డి**, సామాజిక కార్యకర్త

## ■ ఫైనల్‌లో టాప్ స్కోర్..



**ఏడేళ్ల** వయసులోనే క్రికెట్ అకాడమీలో చేరాను. బ్యాటర్‌గా, బౌలర్‌గా ప్రతిభ చాటి.. అండర్-19 ఉమెన్స్ టీ20 వరల్డ్‌కప్ 2023 కోసం భారత జట్టుకు ఎంపికయ్యాను. ఫైనల్ మ్యాచ్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి.. భారత్ కప్పు గెలవడంలో కీలకంగా మారడం ఆనందంగా ఉంది.

• **గొంగడి త్రిష**, స్టార్ క్రికెటర్

## ■ 7 ఖండాల్లో 7 పర్వతాలు..



**చిన్నప్పటి** నుంచే కొండలు ఎక్కడమంటే సరదా. అందుకే.. ఎంబీఏ చేసినా, రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నా. 17 ఏండ్ల వయసు నుంచే పర్వతారోహణలో శిక్షణ పొందా. 7 ఖండాల్లో ఉన్న 7 ఎత్తయిన పర్వతాలు అధిరోహించాను.

• **అన్వితరెడ్డి**, రాక్ మౌంటెనీర్

## ■ శిక్షలు వేయించా..



**భరోసా**, షీ టీమ్స్‌లో పనిచేస్తూ.. అత్యాచార, పోక్సో, మహిళలపై వేధింపులు తదితర కేసులను బలంగా నమోదు చేశాను. పన్నెండు పోక్సో కేసుల్లో దోషులకు శిక్ష పడేలా చేశాను. మత్తు మందుకు అలవాటైన యువతకు కౌన్సెలింగ్ ఇప్పించా.

• **పి.రుక్మిణి**, ఇన్‌స్పెక్టర్ (భరోసా, షీటీమ్స్)

## ■ వెట్టి నుంచి విముక్తి



**పోలీసు** ఉన్నతాధికారిగా మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించి అనేక కేసులు పరిశోధించాను. ఎనిమిది వేల ఫిర్యాదులు పరిష్కరించాను. ఇరవైవేల డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాను. వంద బాల్యవివాహాలను నిలిపివేశాను. రెండువేల మంది చిన్నారులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాను.

• **సీ అనసూయ**, ఐపీఎస్, (డీడీ, టీఎస్ పోలీస్ అకాడమీ)

## ■ ఆరోగ్య చైతన్యం కోసం



**సాహిత్యంలో** పీహెచ్‌డీ చేశాను. పిల్లల కథలు, కవితలు, వ్యాసాలు, పజిల్స్ అందించాను. జనంలో వివిధ వ్యాధులకు సంబంధించిన అవగాహన కల్పిస్తున్నా. అనేకానేక రుగ్మతలను తెలిపే బొమ్మలను ప్రిస్క్రిప్షన్ ప్యాడ్స్‌పై ముద్రిస్తూ జనంలో ఆరోగ్య స్పృహ పెంచుతున్నా.

• **డాక్టర్ కె.రాణీప్రసాద్**, సాహిత్యం

## ■ సాహితీ ప్రియులను మెప్పిస్తూ..



**సాహిత్యాన్ని** అభిమానించే వారిని మెప్పించేలా అనేక కవితలు రాశాను. 'ఇన్నాళ్ల మౌనం తర్వాత' (2016), 'లోపలి ముసుగు'(2022) పుస్తకాలు వెలువరించాను. ప్రస్తుతం 'అమర్‌నాథ్ యాత్ర' పుస్తకాన్ని రాస్తున్నా. రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉంది.

• **అరుణ నారదభట్ల**, సాహిత్యం

## ■ 12 మెట్ల కిన్నెరపై..



**చిన్నప్పుడే** కిన్నెర వాయించడం నేర్చుకున్నా. పన్నెండు మెట్ల కిన్నెరపై అవలీలగా రాగాలు పలికిస్తా. నా నైపుణ్యాన్ని గుర్తించి రవీంద్రభారతిలో అవార్డు అందించారు. ఇప్పుడు ఈ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉంది. కళలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది.

• **కర్నె శంకరమ్మ**, కిన్నెర వాద్య కళాకారిణి

## ■ ఆదిమ తెగలపై పరిశోధనలు..



**పాలమూరు** యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. అంతరించిపోతున్న ఆదిమ తెగలపై పరిశోధనలు చేస్తున్నా. ఆ జాతుల మూలాలను కాపాడేందుకు పాటుపడుతున్నా. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. ఆ దిశగా సర్కారు సహకారం కోరుతున్నా.

• **గూడూరు మనోజ**, పరిశోధకురాలు

## ■ మహిళా రైతులకు అవగాహన



**'నేలమ్మ** మహిళా రైతు పరస్పర సహకార సంఘం' ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించాను. కమ్యూనిటీ మొబిలైజర్‌గా ఒంటరి మహిళలు, చిన్న, సన్నకారు మహిళా రైతులతో కలిసి పనిచేశాను. రెండొందల మందికి వ్యవసాయం, జీవనోపాధి, ఆహార పంటలపై శిక్షణ ఇచ్చా.

• **సామల్ల శ్వేత**, మహిళా రైతు

## ■ వందశాతం పూర్తి చేయిస్తా..



**అంగన్‌వాడి** సూపర్‌వైజర్‌గా నా పరిధిలోని అన్ని కేంద్రాలనూ సందర్శిస్తాను. ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాను. సంక్షేమ పథకాలను సమర్థంగా పర్యవేక్షిస్తూ.. ప్రతి నెలా వందశాతం ఎఫ్‌సీఆర్ పూర్తి చేయిస్తాను.

• **జి.నందిని**, అంగన్‌వాడి సూపర్‌వైజర్

## ■ ఉచిత వైద్యం అందిస్తున్నా..



**నాకు** చిన్నతనం నుంచే వైద్యవృత్తి అంటే మక్కువ. పట్టుబట్టి చదివి.. ఎంబీబీఎస్ పట్టా అందుకున్నా. చిన్నపిల్లల విభాగంలో పని చేశాను. ఎంతోమంది పేదలకు వైద్యం చేశాను. ఉద్యోగ విరమణ తర్వాత.. 15 ఏండ్లుగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాను.

• **డాక్టర్ అమూల్య మల్లంగారి**, వైద్యురాలు

## ■ శ్రోతలను ఉర్రూతలూగిస్తున్నాం..

**మేం** ముగ్గురం అక్కాచెల్లెళ్లం. బాల్యం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్నాం. సరిగమలే ప్రధానంగా ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్నాం. మ్యూజిక్ టీచర్లుగా రాణిస్తూనే.. ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాం.




• **ఓని విజయ, వినోద, విజయలక్ష్మి**, సంగీతం

... యెడ్ల హరీష్


# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఉద్యమ కాంక్షలు సాకారం

**తెలంగాణ ఆరు దశాబ్దాలకల. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కలగానే మిగిలిపోతుందేమోననే ఆందోళనను పక్కకునెట్టి రాష్ట్రాన్ని సాధించి తెలంగాణకు కొత్త వెలుగులను అందించిన మహానేత మన ముఖ్యమంత్రి కేసీఆర్. అరవై ఏండ్ల తెలంగాణ కలను సాకారం చేసి, తెచ్చుకున్న తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. దేనికోసమైతే.. ప్రాణాలకు తెగించి కొట్లాడామో.. ఆ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. స్వరాష్ట్రంలో మన భాష, సంస్కృతి, దేవాలయాలు, పండుగలకు ఎనలేని ప్రాధాన్యం చేకూరింది.**

సాధించుకున్న తెలంగాణ పాలనా పగ్గాలను పరుల చేతికిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరదన్న తెలంగాణ మేధావులు, నిపుణులు, విశ్రాంత ఉన్నతాధికారుల కోరిక మేరకు కేసీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. నేడు దేశంలో పంటలు పండించడంలో తెలంగాణ టాప్, ఆదర్శ గ్రామాల్లో టాప్, తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్ వినియోగంలో టాప్, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సహా అనేక అంశాల్లో ఎన్నో ఏండ్ల కింద ఏర్పడిన పెద్ద రాష్ట్రాల కంటే తెలంగాణ ముందువరుసలో ఉన్నది.



ఇప్పుడు దేశంలో తెలంగాణ మాడల్ జన బాహుళ్యంలో ఉన్నది. ఈ కృషి కారణజన్ముడైన సీఎం కేసీఆర్‌ది. ఆయన రాత్రికి రాత్రే మంత్రాలతో మ్యాజిక్ చేయలేదు. ఆయన తెలంగాణ మౌలిక అవసరాలను గుర్తించారు. ఉద్యమకాలం నుంచే రాష్ట్ర వెనుకబాటుతనాన్ని కండ్లారా చూసి వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించారు. నీళ్లు, నిధులు, నియామకాలనే నినాదంలో మొదటిదైన నీటి పారుదల ప్రాజెక్టులపై దృష్టిసారించారు. ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తిచేసి కోటి ఎకరాల మాగాణాన్ని నీటితో తడిపారు. గోదావరి నీటిని ఎత్తుకు ప్రవహింపజేసి నదికి నడకనేర్పారు. అందుకే కేసీఆర్‌ను అపరభగీరథుడంటారు. పట్టుదల, కార్యసాధనలో కేసీఆర్ భగీరథుడి కంటే ఎక్కువే!

నిధుల విషయానికొస్తే.. 'సంపద పెంచు, పేదలకు పంచు' అనే నినాదంతో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా నడిపిస్తున్నారు. తెలంగాణ చిన్న రాష్ట్రమైనా, అవతరించి దశాబ్దకాలం కూడా పూర్తికాకున్నా కేసీఆర్ ముందుచూపు, పరిపాలనాదక్షత, కార్యదీక్షతో అనేక అంశాల్లో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలుస్తున్నది. తెలంగాణ జీడీపీ దేశ జీడీపీని మించిపోయింది. రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా బాగా పెరుగుతుండటం రాష్ట్ర ప్రజల సగటు ఆదాయాన్ని తెలియజేస్తున్నది. రాష్ట్రం మౌలిక సదుపాయాల్లో అగ్రగామిగా నిలిచింది. ఎగుమతుల్లో వృద్ధిరేటు పరుగులు తీస్తున్నది. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, పంటకు పెట్టుబడి ఇవ్వడంతో రైతుల ఆదాయం పెరిగింది. రైతుబంధు, దళితబంధు, చేపపిల్లల పంపిణీ, గొర్ల పంపిణీ తదితర పథకాలు గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేశాయి. ధాన్యం దిగుబడిలో తెలంగాణ పంజాబ్‌ను దాటి మొదటిస్థానాన్ని ఆక్రమించింది. రాష్ట్ర రైతులు ప్రతి సీజన్‌లో కోట్ల రూపాయల విలువైన ధాన్యం పండించి దేశానికి అన్నం పెడుతున్నారు.

నియామకాల్లోనూ తెలంగాణ మిగతా రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వంతో పోలిస్తే ఎంతో ముందున్నది. ప్రస్తుతం లక్ష ఉద్యోగాల భర్తీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతున్నది. మరోవైపు తెలంగాణకు వరదలా వస్తున్న ప్రైవేటు కంపెనీల పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. ఇటీవల నాలుగు రోజులు దావోస్ పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ దాదాపు రూ.21 వేల కోట్ల విలువైన పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. ఒక్క టీఎస్ఐపాస్ ద్వారానే గత ఎనిమిదేండ్లలో 17,43,204 మంది ఉద్యోగాలు పొందారు. ఎనిమిదేండ్లలో సీఎం కేసీఆర్ 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశారు. అంటే సగటున రాష్ట్రంలో అర్హులైన ప్రతి లక్ష మందిలో 1,643 మందికి కొలువులు వచ్చాయి.

దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. మనది గ్రామీణ భారతం కాబట్టి, గ్రామస్థాయి నుంచే అభివృద్ధి జరగాలని దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ ఆశించారు. కానీ 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఎవరూ సాధించలేనిది కేసీఆర్ సాధించి చూపారు. గాంధీజీ ఆశయాన్ని ఆచరణలో పెట్టిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్. ఈ రోజు రాష్ట్రంలో ఏ మారుమూల పల్లెను పలకరించినా, పచ్చదనంతో, పరిశుభ్రతతో, శ్మశాన వాటికలు, పార్కులు, క్రీడామైదానాలు, రైతు వేదికలతో కళకళలాడుతున్నది. పట్టణాలు, నగరాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. హైదరాబాద్‌లో అనేక అత్యాధునిక మౌలిక వసతులు సమకూరాయి. ఫ్లై ఓవర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, కేబుల్ బ్రిడ్జి లాంటివి హైదరాబాద్‌కు కొత్త హంగును తీసుకొచ్చాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా కవి, రచయిత, సాహిత్యవేత్త, భావుకుడు. అంతకుమించి పరమ భక్తుడు, ఆధ్యాత్మిక చింతనాపరుడు. 'తెలంగాణ' ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పరిపాలన మొదలైన తొలినాళ్లలోనే 'ప్రపంచ తెలుగు మహాసభలు' నిర్వహించి, తెలంగాణ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. 'ఆయుత చండీయాగం' ఘనంగా నిర్వహించారు. యాదాద్రి మహానిర్మాణంతో ప్రపంచ పర్యాటకులంతా తెలంగాణ వైపు చూస్తున్నారు. గత తొమ్మిదేండ్లలో ఎములాడ రాజన్న, కొండగట్టు అంజన్న, సమ్మక్క సారక్కలు, బాసర సరస్వతి, భద్రాద్రి రాముడి ఆలయాల అభివృద్ధితో ఆధ్యాత్మిక పర్యాటకం కోటి ప్రభలతో వెలుగొందుతున్నది.

**తెలంగాణ రాష్ట్రం నేడు మత సామరస్యానికి, గంగా జమునీ తహజీబ్‌కు వేదికగా నిలిచింది. సర్వ మతాల సంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తున్నది. కులమతాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమం అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలను అమలుపరుస్తూ లౌకికవాదాన్ని కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. తెలంగాణ ఫలాలు దేశమంతటికీ విస్తరించాలన్న దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతిని గెలిపించేందుకు నడుం బిగించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందడుగు వేస్తున్నది. ఆ దిశగానే పార్టీ అధినాయకుడు, సీఎం కేసీఆర్ అడుగులు వేస్తున్నారు.**

రైతుబంధు, రైతు బీమా పథకాలను జాతీయస్థాయిలో విస్తరిస్తే.. సాధించే ఫలితాలను వివరిస్తూ కేసీఆర్ తన ప్రసంగాలతో దేశ ప్రజలను ఆలోచనలో పడేస్తున్నారు. బక్కపల్చని మనిషి ఉక్కు సంకల్పంతో రేపు భారత జాతిని ప్రపంచంలో మేటిగా నిలబెట్టగలరని మనం ఇప్పుడు గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పొచ్చు. ఎందుకంటే కేసీఆర్ దీక్షా దక్షతలు మనకు తెలుసు కాబట్టి. ఆయన ప్రజలను గెలిపించి, దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుతారనడంలో సందేహం లేదు.

**తెలంగాణకు వరదలా వస్తున్న ప్రైవేటు కంపెనీల పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. ఇటీవల నాలుగు రోజులు దావోస్ పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ దాదాపు రూ.21 వేల కోట్ల విలువైన పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. ఒక్క టీఎస్ఐపాస్ ద్వారానే గత ఎనిమిదేండ్లలో 17,43,204 మంది ఉద్యోగాలు పొందా రు. ఎనిమిదేండ్లలో సీఎం కేసీఆర్ 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశారు. అంటే సగటున రాష్ట్రంలో అర్హులైన ప్రతి లక్ష మందిలో 1,643 మందికి కొలువులు వచ్చాయి.**




**సయ్యద్ నజీం అహ్మద్**
90323 16234

(వ్యాసకర్త : బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి)

# అవి 'ఆపద' యాత్రలు

**అనగనగా ఒక రాజు. ఆ రాజు తనకున్న ప్రజాదరణతో రాజ్యాధికారం చేపట్టి ఆ రాజ్యాన్ని అభివృద్ధి బాటలో నడుపుతూ రాజ్యంలోని ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నారు. వారి బాధలను తెలుసుకొని వాటికి పరిష్కారాన్ని చూపుతూ ముందుకు సాగిపోతున్నారు. సాధించుకున్న రాజ్యాన్ని మిగతా రాజ్యాలకు ధీటుగా తీర్చిదిద్దుతూ ఇక్కడి ప్రజల కష్టనష్టాలను దూరం చేయగలిగారు. అయితే ఇలాంటి సంక్షేమ రాజ్యంలో ఏదో జరుగుతున్నదని ప్రతిపక్షాలు పాదయాత్రలు మొదలు పెట్టాయి. ఒకరి తర్వాత ఒకరుగా అందరూ యాత్రలు మొదలు పెట్టారు. పాదయాత్రల పేరుతో తెలంగాణలో కుట్రలకు తెరలేపుతున్నారు.**

పాదయాత్రలు ఒకప్పటి ట్రంపుకార్డులు. కానీ ఈ తరం రాజకీయ నేతలు చేస్తున్న పాదయాత్రల్లో చిత్తశుద్ధి లోపించింది. నిజానికి భారతదేశంలో ఆధునిక పాదయాత్రలకు ఆద్యుడు మహాత్మా గాంధీ. 1930లో ఆయన ఉప్పు సత్యాగ్రహం పేరిట నిర్వహించిన పాదయాత్ర భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక మైలురాయి. అది ఓ లక్ష్యం కోసం. ఆ తరువాత ఆయన 1933-34లో అంటరానితనానికి వ్యతిరేకంగా మరోసారి దేశవ్యాప్త పాదయాత్ర చేశారు. అదికూడా సమున్నత ఆశయం కోసం. అనంతరం 1951లో వినోబాభావే భూదాన్ ఉద్యమంలో భాగంగా తెలంగాణ నుంచి మొదలుపెట్టి బీహార్‌లోని బోధ్‌గయ వరకు నడిచారు. అది ఓ కార్యాచరణ సిద్ధికోసం. ఇక 1983లో అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని చంద్ర శేఖర్ ప్రజల కష్టసుఖాలు, దేశంలో పరిస్థితులు తెలుసుకునేందుకు ఆరునెలల పాటు 4,260 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఈ క్రమంలో ఆయన కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకు నడిచారు. ఆయన యాత్రకు రాజకీయాలకతీతంగా స్పందన లభించింది. ఆ తర్వాత ఎల్‌కే అద్వాని నిర్వహించిన రథయాత్ర పార్టీ ఉనికిని చాటినా రాజకీయ లక్ష్యాలను నెరవేర్చలేకపోయింది.



ఇక తెలుగు రాష్ట్రాల్లో అందరికీ గుర్తొచ్చేది వైఎస్ పాదయాత్ర. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు 1500 కిలోమీటర్ల మేర సాగింది ఆ యాత్ర. నిజానికి నాడు నెలకొన్న సకల సమస్యలూ వైఎస్‌ను నడిపించాయి. టీడీపీ అధినేత అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో ఎన్నో కరెంట్ కష్టాలు. కరెంట్ చార్జీలు తగ్గించమని అడిగితే బషీర్‌బాగ్ చౌరస్తాలో జనాల్ని పిట్టల్లా కాల్చి చంపించిన సందర్భం. రైతుల ఆత్మహత్యల్లో నాడు ఏపీ టాప్. అందులో తెలంగాణలో ఊరూరా రైతుల ఆత్మహత్యలే. సాధికారతలేని మహిళలు... చిన్నాభిన్నమైన చేనేత రంగం. ఆకలిచావులు. ఇలా ఒకటేమిటి అన్ని రంగాలు టీడీపీ హయాంలో కకావికలమయ్యాయి.ఈ సమస్యలే నాటి కాంగ్రెస్ నేత ప్రతిపక్ష లీడర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని పాదయాత్ర వైపు కదిలించాయి. ప్రజాప్రస్థానం పేరుతో సాగిన పాదయాత్రను ఊరూరా జనం స్వాగతించారు. చంద్రబాబు దుష్టపాలనను అంత మొందించాలని జనం కోరుకున్నారు కాబట్టి నాడు వైఎస్ చేసిన యాత్ర సక్సెస్ అయింది...ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేసింది.

తీరా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ తెలంగాణ సమస్యల్ని గాలికొదిలేశాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను మరింత కష్టనష్టాల్లోకి నెట్టి వేస్తున్న కుట్రను గమనించిన కేసీఆర్ అదే జనంతో కలిసి ఉద్యమాలు నిర్మిం చారు. తెలంగాణ ఉద్యమం బలంగా రావడం, ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం వెరసి ఉద్యమంలో ఊరువాడా కదిలి వచ్చింది. అప్పట్లో ఉద్యమ నేత కేసీఆర్ ఊరూరా తిరుగుతున్నప్పుడు ప్రతీ సమస్యను ఆకళింపు చేసుకున్నారు. ప్రతి సమస్యపై ఆయన స్పందించిన తీరు జనంలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది. కేసీఆర్ వినూత్నంగా నిర్వహించిన ప్రతి కార్యక్రమం లక్ష్యాన్ని ముద్దాడింది. ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, సాకారమైన తెలంగాణను ఆగం చేసు కోకుండా స్వయం పాలనతో ప్రతీ సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా సాగుతున్నది.

తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలతో పురుడుపోసుకున్న ఉద్యమాన్ని అధికారంలోకి వచ్చాక సాకారం చేసింది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ వచ్చిన తొలి నాళ్లలోనే 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తొలి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, వృద్ధులకు ఆసరా పింఛన్లు, వికలాంగులకు పింఛన్లు, ఉద్యోగులకు పీఆర్సీ ముఖ్యంగా రైతు కేంద్రంగా దేశం మెచ్చుకునే రైతు బంధు, రైతుబీమా సహా ఒక్క వ్యవసాయశాఖలోనే ముప్పైకి పైగా పథకాలు. ఇక పరిపాలనను వికేంద్రీకరించి పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాల తెలంగాణగా మార్చారు కేసీఆర్. కొత్త అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం. కొత్త కలెక్టరేట్లు. కొత్త మెడికల్ కాలేజీలు. కొత్త పంచాయతీ, మండల భవనాలు...ఇలా తెలంగాణ తనను తాను పునఃనిర్మించుకుంటున్నది.

సీఎంగా కేసీఆర్ చేపట్టిన మరో సంస్కరణ పంచాయతీరాజ్ వ్యవస్థను వికేంద్రీకరించడం. సరికొత్త చట్టంద్వారా ఒక నూతన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరిపుష్టిగల పల్లెపట్టులను పునర్నిర్మాణం చేసే దిశగా తీసుకొన్న నిర్ణయం. ఈ ఒక్క నిర్ణయంతో తెలంగాణలో గ్రామపంచాయతీలు రెట్టింపు అయ్యాయి. ఇంతకాలం సమాజానికి దూరం గా.. ఎవరూ పట్టించుకోకుండా.. విసిరేసినట్లు ఉన్న తండాలు, గూడేలు స్వతంత్ర గ్రామపంచాయతీలయ్యాయి. గత ఏడు దశాబ్దాలలో ఏ ఒక్క పాలకుడూ చేయలేని, చేయడానికి సాహసించని అతి గొప్ప పరిపాలనా సంస్కరణ ఇది.

ఆడపిల్లల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముదిరాజులకు గొర్రెలపంపిణీ. యాదవులకు బర్రెలపంపిణీ, మత్స్యకారులకు చేపల పంపిణీ, నాయీబ్రాహ్మణులకు అత్యాధునిక సెలూన్లు.. రజకులకు అత్యంత ఆధునిక యంత్ర పరికరాలు,చేనేతలకు సబ్సిడీలు, కొనుగోలు వ్య వస్థల ఏర్పాటు, బీసీకులాలకు ఆత్మగౌరవ భవనాలుఇలా..ఒకటా రెండా అసాధారణ రీతిలో అభివృద్ధి జరిగింది. పింఛన్లు కావచ్చు, రైతు బంధు కావచ్చు, కల్యాణలక్ష్మి కావచ్చు. ఇలా ఏదో ఒక పథకం తెలంగాణలోని ప్రతి ఇంటికీ అందింది. అలాంటి తెలంగాణలోఇప్పుడు చెప్పుకోదగిన ఏ పెద్ద సమస్యా లేదు.

**కానీ ఇవాళ తెలంగాణలో ప్రతిపక్షాలు అధికారం కోసం సాగిస్తున్న యాత్రలు నక్కవాతలను తలపిస్తున్నాయి. ఎనిమిదేండ్లుగా బంగారుతెలంగాణవైపు అడుగులు వేస్తున్న తెలంగాణపై వారి కన్ను పడింది. తెలంగాణ సంపదను దోచుకునేందుకు కుట్రలు చేస్తున్నాయి..రాష్ట్ర సంపదను కొల్లగొట్టడానికి బీజేపీ, కాంగ్రెస్, షర్మిల రాష్ట్రంలో పాదయాత్రల బాట పట్టారు. కానీ కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప ప్రజల సమస్యలు పట్టని యాత్రలను ఎవరూ పట్టించుకోవడం లేదు.**

తెలంగాణలో బీజేపీ చీఫ్ ఐదు సార్లు నిర్వహించిన ప్రజా సంగ్రామయాత్ర అట్టర్ ఫ్లాప్.ఆయన నిర్వహించిన యాత్రలు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయి తప్ప ప్రజలకు ఒరిగిందేంలేదు. మోదీ, అమిత్ షా, నడ్డా, కేంద్ర మంత్రులొచ్చినా చేరికల కోసం ఓ కమిటీ వేసినా అన్నీ తూచ్ అయ్యాయి. కేంద్ర కాంగ్రెస్ హత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహించినా అది అట్టర్ ఫ్లాప్ అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేస్తున్న యాత్రలో సవాలక్ష గ్రూపులు. రేవంత్ గో బ్యాక్ అని సొంత పార్టీ నేతలే షాక్ ఇస్తున్నారు. ఇక తెలంగాణలో మరో అద్దెకూలీ వైఎస్ షర్మిల. ఈమె జనానికి డబ్బులిచ్చి పోగేసి తిరుగుతున్నారు. రాజన్న రాజ్యం తీసుకువస్తానంటూ చేస్తున్న పాదయాత్ర విఫలయాత్రగా మారింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఏమీ లేకపోవడంతో అధికార పార్టీ నేతలపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేస్తోంది..వ్యక్తిగత దూషణలకు దిగుతున్నది.

రాష్ట్రంలో విపక్షాలు చేస్తున్న పాదయాత్రలపై తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేధావులు హెచ్చరిస్తున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగమాగం చేసేందుకు ఉత్తరాది పార్టీలు కుట్రలు చేస్తున్నాయని.. తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండి వీరి కుట్రలను భగ్నం చేయకపోతే.. మళ్లీ తెలంగాణ ఉత్తారాది పార్టీల కబంధహస్తాల్లో బందీగా మారే ప్రమాదం ఉందంటున్నారు తెలంగాణ మేధావులు..



**వెంకట్ గుంటిపల్లి**
94949 41001

# కేంద్ర విధానం కార్పొరేట్లకు లాభం



**రానున్న కాలంలో విద్యుత్ యూనిట్‌కు రూ.50కి అమ్ముకునే స్వతంత్రం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఇచ్చింది. దిగుమతి చేసుకున్న బొగ్గు, సహజవాయువు లేదా నాఫ్తా ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీలు యూనిట్‌కు 50 రూపాయల వరకు విద్యుత్‌ను విక్రయించడానికి అనుమతించబడ్డాయి.**



**ఆళవందార్ వేణు మాధవ్**
86860 51752

దిగుమతి చేసుకున్న 15 బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో గుజరాత్‌లోని ముంద్రాలో టాటా పవర్, అదానీ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. సలయలో ఎస్సార్ పవర్ ప్లాంట్, జెఎస్ డబ్ల్యూ రత్నగిరి, టాటా ట్రాంబే, ఉడిపి పవర్, మీనాక్షి ఎనర్జీ, జెఎస్‌డబ్ల్యూ, తోరంగల్లుల్ ప్లాంట్ల మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 17,600 మెగావాట్లు. సహజ వాయువు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల మొత్తం సామర్థ్యం 25,000 మెగావాట్లు.


గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో కరెంటు కష్టాలు తప్పడం లేదు. పంజాబ్‌లోని రైతులు తమ పొలాలకు నీరందించడానికి తమకు కావలసినప్పుడు కరెంటు ఇవ్వటం లేదని ఇప్పటికే ఫిర్యాదు చేస్తున్నారు. 2023 ఏప్రిల్ నాటికి విద్యుత్ అవసరాలు దాదాపు 200,000 మెగావాట్ల నుంచి 230,000 మెగావాట్లకు అంటే 15% పెరుగుతాయని ప్రభుత్వ సొంత అంచనాలు చూపిస్తున్నాయి. వేసవిలో విద్యుత్ సరఫరాలో లోటును నివారించేందుకు మార్చి 16 నుంచి జూన్ 15 వరకు పూర్తి సామర్థ్యంతో నడపాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే 15 దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్లను కోరింది. ఈ ప్లాంట్లు చాలా తక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. దిగుమతి చేసుకున్న బొగ్గు అధిక ధర కారణంగా ఉత్పత్తికి అధిక వ్యయం అవుతున్నది. దీంతో ప్రభుత్వ యాజమాన్యంలోని పంపిణీ సంస్థలతో దీర్ఘకాలిక స్థిర ధరల సరఫరా ఒప్పందాలను కుదుర్చుకున్నందున వారు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడానికి నిరాకరించారు.

**గతేడాది కరెంటు కొరత ఏర్పడినప్పుడు విద్యుత్‌కు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లో యూనిట్‌కు రూ. 20. ఐఈఎక్స్ అనేది ప్రతిరోజూ శక్తిని విక్రయించే, కొనుగోలు చేసే వేదిక. సరఫరా, డిమాండ్ ఆధారంగా ధరలు నిర్ణయించబడతాయి.**

విద్యుత్ సంస్థల లాభదాయకతకు వ్యతిరేకంగా నిరసనలు రావడంతో ప్రభుత్వం ఐఈఎక్స్‌లో విక్రయించే గరిష్ఠ ధర విద్యుత్‌ను రూ.12గా నిర్ణయించవలసి వచ్చింది.ఇప్పుడు ధరల పరిమితిని రూ.50కు పెంచడం ద్వారా , విద్యుత్ కొరతను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, వినియోగదారుని, లాభదాయకుడిని దోపిడీ చేయడానికి ప్రభుత్వం ఈ విద్యుత్ కంపెనీలకు స్వేచ్ఛనిచ్చింది. విద్యుత్ మంత్రిత్వ శాఖ కూడా (2023 జనవరి 9న) ప్రభుత్వ యాజమాన్యంలోని అలాగే ప్రైవేట్ థర్మల్ పవర్ ప్లాంట్‌లకు బొగ్గు కొరతను తీర్చడానికి దేశీయ బొగ్గుతో ఆరు శాతం చొప్పున కలపడానికి బొగ్గును దిగుమతి చేసుకోవాలని ఆదేశించింది. ఇది ఇతర దేశాలలో బొగ్గు గనులను కలిగి ఉన్న అదానీ, టాటా వంటి పెద్ద భారతీయ కార్పొరేట్ గ్రూపులకు మళ్లీ ప్రయోజనం చేకూరుస్తుంది.అదానీ గ్రూప్ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, భారతదేశం అంతటా 50 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ కెపాసిటీ కలిగిన బొగ్గు గనులను కలిగి ఉన్నది, గ్లోబల్ మార్కెట్లలో విక్రయించడానికి ,అదానీ స్వంత పవర్ స్టేషన్‌లలో ఉపయోగించేందుకు ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుంది. గత సంవత్సరం కూడా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు అవసరాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం విద్యుత్ ప్లాంట్లను బొగ్గు దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. దిగుమతి చేసుకున్న బొగ్గు వినియోగం వల్ల లేదా ఐఈఎక్స్ వద్ద అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని అదనపు ఖర్చులు వినియోగదారుల నుంచి వసూలు చేయబడతాయి.

ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద బొగ్గు నిల్వలు భారత్‌లో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి ఏటా బొగ్గు కొరత ఎందుకు ఏర్పడాలి? దేశంలో అత్యధికంగా బొగ్గును రెండు ప్రభుత్వ రంగ సంస్థలు – కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ ఉత్పత్తి చేస్తున్నాయి. కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేయడం, బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఈ రెండు కంపెనీలకు గొప్ప అనుభవం ఉన్నది. వారిని ప్రోత్సహించి, వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి వనరులను అందించడానికి బదులుగా, ప్రభుత్వాల తర్వాత ప్రభుత్వాలు ప్రైవేట్ బొగ్గు గనుల అభివృద్ధి, ఉత్పత్తిపై దృష్టి సారించాయి. కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ రెండూ తమ బొగ్గు బ్లాకులను ప్రైవేట్ మైనింగ్‌కు అప్పగించాలని కేంద్రం కోరింది. కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేయడం, దాని బొగ్గు ఉత్పత్తిని వేగంగా పెంపొందించడంలో పెట్టుబడి పెట్టడానికి బదులుగా ఎరువుల ఉత్పత్తి , పునరుత్పాదక ఇంధన అభివృద్ధిలో పెట్టుబడి పెట్టాలని కోల్ ఇండియాను కోరింది. గనుల నుంచి విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు రవాణా చేసే సామర్థ్యాన్ని కూడా రైల్వేలు పెంచుకోవాలి. రైల్వేల విషయంలో కూడా, సరుకు రవాణాతో సహా వివిధ కార్యకలాపాలను ప్రైవేటీకరించే మార్గాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నది. పెరిగిన విద్యుత్ రేట్ల ద్వారా ప్రైవేటీకరణ విధానం వల్ల దేశ ప్రజలు ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్రైవేటీకరణ విధానాన్ని ప్రజలు వ్యతిరేకించకపోతే రాబోయే సంవత్సరాల్లో ఈ భారం మరింత పెరుగుతుంది.

## ఆమె ఒక జీవనది



ఆమె మమ్మల్నందరిని
పిల్ల కాలువల్లా కలిపేసుకుంటూ
కుటుంబ ప్రవాహాన్ని
ఉరకలెత్తించే మా పెన్నిధి

ఆ శిఖరం
గగనపుటంచులను తాకే ఖ్యాతితో
కుటుంబ ఔన్నత్యాన్ని పెంచే
ఒక మేరు పర్వతం

ఆ అంబరానికి
అంతుచిక్కని రహస్యాలెన్నో
మదిని తొలుస్తున్నా
మనసులో నక్షత్రాల్లా
మమ్మల్ని పొదువుకునే అంతరిక్షం

ఆ సాగరం
అల్లకల్లోలితమైన అలలతో
చెదిరీ చెదరని కలలతో
గుండెల్లో పరివారపు ఆశలతో
మా ప్రతిరూపాలను నిత్యం మోసే
మా ఇంటి కడలి

పొద్దున్నే సూర్యుడిని
చీపురుతో నిద్రలేపుతుంది
గడియారంతో పరిగెడుతూ
పరివారం కోసం
పరితపిస్తుంటుంది

ఆమె నవ్వితే
మా ఇంట్లో పూలతోటలు విరబూస్తాయి
అలిగితే ఇల్లంతా అంధకార బంధురమే!

అమ్మ, అమ్మమ్మ, నానమ్మ,
చిన్నమ్మ, పెద్దమ్మ, అత్తమ్మ,
ఇలా నాకు అమ్మలెందరున్నా

ఆమె మాత్రం
ఎప్పటికీ
మమతల్ని పంచే
మా 'ఇంటి దేవతే..!'



-ఎన్. లహరి
98855 35506